అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 5-6-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 97 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam | 10 పేజీలు | వెల : 6.50



హస్తానికి అధికారమిస్తే ఆగమవుతాం

వస్తే.."రైతు బంధుకు రాం రాం.. దళిత బంధుకు జై భీమ్" అంటుంది

- మరోసారి కిసాన్ సర్కార్ రావాలని అందరి ఆకాంక్ష : ముఖ్యమంత్రి కేసీఆర్
- నిర్మల్ జిల్లాకు నిధుల కేటాయింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే" రైతు బంధుకు రాం రాం.. దళిత బంధుకు జై భీమ్" అంటుందని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ఆరోపించారు. అధికారం కోసం హస్తం నాయకులు కాసుకొని కూర్చున్నారని, వాళ్లకు అప్పజేప్తే ఆగమవుతామని వ్యాఖ్యానించారు. ధరణిని బంగాళాఖాతంలో కలపాలంటున్న వారినే బంగాళాఖాతంలోకి విసిరేయాలన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన సీఎం కేసీఆర్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంతో పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం రూ. కోట్లాది నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం పట్టణానికి సమీపంలోని ఎల్లపెల్లి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాకు వరాలు కురిపించారు. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.10లక్షలతో పాటు మున్సిపాల్టీలకు రూ.25 కోట్ల చొప్పున, మండల కేంద్రాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే కంటికి అందకుండా మింగేస్తుందని వ్యాఖ్యానించారు. కులాలు, మతాలు అనే తేడా లేకుండా అందరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. రైతు బంధు బ్యాంకులకు వెళ్లగానే వెంటనే వస్తుందని, దరఖాస్తు లేకుండానే బీమా చెక్కు వస్తుందని తెలిపారు. వడ్ల డబ్బులు బ్యాంకులో వేస్తున్నామని తెలిపారు. ధరణిని తీసేస్తే ఇవన్నీ జరుగుతాయా అని ప్రశ్నించారు. ధరణిని చూసి మహారాష్ట్ర వాసులు ఆశ్చర్యపోతున్నారని, మరో సారి కిసాన్ సర్కార్ రావాలని అందరూ కోరుకుంటున్నారని స్పష్టంచేశారు. మరోసారి అధికారంలోకి వస్తే తాలుకాల వారీగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడతామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం 27, 28 ప్యాకేజీ పనులు త్వరగా పూర్తి చేస్తామని, లక్ష ఎకరాలకు నీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఒకప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలుషిత నీటి కారణంగా రోగాలతో సతమతమయ్యేదని, మిషన్ భగీరథ నీళ్లు రావటంతో రోగాలు లేకుండా పోయాయన్నారు. బాసర క్షేత్రాన్ని కొద్ది రోజుల్లోనే అద్భుత ఆలయంగా నిర్మిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తామని తెలిపారు. గూడేలు, తండాల్లో 'మావనాటే మావరాజ్' పాలన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, జోగురామన్న, రాథోడ్ బాపురావ్, రేఖనాయక్, దివాకర్‌రావు, దుర్గ చిన్నయ్య, ఆత్రం సక్కు తదితరులు పాల్గొన్నారు.

కాగ్ అక్షింతలు వేసినా..
మారని కేంద్రం



మోడీ సర్కార్ వాదనలకు విరుద్ధంగా గతేడాది నివేదిక

- ట్రాక్‌ల నిర్వహణ, బడ్జెట్ కేటాయింపులు, వ్యయం, పోస్టుల ఖాళీలపై కేంద్రానిది తీవ్ర నిర్లక్ష్యం

ఒడిశా బాలసోర్ రైలు ప్రమాదంలో భారీ ప్రాణ నష్టం సంభవించింది. అయితే దీనికి బాధ్యులెవరు? రైల్వేపై కాగ్ తన రిపోర్టులో లోపాలు ప్రస్తావించినా.. మోడీ ప్రభుత్వం మాత్రం గుణపాఠంగా తీసుకోలేదు. దాని వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్పష్టమవుతున్నది. ఇప్పటికీ తమ వారు బతికే ఉన్నారో లేక చనిపోయారో తెలియని ప్రయాణీకుల కుటుంబాల రోదనలు ఒడిశాలోని ఆస్పత్రుల ముందు మిన్నంటుతున్నాయి. కానీ మోడీ ప్రభుత్వం మాత్రం ఈ ప్రమాదాలకు కారణమైన వ్యవస్థాగత లోపాలను గుర్తించకుండా ఉద్యోగుల వ్యక్తిగత చర్యలనే కారణంగా చూపే ప్రయత్నం చేస్తున్నది. ఈ ప్రమాదాలను నివారించే చర్యల గురించి కేంద్రం శ్రద్ధ తీసుకోవటం లేదని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.



న్యూఢిల్లీ : ఒడిశా రైలు ప్రమాద ఘటన దేశాన్ని తీవ్రంగా కలచి వేసింది. ప్రపంచ దేశాధినేతల నుంచి సైతం విచారం వ్యక్తమైంది. అయితే ఈ ప్రమాదం విషయంలో మోడీ సర్కారు తీరు విమర్శల పాలవుతున్నది. రైల్వేలలో ...2లో

సీబీఐ విచారణకు రైల్వేబోర్డు సిఫారసు

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన

2లో..

గుట్టలుగా.. గుర్తుపట్టని విధంగా

- మార్చురీల వద్దే భారీగా మృతదేహాలు

2లో..



శాంతి భద్రతల రక్షణలో తెలంగాణ టాప్

హోం మంత్రి మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



- ట్యాంక్‌బండ్‌పై పోలీస్ శాఖ సురక్ష దినోత్సవ వేడుకలు
- పోలీసు వాహనాల భారీ ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహ ఆవరణలో పోలీస్ విభాగాల స్టాళ్ల ప్రదర్శన

వివరాలు 5లో..

రాజద్రోహ చట్టం సమర్థనీయం కాదు



ఈ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలి

- లా కమిషన్ సిఫారసులు ఆక్షేపణీయం
- ప్రజాస్వామ్యానికి ఇదో గొడ్డలిపెట్టు
- ఒడిశా రైలు ప్రమాదానికి మోడీదే నైతిక బాధ్యత : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఇప్పటికైనా రైల్వే ప్రయివేటీకరణ ఆపాలి: సీపీఐ(ఎం) నేత పి. సుదర్శన్

వివరాలు 5లో..

బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు

- సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. మహిళా రెజ్లర్లకు అండగా నిలుద్దాం..అండగా నిలుద్దాం.., రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై పోక్సో యాక్టు కింద కేసు పెట్టాలి..కేసు పెట్టాలి.., బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి...అరెస్టు చేయాలి... రేపిస్టులకు అండనా?..బాధితులపై కేసులా? సిగ్గుసిగ్గు...' అంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ దహనం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.సాయిబాబు మాట్లాడుతూ..లైంగిక దాడి ఆరోపణలు వస్తున్నా సొంత పార్టీ ఎంపీ కాబట్టే బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేయడం లేదని విమర్శించారు. రోజురోజుకీ రెజ్లర్లకు పౌరసమాజం మద్దతు పెరుగుతుండటం, మరోవైపు కేసు నమోదు ...5లో

పర్యావరణహితంలో మనమే నెం1

సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) నివేదికలో మొదటి స్థానంలో తెలంగాణ



- ప్రభుత్వ సమగ్ర, సమతుల్య పర్యావరణ విధానాలకు దక్కిన గుర్తింపు : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్న వేళ మరో అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ ...5లో

తెలంగాణలోనూ బీజేపీని తుడిచిపెట్టేస్తాం

కర్నాటక తరహాలోనే రిజల్ట్స్ ఖాయం : రాహుల్ గాంధీ

న్యూయార్క్: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తమ పార్టీ ఇతర రాష్ట్రాల్లోనూ ఆ పరంపరను కొనసాగిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లోనూ బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందని చెప్పారు. కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదని.. యావత్తు దేశం విద్వేషపూరిత సిద్ధాంతాలను ఓడించేందుకు సిద్ధమైందని బీజేపీపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

"బీజేపీని తుడిచిపెట్టేయగలమని కర్నాటకలో నిరూపించాం. మేం వారిని కేవలం ఓడించలేదు. తుడిచిపెట్టేశాం" అని న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్- యూఎస్ఏ నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ అన్నారు. ప్రస్తుతం ...5లో



ఈటల వర్సెస్ బండి

బీజేపీలో రగులుతున్న అంతర్గత పోరు

బీజేపీలో అంతర్గత పోరు రోజురోజుకీ ముదిరిపాకానపడుతున్నది. కొండా..ఈటెల...బండి...ఇలా నేతల బహిరంగ వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోస్తున్నట్టు కనిపిస్తున్నది. పాతోళ్ల పోరుతో కొత్తోళ్లంతా గ్రూపు గట్టి హస్తంపార్టీ వైపు చూస్తున్నట్టు ప్రచారం జోరుగా సాగుతున్నది. నష్టనివారణ కోసం త్రిమూర్తులు (ప్రధాని మోడీ..అమిత్‌షా, జేపీ నడ్డా) రంగంలోకి దిగినా, ఎన్ని ఎత్తులేసినా...బలవంతపు కాపురం ఎక్కువరోజులు సాగదన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఎన్నికల నాటికి పార్టీలో ఎవరుంటారో? ఎవరు పోతారో? అర్థంకాని దైన్యస్థితి నెలకొంది.

- అణగదొక్కితే అణిగిపోయే వ్యక్తిని కాదంటూ బండి వ్యాఖ్య
- ఈటల, బండి బహిరంగవ్యాఖ్యలతో వివాదాలకు మరింత ఆజ్యం
- కాంగ్రెస్‌వైపు కొత్తోళ్ల చూపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈటల రాజేందర్, బండి సంజయ్‌కుమార్‌లది ఉమ్మడి కరీంనగర్ జిల్లానే. ఈటల రాజేందర్ బీజేపీలో చేరే సమయంలోనే తన అనుచరుల కోసం తాను అడిగిన అసెంబ్లీ నియోజకవర్గాల సీట్లను ఇవ్వాల్సిందేనని పట్టుబట్టి అధిష్టానం నుంచి హామీ పొందారు. ఆ తర్వాతే పార్టీలో చేరారు. రాష్ట్ర పార్టీని ఏమాత్రం పట్టించుకోకుండా ఏ సమస్య వచ్చినా నేరుగా జాతీయ నాయకత్వంతోనే చర్చిస్తున్నారు. ఇదే అంశంలో బండి సంజయ్ మొదటి నుంచీ ఈటలను వ్యతిరేకిస్తూనే ఉన్నారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయిన తర్వాత ఢిల్లీకే పరిమితం కావడం, లక్ష్మణ్‌ను ఎంపీగా చేసి రాష్ట్రంలో కీలక బాధ్యతల నుంచి బీజేపీ తప్పించిన తర్వాత అంతా బండి హవానే కొనసాగింది. చివరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో చిన్న ప్రెస్‌మీట్ పెట్టాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే. ఈటల వచ్చిన తర్వాత పరిస్థితుల్లో క్రమంగా మార్పు మొదలైంది. బండి గ్రూపునకు ఇది అస్సలు నచ్చడం లేదు. పైగా, ఈసారి కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి కాకుండా వేములవాడ నుంచి బరిలో దిగాలని బండి చూస్తుంటే ఆదిలోనే ఈటల దానికి బ్రేకులు ...2లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ప్రపంచ గమనం

జర్మన్ చాన్సలర్ ''యుద్ధ పిపాసి''!




బెర్లిన్ : జర్మన్ చాన్సలర్, ఒలాఫ్ స్కోల్జ్ కు తన పార్టీ మద్దతుదారులతోనే చేదు అనుభవం ఎదురైంది. 'యూరోపియన్ ఫెస్టివల్' పేరుతో తన నాయకత్వంలోని సోషల్ డెమోక్రాటిక్ పార్టీ(ఎస్పీడీ) బెర్లిన్ కు సమీపంలోగల బ్రాండెన్బర్గ్ రాష్ట్రంలోని ఫాల్కెన్సీ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కోల్జ్ కు నిరసన సెగ తగిలింది.రుప్ట్ లై విడియో ఏజన్సీ విడుదల చేసిన విడియోలో ఆహూతులు స్కోల్జ్ ని 'ప్రజాద్రోహి', 'యుద్ధపిపాసి' అని విమర్శించటం కనిపించింది. జర్మన్ చాన్సలర్ కు చాలా తక్కువమంది మద్దతుదారులు స్వాగతం పలికారు. సభికులలోని ఒక సమూహం 'ఆయుధాలు లేని శాంతి' కావాలని నినదిస్తూ స్కోల్జ్ ని 'అబద్దాలకోరు', 'దొంగ' అని గొంతెత్తి అరుస్తూ 'వెళ్ళిపో' అని నినదించటం కనిపించింది. ఒకవైపు నిరసన సెగ తగులుతున్నా స్కోల్జ్ తన ప్రభుత్వ విధానాలను సమర్థించుకుంటూ ఉక్రెయిన్ పైన సైనిక దాడికి పురికొల్పిన రష్యన్ అధ్యక్షుడు, వ్లాడీమీర్ పుతినే 'యుద్ధపిపాసి'అని ఆయన అన్నాడు. విమర్శించాల్సింది రష్యన్ అధ్యక్షుడినేగానీ తనను కాదని ఆయన అన్నారు. అయితే మే నెలలో 'యుగవ్' అనే సంస్థ నిర్వహించిన సర్వేలో మెజారిటీ జర్మన్లు ఉక్రెయిన్, రష్యాల మధ్య శాంతి చర్చలు జరగాలని కోరారు. సర్వేలో స్పందించిన వాళ్ళలో 54శాతం మంది నాటోలో ఉక్రెయిన్ సభ్యత్వాన్ని వ్యతిరేకించారు. ఉక్రెయిన్ యుద్ధంలో జర్మనీ పెద్ద ఎత్తున సైనికంగా ఉక్రెయిన్ కు మద్దతు ఇవ్వటం జర్మన్లకు ఇష్టంలేదు. ఫిబ్రవరి నెలలో జరిగిన సర్వేలో ఉక్రెయిన్ కు యుద్ధ విమానాలను సరఫరా చేయటాన్ని మూడింట రెండు వంతుల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. 2022 డిసెంబర్ లో 'యుగవ్' నిర్వహించిన సర్వేలో జర్మనీ లియోపర్డ్ 2 ట్యాంకులను సరఫరా చేయటాన్ని 45శాతం ప్రజలు వ్యతిరేకించారు. అంతేకాకుండా అనేకమంది జర్మన్ ప్రముఖులు చాన్సలర్ స్కోల్జ్ కు రెండు బహిరంగ లేఖలను పంపారు. ఉక్రెయిన్ కు ఆయుధాల సరఫరా చేయటంమాని కాల్పుల విరమణకు, శాంతి చర్చలు జరపటానికి జర్మనీ ప్రయత్నించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఆయుధ సరఫరా వార్త అబద్ధం : దక్షిణ కొరియా



సియోల్ : యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధాన అధినేత జోసెప్ బోర్రెల్ తో ఉక్రెయిన్ కు ఆయుధ సరఫరా అంశం గురించి అసలు చర్చించనే లేదని దక్షిణ కొరియా రక్షణ మంత్రి, లీ జోంగ్-సప్ ఆదివారం మీడియాకు చెప్పారు. అంతకు ముందు సింగపూర్ లో జరిగిన షంగ్రిలా భద్రతా సమావేశం జరిగినప్పుడు బోర్రెల్ తనకు లీ తో మంచి సమావేశం జరిగిందని తెలిపారు. ఆ సమావేశంలో ఉత్తర కొరియా రెచ్చగొట్టటం గురించి, ఉక్రెయిన్ ఆయుధ సహాయం గురించి చర్చించినట్టు ఆయన పేర్కొన్నారు. దక్షిణ కొరియా రక్షణ మంత్రిత్వశాఖ అటువంటిది ఏమీ జరగలేదని ప్రకటించింది. రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ కు కావలసిన ఆయుధాల గురించి బోర్రెల్ వివరించటం మినహా ఏమీ జరగలేదని దక్షిణ కొరియా ప్రకటించింది. దక్షిణ కొరియా ఎదురు తిరగటంతో బొర్రెల్ తను పోస్ట్ చేసిన ట్వీట్ ను డిలీట్ చేశారు. ఆ తరువాత పోస్టు చేసిన మరో ట్వీట్ లో "ఉక్రెయిన్ ఆయుధ అవసరాలను నేను వివరించాను" అని పేర్కొన్నారు. 2022 ఫిబ్రవరి నెలలో ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్ప టినుంచీ దక్షిణ కొరియా ఉక్రెయిన్ కు వందల మిలియన్ డాలర్ల ఆర్థిక, మానవతా సహాయం అందించింది తప్ప ఆయుధ సరఫరా చేస్తానని అనలేదు. అయితే ఏప్రిల్ నెలలో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సక్ యెవోల్ తన వైఖరి మారినట్టు సంకేతాలను ఇచ్చారు. ఉక్రెయిన్ కు వందల వేల ఫిరంగి గుండ్లను సరఫరా చెయ్యటానికి అమెరికాతో దక్షిణ కొరియా ఒక రహస్య ఏర్పాటు చేసుకున్నట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక రాసింది. ఆ నివేదికపైన స్పందిస్తూ అది వాస్తవాలకనుగుణంగా లేదని దక్షిణ కొరియా అధికారులు అన్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగించటానికి మాత్రమే ఉపయోగపడే పశ్చిమ దేశాల ఆయుధ సరఫరాను రష్యా పదేపదే ఖండిస్తోంది. దక్షణ కొరియా ఉక్రెయిన్ కు ఆయుధ సరఫరా చేయటాన్ని 'బహిరంగ రష్యా వ్యతిరేక చర్య'గా భావిస్తామని ఏప్రిల్ నెల చివరలో రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా హెచ్చరించింది.

ఇండొనేషియా శాంతి ప్రయత్నాలను తిరస్కరించిన ఉక్రెయిన్



జకార్తా : రష్యాతో శాంతి చర్చలు జరపటానికి ఇండొనేషియా చేసిన ప్రతిపాదనలను రష్యా ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నాయనే పేరుతో ఉక్రెయిన్ తిరస్కరించింది. రష్యా ఆక్రమించిన భూభాగాల నుంచి రష్యా వెనుదిరగటమే ఏకైక వాస్తవిక ప్రతిపాదన అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి సలహాదారు మైఖైల్ పొడొలియాక్ ఒక ట్వీట్ లో రాశాడు. ఉక్రెయిన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఒలెగ్ నికొలెన్కో కూడా రష్యాలో కలుపుకున్న భూభాగాలను స్వాధీనం చెయ్యటం మినహా మరో మార్గం లేదని ఒక ఫేస్ బుక్ పోస్టులో రాశారు.రష్యా, ఉక్రెయిన్ సేనలు తమతమ వర్తమాన స్థితుల నుంచి 15కిలోమీటర్లు వెనక్కు ఉపసంహరించుకుని ఒక నిస్సైనిక ప్రాంతాన్ని సృష్టించాలని, అటువంటి నిస్సైనిక ప్రాంతాన్ని ఐక్యరాజ్య సమితి శాంతి సేనల పర్యవేక్షణలో ఉంచాలని సింగపూర్ లో శనివారం జరిగిన షంగ్రీలా భద్రతా ఫోరమ్ లో మాట్లాడుతూ ఇండొనేషియా రక్షణ మంత్రి, ప్రబోవో సుబియాంటో సూచించారు. అంతేకాకుండా తగాదా పడుతున్న ప్రాంతాలలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో రిఫరెండం జరిపి సమస్యను పరిష్కరించాలని కూడా ఆయన సూచించారు. ఇప్పటివరకు ఈ శాంతి ప్రతిపాదనలపైన రష్యా స్పందించలేదు. రష్యా, ఉక్రెయిన్ ల మధ్య శాంతి నెలకొనాలంటే ఉక్రెయిన్ నాటోలో చేరాలనే ఆలోచనను మానుకోవాలని, రష్యా తనలో కలుపుకున్న ప్రాంతాలపైన హక్కును వదులుకోవాలని రష్యా పట్టుబడుతోంది.

బ్యాంకుల ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి



ప్రజా సహకారంతో సమరశీల పోరాటాలే శరణ్యం

- 'బెఫీ' తెలంగాణ ద్వితీయ మహాసభ ప్రారంభంలో దెబాశిష్ బసు చౌదరి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రం ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను వేగవంతం చేసిందనీ, ప్రజా భాగస్వామ్యంతో ఈ చర్యల్ని సమర్థవంతంగా సమరశీల పోరాటాలతో తిప్పికొట్టాలని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) జాతీయ ప్రధాన కార్యదర్శి దెబాశిష్ బసుచౌదరి పిలుపునిచ్చారు. బెఫీ తెలంగాణ రాష్ట్ర శాఖ ద్వితీయ మహాసభలు ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. బెఫీ సీనియర్ నాయకులు ప్రకాష్‌పాండే బెఫీ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దెబాశిష్ బసుచౌదరి మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల విలీనంతో ఉద్యోగ సంఘాల బలం పెరిగినా, ప్రయివేటీకరణ ప్రమాదం వెంటాడుతూనే ఉందన్నారు. బీఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసినట్టే ప్రభుత్వరంగ బ్యాంకుల్నీ కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తూనే ఉందన్నారు. దానిలో భాగంగానే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో క్రమేణా వినియోగదారుల సేవల్ని కుదిస్తున్నారనీ, వారికి విసుగు కలిగించేలా సర్వీసుల్ని ఆలస్యం చేస్తున్నారని వివరించారు. దీనికి కారణం రెండు దశాబ్దాలుగా బ్యాంకుల్లోని ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయకపోవడమేనని చెప్పారు. దేశంలోని బ్యాంకుల్లో దాదాపు 20 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనీ, వాటిని భర్తీ చేయకపోవడం వల్ల ఉన్నవారిపై పనిభారం పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని కేంద్ర ప్రభుత్వం అప్పుడప్పుడు ప్రచారార్భాటం చేస్తున్నదనీ, కానీ ఆ ఉద్యోగాలన్నీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ల పేరుతో గంటలు, రోజువారీ వేతనాలు ఇచ్చేవేనని స్పష్టం చేశారు.

బ్యాంకుల్లో ఆ ప్రాతిపదికగా తీసుకున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులు అందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. గ్రామీణ బ్యాంకుల ప్రయివేటీకరణ వేగవంతం అయ్యిందనీ, దాన్ని నిలువరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల్లోని నాబార్డ్ బ్యాంకుల్ని బలోపేతం చేయాలనీ, నియామకాలు చేపట్టి, నిధులు కేటాయించాలని కోరారు. సహకార రంగంలోని బ్యాంకుల్ని సైతం కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టట్లేదనీ, వాటినీ ప్రయివేటుకు అప్పగించేలా నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్‌కు చెందిన నందిని, అమూల్ వంటి సంస్థల్ని కలిపి, వ్యవస్థల్ని ధ్వంసం చేస్తున్నారంటూ కర్నాటక ఘటనల్ని ఉదహరించారు. బ్యాంకుల్లో సేవల్ని కుదిస్తే, గత్యంతరం లేక ప్రజలు ప్రయివేటుకు మొగ్గుచూపుతారనే దుర్నీతితోనే కేంద్రప్రభుత్వం ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఖాళీ పోస్టుల్లో తాత్కాలిక ప్రాతిపదికన రిటైర్డ్ ఉద్యోగులను నియమిస్తున్నారనీ, 30-35 ఏండ్లకు పైగా సర్వీసు చేసి, ఉద్యోగ విరమణ జీవితాన్ని అనుభవించాల్సిన వయసులో వారితో పనిచేయించుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వరంగ సంస్థలపై జరుగుతున్న దాడుల్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలనీ, ఆ సంస్థలు నష్టపోతే సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో కూడా వివరించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే ప్రయివేటీకరణను తిప్పికొట్టగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. సుందరరామ్ ప్రసన్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆలిండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్ వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, బెఫీ తెలంగాణ రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి పీ వెంకట్రామయ్య, ఆర్బీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్వీ హరీశ్‌బాబు, గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలుగు జిలుగులు

విద్యుత్‌రంగంలో విశేష ప్రతిభ

- 9 ఏండ్లలో అనేక ఘన విజయాలు
- సాహో...సింగరేణి
- నేటి 'దశాబ్ది'లో విద్యుత్, సింగరేణి ఉత్సవాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్వరాష్ట్రం వస్తే ఏమొస్తుందని ఉద్యమ సమయంలో సందేహాలు వ్యక్తం చేసిన వారికి గడచిన 9 ఏండ్లలో రాష్ట్రంలో వెదజల్లిన కరెంటు వెలుగులే ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలిచాయి. సమైక్య పాలనలో సాధ్యంకాని మిగులు విద్యుత్‌ను ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత తెలంగాణ సాధించింది. అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఒడిసిపట్టి, కనీవినీ ఎరుగని రీతిలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నది. అన్నిరంగాలకు పుష్కలంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాను చేస్తున్నది. ఈ మొత్తంలో విద్యుత్‌రంగ ఉద్యోగులు, అధికారుల కృషి ప్రధాన కారణమైతే, దానికి తగినట్టే రాష్ట్ర ప్రభుత్వం కూడా సంపూర్ణ సహకారాన్ని అందించి, ఈ విజయాలను సాధించింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కోసం ప్రభుత్వం ఏటా రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నది. విద్యుదుత్పత్తి స్థాపిత సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 18,453 మెగావాట్లకు పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో 74 మెగావాట్లు మాత్రమే ఉన్న సోలార్ విద్యుదుత్పత్తి సామర్థ్యం ఇప్పుడు 5,741 మెగావాట్లకు పెరిగింది. కొత్తలైన్ల నిర్మాణం చేపట్టి పొరుగు రాష్ట్రాల నుంచి విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరుచుకుంది. కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) 7వ దశ నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. సింగరేణి ఆధ్వర్యంలో భూపాలపల్లి, జైపూర్ ప్లాంట్ల ద్వారా 1800 మెగావాట్ల విద్యుత్తును సమకూర్చుకుంది. జలవిద్యుదుత్పత్తినీ పెంచుకుంది. 1080 మెగావాట్లతో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. రూ.22,502 కోట్ల వ్యయంతో సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్ల నిర్మాణం చేపట్టి, పంపిణీ వ్యవస్థను బలోపేతం చేశారు. తలసరి విద్యుత్తు వినియోగం 1,356 యూనిట్ల నుంచి 2,126 యూనిట్లకు పెరిగింది. జాతీయ తలసరి వినియోగం కంటే, తెలంగాణలో తలసరి విద్యుత్తు వినియోగం 69 శాతం ఎక్కువ. అనేక రంగాలకు సబ్సిడీలతో కూడిన కరెంటును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నది.

సింగరేణి అద్భుత ప్రగతి

స్వరాష్ట్ర సాధన తర్వాత సింగరేణి కాలరీస్ సంస్థ అద్భుత ప్రగతిని సాధించింది. లాభాల్లో 421 శాతం వృద్ధిని సాధించింది. బొగ్గు అమ్మకాల్లో 176 శాతం, ఉత్పత్తిలో 33 శాతం, రవాణాలో 39 శాతం అభివృద్ధిని కొనసాగిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు 19 వేలకు పైగా కొత్త నియామకాలు చేపట్టారు. ఈ తొమ్మిదేండ్లలో 14 కొత్త గనులను ప్రారంభించారు. కారుణ్య ఉద్యోగ నియామక ప్రక్రియ ద్వారా 15,250 మంది వారసులకు ఉద్యోగాలు ఇచ్చారు. కార్మికుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోల్ ఇండియా కూడా ఈ స్థాయిలో అభివృద్ధిని సాధించలేకపోయింది.

ఖమ్మంలో వైద్యవిద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మంలోని ఓ వైద్య కళాశాల విద్యార్థిని ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. నగరంలోని మెడికల్ కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతున్న సముద్రాల మానస (22) అదే కళాశాల ఎదురుగా ఉన్న హాస్టల్ గదిలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమె మృతి చెందినట్టు ఖమ్మం అర్బన్ పోలీసులు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె స్వస్థలం మహబూబాబాద్ అని పోలీసులు వెల్లడించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తల్లిదండ్రులు వచ్చిన తర్వాతనే వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఎస్ఐ శ్రావణ్ కుమార్ విచారణ చేస్తున్నారు.

ఈటల వర్సెస్ బండి

(మొదటిపేజీ తరువాయి)

వేశారు. కేంద్ర అధిష్టానం వద్ద పట్టుబట్టి మరీ తన ముఖ్య అనుచరురాలైన తుల ఉమకు ఇచ్చేలా హామీ పొందినట్టు సమాచారం. బండికి ఇది ఏమాత్రం గిట్టట్లేదు. పైగా వేములవాడ నియోజకవర్గంపై పట్టుసాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో బీజేపీలో చేరికల కమిటీ చైర్మెన్‌గా ఉన్న ఈటల ఇమేజ్‌ను తగ్గించేందుకు బండి గ్రూపు ఎత్తులు వేస్తూనే ఉంది. అధిష్టానం వద్ద కూడా ఈటల ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా చక్రం తిప్పుతున్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఎన్నికల వరకు పార్టీ అధ్యక్షుని మార్పు ఉండబోదని అధిష్టానం స్పష్టంగా సంకేతాలు పంపింది. ఈ పరిణామాలు కొనసాగుతుండగానే ఇటీవల ఈటలతో పాటు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఒకడుగు ముందుకేసి...'రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే ఇప్పుడున్న స్పీడ్ సరిపోదు' అంటూ అధ్యక్షున్ని మార్చాలనే అర్థం వచ్చేలా మాట్లాడారు. వెంటనే తేరుకున్న బండి...'ఎంతటి నాయకులైనా సరే పార్టీ కట్టుబాట్లు, క్రమశిక్షణ తప్పితే వేటేస్తాం' అంటూ కొండాకు కౌంటర్‌గా పరోక్షంగా హెచ్చరికలు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ వివాదం చల్లారకముందే..'పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు బీజేపీలో చేరడం కష్టం. వారే నాకు రివర్స్ కౌన్సిలింగ్ ఇస్తున్నారు. కమ్యూనిస్టు భావజాలమున్న ఖమ్మం గడ్డ మీద విస్తరణ కష్టం' అంటూ ఈటల బాంబు పేల్చేశారు. ఆయన కావాలనే ఇలా మాట్లాడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరినవారంతా ఈటల గ్రూపులో చేరుతున్నారు. ఈటల, కొండా, రాజగోపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, విజయశాంతి, వివేక్ వెంకటస్వామితో సహ పలువురు బండి తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వీరికి మరికొంత మంది తోడైనట్టు ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే చాలా మందినేతలలో హస్తం పార్టీ అగ్రనేతలు సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది. తెలంగాణ గడ్డ మీద బీజేపీకి స్కోప్ ఉండదనీ, తమతో పాటు కాంగ్రెస్‌లోకి రావాలని ఈటల, డీకే అరుణపై వారు ఒత్తిడి చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈటల గ్రూపు పోరును ఎదుర్కొనేందుకు బండి కూడా ఢీ అంటే ఢీ అంటున్నాడు. అందులో భాగంగానే ఇటీవల ఓ సమావేశంలో 'నేను బీజేపీలో కార్యకర్త స్థాయి నుంచి ఎదిగివచ్చిన వ్యక్తిని. ఎవరో అణగదొక్కితే ఆగిపోయే వ్యక్తిని ఏమాత్రం కాదు' అంటూ మాట్లాడారు. ఈ వ్యాఖ్య ఈటల గ్రూపును ఉద్దేశించి చేసినదేనన్న ప్రచారం జరుగుతున్నది. అదే సమయంలో బండి యాక్టివ్ రోల్ పోషిస్తుండగా.. బండి గ్రూపు సైలెంట్‌గా ఉంది. ఇది ఎక్కడకు దారితీస్తుందో చూడాలి. తారాస్థాయికి చేరిన ఇంటిపోరుతో బీజేపీలో చేరికలు ఆగిపోయాయి. ఒక్కరు చేరితే నలుగురు బయటకు పోతున్నారనే చందంగా పరిస్థితి తయారైంది.

మావోయిస్టు అగ్రనేత కటకం సుదర్శన్ మృతి

- ప్రకటించిన పార్టీ అధికార ప్రతినిధి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

సీపీఐ(మావోయిస్టు) పార్టీ అగ్రనేత, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మరణించినట్టు ఆ పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా తీవ్రమైన శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న సుదర్శన్.. మార్చి 31వ తేదీన గుండెపోటుతో మరణించారని ఆయన తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన సుదర్శన్ విద్యార్థి దశ నుంచే రాడికల్ విద్యార్థి సంఘం కార్యకలాపాల పట్ల ఆకర్షితులై అందులో చేరారు. 1980లో అప్పటి పీపుల్స్ వార్ పార్టీలో దళ సభ్యుడిగా చేరిన సుదర్శన్ అంచెలంచెలుగా పార్టీలో ఎదుగుతూ 2004లో కేంద్ర కమిటీ సభ్యుడిగా, దండ కారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఇంచార్జీగా బాధ్యతలు చేపట్టారు.

కాగ్ అక్షింతలు వేసినా..మారని కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

కనీస అవసరాలకు ప్రాధాన్యతనివ్వకుండా, సాధారణ ప్రయాణికుడిని విస్మరిస్తూ కేవలం వందే భారత్, బుల్లెట రైళ్ల పైనే శ్రద్ధ కనబర్చటంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రైలు ప్రమాద ఘటన జరిగిన తర్వాత రైల్వేల పనితీరును మెరుగుపర్చడానికి ప్రభుత్వం చేసిన అన్ని వివరాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే, ప్రభుత్వ వాదనలు దాని స్వంత ఆడిటర్ అయిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) గతేడాది నివేదికలో చెప్పిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. రైలు భద్రతపై కాగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాక్‌ల పునరుద్ధరణకు నిధుల కేటాయింపు తగ్గిందనీ, కేటాయించిన నిధులును కూడా పూర్తిగా వినియోగించడం లేదని పేర్కొన్నది. ఒడిశా ఘోర రైలు ప్రమాద నేపథ్యంలో గతేడాది కాగ్ నివేదిక ప్రస్తుతం చర్చనీయంగా మారింది.



రైల్వే ఆధునీకరణ, భద్రత విషయంలో ప్రభుత్వం చాలా కృషి చేసిందన్న ప్రభుత్వ వాదనను బలపరిచేందుకు పీఎంఓ వర్గాలు శనివారం సమాచారాన్ని పంచుకున్నాయి. విపత్తుకు బాధ్యులైన వారికి "కఠినమైన శిక్ష" విధించబడుతుందని ప్రధాని మోడీ స్వయంగా ప్రకటనా చేశారు. అయితే ఈ ప్రకటన.. రైల్వేలు లేదా తన ప్రభుత్వ ఆర్థిక నిర్ణయాలతో తలెత్తిన వ్యవస్థాగత సమస్యల కంటే వ్యక్తిగత చర్యల ఫలితంగా ప్రమాదం జరిగిందని ప్రజలకు చెప్పే యత్నమని విశ్లేషకులు భావిస్తున్నారు.



గతేడాది కాగ్ నిర్వహించిన రైల్వే పనితీరు ఆడిట్, తర్వాత అందించిన నివేదిక.. ప్రభుత్వ వాదనలకు పూర్తి భిన్నంగా ఉన్నది. 2017-2021 మధ్య జరిగిన రైల్వే ప్రమాదాలపై కాగ్ విశ్లేషణ ప్రకారం.. ఈ కాలంలో మొత్తం 2017 ప్రమాదాలు జరిగాయి. అందులో పట్టాలు తప్పినవి 1392 ప్రమాదాలు(69 శాతం). అంటే పట్టాలు తప్పి ఢీ కొనటం వంటి రైల్వే ప్రమాదాలే అధికంగా ఉండటం గమనార్హం. అయితే ఈ ప్రమాదాలకు కారణం 'మానవ తప్పిదం' అని నిందించటం ఏండ్లుగా ఒక సాధారణ ధోరణిగా మారిందనీ, అయితే కాగ్ నివేదిక ప్రభుత్వ వాదనలు తప్పని నిరూపిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. భారత రైల్వే అనేకానేక ఖాళీలతో, నామ మాత్రపు అవుట్‌సోర్సింగ్‌తో కార్యకలాపాలను నిర్వహించిందని కాగ్ వెల్లడించింది.

2017-18లో ప్రవేశపెట్టిన రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్(ఆర్ఆర్ఎస్‌కే) ప్రసిద్ధి చెందిన రైల్వే భద్రతా నిధి గురించి కాగ్ ఉటంకించింది. 1127 పట్టాలు తప్పగా.. 289 (26 శాతం) మాత్రమే పునరుద్ధరణ పనులకు నోచుకున్నాయని వివరించింది. ఆర్ఆర్ఎస్‌కే నుంచి ప్రాధాన్యత-1 పనులపై మొత్తం వ్యయం 2017-18లో 81.55 శాతం నుంచి 2019-20లో 73.76 శాతానికి తగ్గుదల ధోరణిని చూపించిందని పేర్కొన్నది. ట్రాక్ పునరుద్ధరణ పనులకు 2018-19లో నిధుల కేటాయింపు రూ.9607.65 కోట్ల నుంచి 2019-20లో రూ.7417 కోట్లకు తగ్గింది అని కాగ్ వివరించింది. ముఖ్యంగా ప్రాధాన్యత లేని ప్రాంతాలకు నిధుల వినియోగం అనేక మండలాల్లో 25 శాతం వరకు పెరిగిందని నివేదిక పేర్కొన్నది. అత్యంత రద్దీగా ఉండే పశ్చిమ రైల్వే కోసం 2019-20లో మొత్తం వ్యయంలో ట్రాక్ పునరుద్ధరణ కోసం ఖర్చు చేసినది 3.01 శాతమే కావటం గమనార్హం. భద్రతకు సంబంధించిన పనులకు ఆర్థిక సాయం అందించటానికి ప్రత్యేక నిధిని సృష్టించే ఏకైక ఉద్దేశ్యం విజయం సాధించలేకపోయిందని కాగ్ పేర్కొన్నది. పట్టాలు తప్పడానికి ప్రధాన కారణం ట్రాక్ నిర్వహణ అని వివరించింది.

రైల్వే భద్రతపై నివేదికలు విస్మరించబడుతున్నాయి
మంత్రిత్వ శాఖ అలసత్వం : పార్లమెంటరీ ప్యానెల్ నివేదిక

రైల్వే భద్రత విషయంలో మంత్రిత్వ శాఖ అలసత్వాన్ని పార్లమెటరీ ప్యానెల్ ఎత్తి చూపింది. రైల్వే భద్రతకు సంబంధించిన నివేదికలు విస్మరించబడుతున్నాయని వివరించింది. ఈ ఏడాది మార్చిలో రైల్వే భద్రతపై సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ ప్యానెల్ ఈ విషయాలను వివరించింది. కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) చేసిన సిఫారసులు రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అత్యంత ప్రాముఖ్యతను పొందవల్సి ఉన్నప్పటికీ అది వాస్తవానికి భిన్నంగా ఉన్నదనీ, తక్కువ శ్రద్ధను కలిగి ఉన్నదని పేర్కొన్నది. రైలు ప్రమాదాలు పునరావృతం కాకుండా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ఏటీఆర్‌లను సమర్పించడానికి కాలపరిమితిని నిర్ణయించాలని ప్యానెల్ ఆ నివేదికలో సిఫారసు చేసింది.

సీబీఐ విచారణకు రైల్వేబోర్డు సిఫారసు
కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన

ఒడిశాలో చోటు చేసుకున్న ఘోర రైలు ప్రమాద ఘటనపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. భువనేశ్వర్‌లో మీడియా సమావేశంలో ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సహాయక కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. ఘటనా స్థలిలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. బాధితులకు ఆస్పత్రుల్లో చికిత్స కొనసాగుతున్నదని చెప్పారు. బాలేశ్వర్, కటక్, భువనేశ్వర్‌లలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కేంద్రం అన్ని విధాలా మద్దతుగా నిలుస్తున్నదని కేంద్ర మంత్రి చెప్పారు. ఆయా ఆస్పత్రుల్లో వారికి అన్ని వసతులూ కల్పించినట్టు తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం వైద్య బందాలు పర్యవేక్షిస్తున్నాయని మంత్రి వెల్లడించారు.

రైలు ప్రమాదానికి పూర్తి కారణాలపై ఇంకా స్పష్టత రానప్పటికీ.. డ్రైవర్ తప్పిదం లేకపోవచ్చని రైల్వేశాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన సమయంలో రెండు రైళ్లు పరిమిత వేగానికి లోబడే వెళ్తున్నట్టు చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ సరిగ్గానే ఉన్నప్పటికీ.. అందులో ఎవరో ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్న అధికారులు.. విధ్వంసం కోణంలోనూ దర్యాప్తును ముమ్మరం చేశారు. సిగ్నలింగ్‌లో సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా తేలినట్టు రైల్వే బోర్డు సభ్యురాలు జయవర్మ సిన్హా ఆదివారం వెల్లడించారు. రైల్వే సేఫ్టీ కమిషనర్ నుంచి పూర్తి స్థాయి నివేదిక రావాల్సి ఉందన్నారు.



గుట్టలుగా.. గుర్తుపట్టని విధంగా మార్చురీల వద్దే భారీగా మృతదేహాలు

ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం దుర్ఘటనలో మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. మార్చురీల వద్దే భారీ సంఖ్యలో మృతదేహాలు కనిపించాయి. ఈ ప్రమాదంలో మతి చెందినవారి కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం శోకసంద్రాన్ని తలపిస్తున్నది. రైలు ప్రమాద తీవ్రతకు అనేక మృతదేహాలు ఛిద్రమైన స్థితిలో గుర్తుపట్టలేనివిగా మారాయి. దీంతో మార్చురీల వద్ద భారీగా పేరుకుపోయిన మృతదేహాలను భద్రపరచడం ఒడిశా అధికార యంత్రాంగానికి పెను సవాల్‌గా తయారైంది. గుర్తు తెలియని మృతదేహాలే భారీ సంఖ్యలో ఉండటంతో అధికారులు బాలేశ్వర్ నుంచి భువనేశ్వర్‌కు 187 మృతదేహాలను తరలించారు. అయితే, వీటిని భద్రపరిచేందుకు శవాగారాల్లో స్థలం లేకపోవడంతో సమస్యగా మారింది. దీంతో మృతుల బంధువులు గుర్తించేలా తగిన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది.

భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు 110 మృతదేహాలు తరలించగా.. మిగతా వాటిని కాపిటల్ ఆస్పత్రి, ఆమ్రి ఆస్పత్రి, సమ్ ఆస్పత్రి సహా పలు ప్రయివేటు ఆస్పత్రులలో భద్రపరిచారు. అయితే, ఎయిమ్స్‌లో గరిష్ఠంగా 40 మృతదేహాలను మాత్రమే ఉంచేందుకు సౌలభ్యం ఉన్నందున ఇంత భారీ సంఖ్యలో వచ్చిన శవాలను భద్రపరిచడం అత్యంత సవాల్ అని అక్కడి అధికారి ఒకరు తెలిపారు. మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు, బంధువులు గుర్తించే వరకు భద్రపరిచేందుకు శవపేటికలు, ఐస్, ఫార్మాలిన్ రసాయనాలను సేకరిస్తున్నారు.

ఆయా వెబ్‌సైట్‌లలో మృతుల ఫొటోలు, వివరాలు : ఒడిశా సీఎస్

మృతదేహాలను బంధువులు, కుటుంబ సభ్యులు గుర్తించేందుకు సులభంగా ఉండేలా మృతుల వివరాలు, ఫొటోలను ఆయా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచుతామని ఒడిశా సీఎస్ ప్రదీప్ జెనా తెలిపారు. ఫొటోలు చూడటానికి ఇబ్బందికరమైన రీతిలో ఉన్నప్పటికీ ప్రమాదం తీవ్రత, ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటిని గుర్తించడం కోసమే పోస్ట్ చేస్తున్నామన్నారు. అయితే, ఒడిశా స్పెషల్ రిలీఫ్ కమిషనర్ రాతపూర్వక అనుమతి లేకుండా ఎవరూ ఈ ఫొటోలను ప్రచురించడానికి వీల్లేదని ఉన్నతాధికారులు చెప్పారు. భువనేశ్వర్‌లోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని సంప్రదించి మతదేహాల సమాచారం పొందొచ్చని సూచించారు.

'ప్రమాద తీవ్రతకు అదీ ఓ కారణమే'

ఒడిశాలోని రైలు ప్రమాద ఘటనపై రైల్వే బోర్డు స్పందించింది. సిగ్నలింగ్‌లో సమస్య కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు ప్రాథమికంగా తేలిందని వెల్లడించింది. అయితే, దీనిపై రైల్వే సేఫ్టీ కమిషనర్ నుంచి పూర్తిస్థాయి నివేదిక రావాల్సి ఉన్నదని తెలిపింది. ఈ ఘటనలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ప్రమాదానికి గురయినట్టు, ఆ సమయంలో దాని వేగం దాదాపు గంటకు 128 కి.మీలుగా ఉన్నట్టు వివరించింది. గూడ్స్ రైలులో ఇనుప ఖనిజం ఉండటంతో.. ప్రమాద తీవ్రత పెరిగిందని చెప్పింది.



చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

జీవో 111 రద్దు ఫలితంగా జంట నగరాలకు తీవ్ర వరద ప్రమాదం

ప్రొఫెసర్ దొంతి నరసింహారెడ్డి

- హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో మానవహారం

నవతెలంగాణ-అడిక్ మెట్

హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్ లాంటి చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పర్యావరణవేత్త, ప్రొఫెసర్ దొంతి నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి కే వీరయ్య అధ్యక్షతన "సేవ్ హుస్సేన్ సాగర్ - సేవ్ హైదరాబాద్" నినాదంతో ట్యాంక్‌బండ్ పై మానవహారాన్ని నిర్మించారు. కార్యక్రమానికి దొంతి నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు. జీఓ నెం 111 రద్దు ఫలితంగా హైదరాబాద్ జంట నగరాలకు తీవ్ర వరద ప్రమాదం ముంచుకొస్తుందని, వెంటనే ఆ జీవోను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామం ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పర్యావరణవేత్త సాగర్ ధారా మాట్లాడుతూ.. గతంలో హుస్సేన్‌సాగర్ శుద్ధికి ప్రభుత్వం నియమించిన కమిటీలో తానూ ఉన్నానని, హుస్సేన్ సాగర్‌లో చేరే కాలుష్యాలను అరికడితే క్రమంగా దాన్ని కాలుష్య రహితంగా మార్చవచ్చని అన్నారు. ఈ సంవత్సరం ఐరాసా అంతర్జాతీయంగా ప్లాస్టిక్ కాలుష్యంపై పోరాడాలని పిలుపునిచ్చిందని, ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, అందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని, అందుకనుగుణంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. సామాజిక వేత్త చుంచు రాజీవ్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్' నినాదాన్ని ఇచ్చిందని, ప్లాస్టిక్ పొల్యూషన్ ప్రపంచ మానవాళికే ముప్పుగా పరిణమించిందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్రాలు సైతం కాలుష్యమయ్యే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తున్నామని, విద్యార్థుల స్థాయి నుంచి చైతన్యాన్ని పెంచేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు. మానవహారంలో.. పి.శ్రీనివాసరావు, నగేష్, రాజమౌళి, మోహన్, మాధవి, మోహన్ నాయుడు, నాగేశ్వరరావు, సైదులు, గోపాల్, సుకుమార్, సంగీత, హస్మిత, సంజీవరెడ్డి, జెకె శ్రీనివాస్, కష్ణమోహన్, మేఘన, నరసింగరావు,అజయ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

- జగిత్యాలలో క్రిటికల్ కేర్ హాస్పిటల్
- భవన నిర్మానానికి శంకుస్థాపన



నవతెలంగాణ- జగిత్యాలటౌన్

ప్రజలకు ఆరోగ్యపరంగా మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో రూ.16 కోట్లతో క్రిటికల్ కేర్ హాస్పిటల్ భవన నిర్మాణం, మరో రూ.3.60 కోట్లతో కేంద్ర ఔషధ గిడ్డంగి భవన నిర్మాణానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా కేంద్రాల్లో అత్యాధునిక సౌకర్యాలతో ఆస్పత్రుల నిర్మాణం చేపడుతోందని చెప్పారు. వాటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, కలెక్టర్ యాస్మీన్ భాషా, అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, మంద మకరంద్, మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నైజాం అరాచాకాలపై గర్జించిన యోధుడు రావి నారాయణరెడ్డి

- సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నైజాం అరాచాకాలపై గర్జించిన వీర యోధుడు రావి నారాయణరెడ్డి అని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి తెలిపారు. రావి నారాయణరెడ్డి 116 వ జయంతి ఉత్సవాలను హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ చరిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాటంలో నారాయణరెడ్డి అగ్రభాగాన ఉన్నారని తెలిపారు. నైజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య వ్యవస్థ అంతమొందించే వరకు అలుపెరుగని పోరాటాలు చేసాడని గుర్తు చేసారు. హైదరాబాద్‌స్టేట్‌లో గ్రామగ్రామాన రైతాంగ పోరాటాన్ని పెను తుపానులా హోరెత్తించిన విప్లవ వీరుడు అని చెప్పారు. హైదరాబాదు సంస్థానంలో విధ్వంసకాండతో నరమేధం సృష్టించిన రజాకార్ల ఆకృత్యాలను అరికట్టడ్డానికి అజ్ఞాతంగాఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటుచేశారని తెలిపారు. 1951-52లో తొలి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థిగా నల్గొండ లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి నాటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ ఓట్లు సాధించి పార్లమెంటులో తొలిసారి అడుగుపెట్టారని గుర్తుచేశారు. తన 500 ఎకరాల సొంత భూములను పేదలకు దానం చేసి అణగారిన వర్గాలకు అండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, సభ్యులు రావి ప్రతిభారెడ్డి, ఏఐటీయూసీ సీనియర్ నాయకులూ డాక్టర్ బి.వి. విజయలక్ష్మి, సంఘసేవకులు రావి రిషికేష్ రెడ్డి, అప్పారావు, కృష్ణకుమారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటుకై ఉద్యమం

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్

- 16 గిరిజన సంఘాలతో ఖమ్మం ఐటీడీఏ సాధన కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లా విభజన తర్వాత ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్ డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని బంజారా భవన్‌లో భూక్య వీరభద్రం అధ్యక్షతన జరిగిన గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల విభజన తర్వాత కొత్త జిల్లాల్లో ఐటీడీఏలను ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

గిరిజనులు గణనీయంగా ఉన్న మైదాన ప్రాంత జిల్లాల్లో ప్రత్యేక ఐటీడీఏలను ఏర్పాటు చేస్తామని, ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. గిరిజనులు గణనీయంగా ఉండి, ఐదో షెడ్యూల్ ప్రాంత మండలాలున్న ఖమ్మం జిల్లాలో ఇంతవరకు ఐటీడీఏ ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఉపాధి, రుణాలు వంటి సమస్యలపై సుదూర ప్రాంతంలో ఉన్న భద్రాచలం ఐటీడీఏకు వెళ్ళవలసి వస్తోందన్నారు.

సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి భూక్య వీరభద్రం మాట్లాడుతూ.. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 140 తండాలు, గూడాలు ఉండగా మిగిలిన మైదాన ప్రాంతంలో 176 తండాలు ఉన్నాయని, జిల్లాలో మూడు లక్షల మందికి పైగా గిరిజనులు నివసిస్తున్నారని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనులకు పరిపాలన పరమైన సమస్యలతో పాటు సంక్షేమ అభివృద్ధి అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఐటీడీఏ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ సాధన కమిటీని ఎనుకున్నారు. సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దారవత్ రాంమూర్తి నాయక్, సేవాలాల్ సేన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్, తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ వీరన్న నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు బస్కినాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు భూక్య కృష్ణ నాయక్, మూడు గన్యా నాయక్, గుగులోత్ కుమార్ నాయక్, బాధావత్ శ్రీనివాస్ నాయక్, భూక్య రమేష్, జ్యోతి భూక్య బాలాజీ, అజ్మీరా కిషన్ నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పెద్దల కోసమే 111 జీవో రద్దు

- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ పెద్దల కోసమే 111 జీవో రద్దు నిర్ణయాన్ని తీసుకున్నారని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. 84 గ్రామాల పరిధిలో 1,32,000 ఎకరాల భూమి 111 జీవో పరిధిలో ఉన్నదని తెలిపారు. వీటిలో 70 శాతం భూమి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సినీ పెద్దలు, రాజకీయ నాయకుల చేతుల్లో ఉందని పేర్కొన్నారు. బడా బాబులకు మేలు చేసేందుకు 111 జీవోను రద్దు చేశారని తెలిపారు. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆర్డర్‌ను సైతం ప్రభుత్వం ధిక్కరించిందని పేర్కొన్నారు. ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్ రిజర్వాయర్లు రాజధాని ప్రజల తాగునీటి అవసరాలను తీరుస్తున్నాయని గుర్తుచేశారు. భారీ వరదల నుంచి నగరాన్ని కాపాడుతున్నాయని తెలిపారు. వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో జీవవైవిద్యానికి రక్షణ, అనేక రకాల పక్షులు, వన్యప్రాణులు మనుగడ సాగిస్తున్నాయని పేర్కొన్నారు. భావితరాల కోసం, జంట నగరాలను వరదల నుంచి రక్షించుకునేందుకు, జీవవైవిద్యాన్ని కాపాడుకునేందుకు 111 జీవో రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘటన

నవతెలంగాణ- జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన బడుగు గంగాధర్(25) జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కృపాకర్ (26) వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చారు. కొత్త బస్టాండ్ వద్ద వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన కృపాకర్‌ను స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వీరిలో గంగాధర్ విద్యార్థి కాగా కృపాకర్ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చల్లబడ్డా ఉక్కపోతే

- ఓవైపు ఎండ..మరోవైపు వర్షం
- నాగల్‌గిద్దెలో 6.7 సెంటీమీటర్ల వాన
- మహదేవ్‌పూర్‌లో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత
- నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు పెరిగే అవకాశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న ఎఫెక్టేమోగానీ రాష్ట్రంలో విభిన్న వాతావరణం నెలకొంది. ఎండకు ఎండే..వానకు వానే..ఉక్కపోతకు ఉక్కపోతే అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఆదివారం వాతావరణం కూల్‌గా ఉన్నప్పటికీ ఉక్కపోత మాత్రం తీవ్రస్థాయిలో ఉంది. 'హో..ఏం ఉక్కపోత రా? బాబూ' అనకుండా ఉండలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ఆదివారం రాత్రి పది గంటల వరకకు 250కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. అందులో 50 ప్రాంతాల్లో మోస్తం వర్షం పడింది. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దెలో 6.7 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ 45.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో వచ్చే నాలుగైదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందనీ, అదే సమయంలో పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, కొమ్రం భీమ్ అసిఫాబాద్, నిర్మల్, మహబూబాబాద్, నల్లగొండ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. అదే సమయంలో రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయి. అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చు.

హైదరాబాద్‌లో వేర్వేరు చోట్ల ఇద్దరు పిల్లల కిడ్నాప్

రెండు గంటల్లో ఛేదించిన మహంకాళి పోలీసులు



నవతెలంగాణ-బేగంపేట్

హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం వేరు వేరు చోట్ల ఇద్దరు పిల్లలు కిడ్నాప్‌కు గురికావడం సంచలనం రేపింది. సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ వద్ద ఓ పాపతో పాటు సుల్తాన్ బజార్‌లో ఓ బాబును ఇద్దరు నిందితులు కిడ్నాప్ చేశారు. అయితే ఈ కిడ్నాప్‌లను మహంకాళి పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అలాగే ఇద్దరు చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఉత్తర మండలం డీసీపీ చందనా దీప్తి మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలో కాళీ అనే వ్యక్తి 30 ఏండ్లుగా కుటుంబంతో కలిసి వివిధ రకాల వస్తువులు విక్రయిస్తూ ఫుట్‌పాత్‌పై ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఏడుగురు సంతానం. ఐదుగురు బాలికలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. శనివారం రాత్రి ప్యారడైజ్ ఎదురుగా ఉండే దాదూస్ స్వీట్స్ ముందు ఫుట్‌పాత్‌పై వారు పడుకున్నారు. అయితే ఆదివారం తెల్లవారు జామున 3.40 గంటల సమయంలో ఆటోలో వచ్చిన ఓ పురుషుడు, మరో మహిళ మూడున్నరేండ్ల కాళీ కుమార్తె కరిష్మాను అపహరించుకుని వెళ్లారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి దీన్ని గమనించి కరిష్మా కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. నిందితులు ఆటోలో ఎంజీ రోడ్డు మీదుగా వెళ్లిపోవడంతో.. కాళీ మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే ఉత్తర మండలం డీసీపీ చందన దీప్తి మహంకాళి పోలీసులతో పాటు మార్కెట్ పోలీసులను అలర్ట్ చేశారు. ఇదిలా ఉండగా బాలికను అపహరించిన నిందితులు నేరుగా అబిడ్స్ వైపు వెళ్లారు. అక్కడ.. హనుమాన్ టెకీ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నివసిస్తూ అబిడ్స్‌లోని గ్రాండ్ హెూటల్‌లో స్వీపర్లుగా పనిచేసే దంపతుల ఏడు నెలల కుమారుడు శివకుమార్‌ను ఎత్తుకెళ్లారు.

సీసీ కెమెరాల సాయంతో..

కిడ్నాప్ ఫిర్యాదు అందగానే ఉత్తర మండలం డీసీపీ చందనా దీప్తి ఆదేశాల మేరకు మహంకాళి ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులతో పాటు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. ఆటో ప్రయాణించిన మార్గంలో ఉండే సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ మేరకు రెండు గంటల్లోనే ఫలక్‌నుమా ప్రాంతంలోని ప్రధాన నిందితుడి ఇంటి వద్ద ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులిద్దరూ పథకం ప్రకారమే కిడ్నాప్ చేసినట్టు తెలుస్తోంది. ఫలక్‌నుమాకు చెందిన షేక్ ఇమ్రాన్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిజామాబాద్ జిల్లా నాగారం దొడ్డి కొమురయ్య కాలనీకి చెందిన సలీం భార్య పర్వీన్ గృహిణి. కాగా ఆమె రెండు రోజుల క్రితం ఇంట్లో భర్తతో గొడవపడి హైదరాబాద్‌కు వచ్చింది. శనివారం రాత్రి పర్వీన్ కోటి బస్టాండ్ ప్రాంతంలో ఉండగా ఆటో నడిపిస్తున్న షేక్ ఇమ్రాన్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి పిల్లలను కిడ్నాప్ చేయాలని పథకం వేశారు. ఇద్దరూ మద్యం సేవించి తెల్లవారుజామున ప్యారడైజ్, హనుమాన్ టెకీ ప్రాంతంలో ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేశారు. కాగా, రెండు గంటల్లోనే కేసును ఛేధించి ఇద్దరు చిన్నారులను రక్షించడం పట్ల పోలీసులను డీసీపీ అభినందించారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

నవతెలంగాణ-రామన్నపేట

వడదెబ్బతో ఇద్దరు మృతి చెందిన సంఘటన ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని దుబ్బాక గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం...గ్రామానికి చెందిన గట్టు సౌందర్య(21), మల్లెపల్లి వెంకయ్య (65) ఎండ తీవ్రతలతో పాటు వడగాలులు వీస్తుండటంతో అస్వస్థతకు గురై మృతిచెందారు. దాంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పిడుగుపాటుతో ఒకరు మృతి

నవతెలంగాణ-మోర్తాడ్

పిడుగుపాటుతో ఒకరు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన మూఢ మల్లయ్య (48) వ్యవసాయ పనుల నిమిత్తం తోటకు వెళ్లాడు. పనిచేస్తున్న క్రమంలో భారీ వర్షం కురిసింది. దాంతో చెట్టు కిందకు వెళ్లగా.. అదే సమయంలో పిడుగుపడటంతో తీవ్ర గాయాలై పడిపోయాడు. తండ్రి ఇంటికి రాకపోవడంతో కుమారులు తోటకు వెళ్లి చూడగా పిడుగుపడి మృతిచెంది ఉన్న తండ్రిని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

పీడితులకోసం చివరవరకు పోరాడారు..

- కటకం సుదర్శన్‌కు ప్రజాపంథా జోహార్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(మావోయిస్టు) పోలిట్‌బ్యూరో సభ్యులు కటకం సుదర్శన్(ఆనంద్) మరణం పట్ల సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటన విడుదల చేశారు.కటకం సుదర్శన్ చివరి శ్వాస వరకు పీడితులకోసం పనిచేశారని తెలిపారు. సింగరేణి కార్మిక కుంటుంబం నుంచి కార్మిక నాయకుడిగా ఎదిగి, భారత విప్లవోద్యమానికి అంకితమై పనిచేశారని పేర్కొన్నారు. ఆదివాసుల, పీడితుల కోసం ఎన్నో పోరాటాలు నిర్మించారని తెలిపారు. ఐదు దశాబ్దాలుగా తాను నమ్మిన రాజకీయాలకోసం దండకారణ్యంలో పనిచేశారని గుర్తు చేశారు. ఆయనకు ప్రజాంపంథా విప్లవ జోహార్లు అర్పిస్తున్నదని తెలిపారు.

రేపు హైదరాబాద్‌కు ప్రభాత్ పట్నాయక్

- 'అరిబండి'పై 5వ స్మారకోపన్యాసం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రముఖ ఆర్థికవేత్త, ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు. తెలంగాణ రైతు సంఘం, అరిబండి పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. 'మారుతున్న ప్రపంచం- వాతావరణ పరిస్థితులు, జాతీయ వ్యవసాయ విధానం' అనే అంశంపై అరిబండి లక్ష్మీనారాయణపై 5వ స్మారకోపన్యాసం చేయనున్నారు. ఈమేరకు ఆదివారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, అరిబండి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టు డాక్టర్ అరిబండి ప్రసాదరావు ఒక ప్రకటన విడుదల చేశారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ ప్రసగించనున్నారు. 'వానాకాలం సాగు'పై సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంటు డైరెక్టర్ జువ్వాడి దేవీప్రసాద్, అగ్రికల్చర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ అల్తాఫ్ జానయ్య, ఏఐకేఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు -వ్యవసాయ రంగంలో తీసుకొస్తున్న సంస్కరణల అంశంపై ప్రముఖంగా చర్చిస్తామని తెలిపారు. వ్యవసాయ రంగంపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ వెల్లడిస్తామని పేర్కొన్నారు. సెమినార్‌ను జయప్రదం చేయాలంటూ రైతాంగానికి పిలుపునిచ్చారు.

నైపుణ్యంతోనే సమర్థవంతమైన విధులు

- యువత ఆశలు సఫలమయ్యేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు : కౌశల్ మహోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నైపుణ్యంతోనే సమర్థవంతమైన విధులు నిర్వర్తించడం సాధ్యమవుతుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య ప్రాంత అభివద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లో జరిగిన కౌశల్ మహోత్సవంలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలో పెరుగుతున్న అవకాశాలను భర్తీ చేయడానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరమని అన్నారు. అందుకోసం వివిధ రంగాలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. యువత ఆశలు సఫలం అయ్యేలా చూడాలన్న లక్ష్యంతో ప్రముఖ సంస్థల సహకారంతో కౌశల్ మహోత్సవం కార్యక్రమం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగాలు లభించేలా చూసేందుకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో కేంద్ర నైపుణ్యాభివద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగ మేళాలు నిర్వహిస్తుందన్నారు. నియామక పత్రాలు పొందిన వారిని అభినందించిన కేంద్ర మంత్రి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎన్ఎస్‌డిఐ, ఎన్ఐపీయూఎన్ఏ, ఎన్ఎస్టీఐ సిబ్బందిని, వాలంటీర్లను మంత్రి అభినందించారు. ఎన్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ పంగ్‌ఖురి బోర్గోహైన్ మాట్లాడుతూ సరైన ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు, కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకునేందుకు ఉద్యోగ మేళా నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల వివరాలు అందించి వాటి ద్వారా ప్రయోజనం పొందేలా చూసేందుకు, పీఎంకేవై, ఐటీ కోర్సులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ మేళాకు దాదాపు 5000 మంది హాజరయ్యారని, 1500 ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్టీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎన్ఎస్టీఐ చైర్మెన్ సూర్యరాజ్ కూడా పాల్గొన్నారు.

నేడే టీఎస్ఐసెట్ ప్రిలిమినరీ 'కీ'

- ఈనెల 20న ఫైనల్ 'కీ', ఫలితాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఐసెట్ ప్రిలిమినరీ 'కీ'ని సోమవారం విడుదల చేయనున్నట్టు కన్వీనర్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేది సాయంత్రం 5గంటల లోపు convener.icet@tsche.ac.in మెయిల్ ద్వారా పంపించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న ఫైనల్ 'కీ'తోపాటు ఫలితాలను కూడా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. అయితే టీఎస్ఐసెట్-2023కు ప్రవేశ పరీక్ష మే 26,27 తేదీల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. 80అభ్యర్థ్ల సమక్షంలో 72 టెస్ట్ సెంటర్లలో పరీక్ష నిర్వహిం చారు. 75,925 మంది దరఖాస్తు చేసుకుంటే 70,900 మంది పరీక్ష రాశారు.

ఆచూకీ కానొస్తలే

నిశబ్దాన్ని పటాపంచలు చేసిన
ఆ పసిబిడ్డ ఏడుపే
నేను విన్న చివరాకరిది.

ఈ మధ్య కాలంలో నువ్వేప్పుడైన
బిగపట్టిన పిడికిలిని చూశావా ?
కాసిన్ని వేడి వేడి నినాదాలను
ఆ దోపిడిదారుల గుండెలపై
విసిరేయడం
కనీసం కళ్ళారా చూశావా ?
నిద్రలేకుండా చేసేటి ఆ ప్రశ్నలేవి
విడమరిచి వివరించే వేదికలేవి
మొద్దుబారిన మెదళ్ళను
సానబెట్టిన ఆ మాటలేవి?

వేట మొదలైన అడవిలోనే
నాటకం షురూ అయినట్టు



దొంగలు దొరతనం మోస్తుంటే
పొదల సాటున సప్పిడి మాటలతో
సగ ప్రాణాలతో సాగుతున్న
పిరికి పందల వత్తాసు పాటలే
రాజ్యతంత్రమయినట్టుంది.

భగ భగ రగిలే
నిప్పుల జ్వాలలు
యుద్ధభూమిపై పారిన
ఎర్రఎర్రని రక్తపు అలలు
కన్నతల్లుల త్యాగాల కన్నీళ్లు
నిన్ను నన్ను నిలదీస్తుంటే
తల లేని మొండెం వోలె
తప్పించుకోకు!

నిశబ్దాన్ని నిలువునా చీల్చి
నింగిని తగిలేలా కొత్త దరువు మొదలెట్టు
గతకాలపు గొంతుల ఆచూకీ పట్టుకొని
సైన్యమై కదులు...

- రామ్ పెరుమాండ్ల

సాహితీ వార్తలు

11న రుంజ విశ్వకర్మల
ఆత్మీయ సమ్మేళనం

ఈ నెల 11న రుంజ విశ్వకర్మల కవులు, రచయితలు, జర్నలిస్టుల ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనం పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నల్లారి రాంప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి తాత్విక భూమికతో పాటు సాహిత్య పరిచయాలు, మాటా, ముచ్చట, బంధుమిత్రుల పాత కొత్త తరాల ఆలోచనలు, పుస్తక పరిచయం, భవిష్యత్తు కార్యాచరణ వంటి అంశాలపై ప్రణాళిక రూపొందించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. వివరాలకు 9550630949 నెంబర్ నందు సంప్రదించవచ్చు.

అత్తివిల్లి శిరీష కథల పోటీ

అత్తివిల్లి శిరీష జ్ఞాపకార్థం అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం సహకారంతో 'పాలపిట్ట' కథల పోటీ నిర్వహిస్తున్నది. మొదటి, రెండో, మూడో బహుమతులుగా రూ. 5000/-, రూ. 3000/-, రూ. 2000/-లతో పాటు ఐదు కథలకు ప్రత్యేక బహుమతులుగా ఒక్కొక్క కథకి రూ. 1000/- చొప్పున అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు 30 జూన్ లోగా ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044 చిరునామాకు లేదా palapittamag@gmail.com మెయిల్ ఐడీకి పంపించాలి. వివరాలకు 94900 99327 నంబరు నందు సంప్రదించవచ్చు.

తెలుగు భాషా వికాస పరిషత్
కథల పోటీ ఫలితాలు

తెలుగు భాషా వికాస పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీ ఫలితాలు వెలువరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు - ఒక రోజు (పి.రామ చంద్రకీర్తి), రాతి బొమ్మలు (సముద్రాల శ్రీనివాస్), సడి చేయకే (లలిత రావుల)లు ఎంపికైనట్లు నిర్వాహకులు ఎమ్.వి సూర్య నారాయణ మూర్తి పేర్కొన్నారు.

అక్షర సేద్యం కవితల పోటీ

అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేల్పుల బాలయ్య స్మారకార్థం కవితల పోటీకి కవితలను ఆహ్వానిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.2000/-, రూ.1500/-రూ.1000/- లతో పాటు ఐదు ప్రోత్సాహక బహుమతులు ఒక్కొక్కటికి రూ.500/- చొప్పున అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు జూన్ 20 లోగా కన్వీనర్, కవితల పోటీ, అక్షర సేద్యం ఫౌండేషన్ రామునిపట్ల, సిద్దిపేట జిల్లా - 502267. చిరునామాకు లేదా మెయిల్ : aksharasedyam@gmail.com పంపవచ్చు. వివరాలకు 9701933704 నంబరు నందు సంప్రదించవచ్చు.

పాటల ప్రవాహానికి జేజేలు

వనపర్తి కలలకు కాణాచి. కళాకారులకు కల్పతరువు. సాహిత్య వేత్తలకు నిలయం. అభ్యుదయ, ప్రగతి కాముకులతో విలసిల్లిన, జానపద, రంగస్థల కళామా తల్లులతో పరిఢవిల్లుతున్నది విద్యాపర్తి. ఎంతో చారిత్రిక ప్రాశస్త్యం కలిగిన వనపర్తి జిల్లా పాటకు స్వాగతం పలికింది. ఈ పిలుపును అందుకున్న పాట పరవళ్ళు తొక్కింది. అలరింపజేసింది. అంత్యంత వైభవంగా పాటకు పట్టాభిషేకం కట్టింది. తెలంగాణ సాహితి ప్రజానాట్య మండలి, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం వనపర్తి జిల్లా కమిటీలు సంయుక్తంగా పట్టణంలో మే 27, 28 తేదీలలో తెలంగాణ సాహితీ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా 27న పాటకు పట్టాభిషేకం, 28న కవికి పట్టాభిషేకం అనే రెండు బృహత్తరమైన సాహిత్య సమ్మేళనాలు జరిగాయి.ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వందమందికి పైగా గాయకులు తమ మధురమైన గాత్రాన్ని వినిపించారు. ఎనభైమంది కవులు తమ కవితాగానం చేశారు.



ప్రజలు పొద్దస్తమానం పని చేస్తూ తమ శ్రమను ధార పోసేటప్పుడు వెలుపల చెమట చుక్కల నుండి అసువుగా పాట వచ్చిందని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందచారి అన్నారు. శ్రామికులు, కార్మికులు, మహిళలు ఫ్యాక్టరీలలో, వ్యవసాయ పనుల్లో పనిచేస్తూ అలసి సొలసిపోతుంటారని, ఈ సందర్భంగా అలసినప్పుడు పాటను పాడుకుంటూ సేద తీరుతారన్నారు. ప్రస్తుతము పాట వరస మారుతుందని, పట్టు తప్పుతుందని, ప్రజల కోసం ప్రజలను చైతన్య పరచడం కోసమే పాట పాడాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. ప్రజలను విభజించ డానికి, కన్న ప్రజల పేగు బంధాన్ని విడదీయడానికి పాలకులు కుయుక్తి పన్నుతున్నారని వీటిని ఎండగట్టాలని కవులకు, గాయకులకు ఆయన పిలుపునిచ్చారు.

ప్రకృతియే కమ్యూనిజం..!

ప్రకృతి ఒక కమ్యూనిస్టు వ్యవస్థని, గాలి, నీరు, వాయువు, ప్రతిప్రానికి అందిస్తుందని, అదేవిధంగా ప్రజలకు, జంతువులకు, పక్షులకు బతికేందుకు, సమాన అవకాశాలు సమానంగా కావాలని కోరడము కమ్యూనిజమని ప్రముఖ కవి, గాయకుడు, ప్రకృతి తత్వవేత్త జయరాజు అన్నారు. జన హితం కోసం పాటను, కలాలను ఆయుధంగా ఉపయోగించుకోవాలన్నారు. పాటను బతికించుకోవాలని పాట ద్వారానే ప్రజల కష్టసుఖాలను వెతికి తీసి వెన్ను దన్నుగా ఉండాలని కోరారు.

జనహితం కోసం పాటే ఆయుధం..!

జనహితం కోసమే పాటను ఆయుధంగా ఉపయోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి అన్నారు. పాట ప్రభుత్వాలను కదిలిస్తుందని, ప్రభుత్వాలను మారుస్తుందని, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెడుతుందని అన్నారు. ధూమ్ ధామ్ కార్యక్రమాల ద్వారా ప్రజలలో పెద్దఎత్తున చైతన్యాన్ని తెచ్చిందన్నారు. పాట ప్రజల చైతన్య పరచడమే కాకుండా వారిలో ఉన్న నిద్రాణమైన వ్యవస్థను పురికొలుపుతుందన్నారు.

సామాజిక రుగ్మతలకు పాటే మంత్రం..!

సమాజంలో నెలకొన్న అవిద్య నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పాట మంత్రంగా ఉపయోగపడిందని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేముల ఆనంద్, కట్టా నరసింహ, నవ తెలంగాణ న్యూస్ ఎడిటర్ ఆర్.రమేష్ అన్నారు. పాటలు, కవిత్వాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ఆనాడు అక్షరాస్య ఉద్యమంలో పదునైన ఆయుధంగా ఉపయోగపడింది అన్నారు. ఉమ్మడి ఆంధ్రాలో తమ సమస్యల ద్వారా లక్షలాదిమంది చదువు రాని వారిని, అంధకార బతుకల నుంచి వెలుగు దీపాలు నందివడం జరిగిందన్నారు. పాట కవిత్వం ద్వారా ప్రజలకు ఉపయోగపడే విధంగా గాయకులు రచయితలు పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన, ఉపాధ్యక్షులు మోహనకృష్ణ, సహాయ కార్యదర్శి సలీమా, వనపర్తి జిల్లా పరిషత్ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిట శ్రీధర్, సీపీ(ఐ)ఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ గుప్తా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ కుమార్ యాదవ్‌తో పాటు ఈ కార్యక్రమం నిర్వహణకు సాయపడ్డ స్థానిక ప్రజా వైద్యశాల డాక్టర్ మురళీధర్, మోడల తిరుపతయ్య సాగర్‌తో, పాటు నిర్వాహక కమిటీ గౌరవ అధ్యక్షుడు అధ్యక్షులు గంధం నాగరాజు, అధ్యక్షుడు డి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రాజారావు ప్రకాష్, ప్రచార కార్యదర్శి శీర్లనాగేంద్రం సాగర్, కార్యదర్శులు కాకం ఆంజన్న, భూరోజు గిరిరాజాచారి, తెలంగాణ సావితి నాయకులు ఖాజామైనోద్దీన్, మహీద్ ఖాన్, జెవివి, నాయకుడు నరేందర్, ఎన్.రాములు, జానపద కళాకారుల సంఘం నాయకులు డప్పు స్వామి, మిస్టేక్, దండు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒక కమ్యూనిస్టు వ్యవస్థని, గాలి, నీరు, వాయువు, ప్రతిప్రానికి అందిస్తుందని, అదేవిధంగా ప్రజలకు, జంతువులకు, పక్షులకు బతికేందుకు, సమాన అవకాశాలు సమానంగా కావాలని కోరడము కమ్యూ నిజమని ప్రముఖ కవి, గాయకుడు, ప్రకృతి తత్వవేత్త జయరాజు అన్నారు. జన హితం కోసం పాటను, కలాలను ఆయుధంగా ఉపయోగించుకోవాలన్నారు.

ఘనంగా సన్మానం..

ఈసందర్భంగా రెండు రోజులు కార్యక్రమంలో పాల్గొన్న కవులు, గాయకులకు శాలువా, మెమొంటో, ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించడం ఘనంగా సన్మానించడం జరిగింది. పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ కవితలు,పాటలు వినిపించినందుకు వారిని నిర్వాహకులు అభినందించారు

- డి.కృష్ణయ్య, 9490206137
తెలంగాణ సాహితి, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి



ఆలోచనలను వికసింపజేసిన
'తెలుగు బాల సాహిత్య సమ్మేళనం'


- డా. మురహరిరావు ఉమాగాంధి

నదులలాగానే కొన్ని పనులు చిన్నగా... పాయగా ప్రారంభమై మహా నదులుగా విస్తరించి జీవనాడులుగా నిలుస్తాయి. ఇది ఒక నదులకే కాదు, నదుల లాంటి అనేక జీవనిధులకు వర్తిస్తుంది. అటువంటిదే నిన్నమొన్న హైదరాబాద్‌లో తెలుగు బాల సాహిత్యం విషయంలో జరిగింది. భవిష్యత్తులో జరిగే అనేక ఆవిష్కరణలకు ఈ సదస్సు దారులు వేయడమే కాక జాతీయ స్థాయిలో తెలుగు బాల సాహితీవేత్తలను ఒకచోట చేర్చి నేటి తెలుగు బాల సాహిత్య తీరుతెన్నులు, బాలల సాహిత్య మంచి చెడులు, ఆలోచనలు, ఆవిర్భావాల వంటి అనేక అంశాలపైన చర్చకు అవకాశం యివ్వడమే కాదు కొత్త ఆలోచనలకు, ఆధునిక బాల సాహిత్య తీరుతెన్నులకు, ఆలోచనలకు అద్దం పట్టింది.

మే 24,25 తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికగా శాంతా బయోటెక్నిక్స్ అధినేత పద్మభూషణ్ డా.కె.ఐ.వరప్రసాదరెడ్డి సౌజన్యంతో వారి తల్లి శ్రీమతి కోడూరి శాంతమ్మ స్మృత్యర్థం రెండు రోజులు అత్యంత వైభంగా జరిగిన ఈ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభకు విశిష్ట అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా.కె.వి. రమణాచారి హాజరుకాగా, పద్మభూషణ్ వరప్రసాదరెడ్డి సదస్సును ప్రారంభించారు. శాసనమండలి సభ్యులు, కవి, గాయకులు దేశపతి శ్రీనివాస్ గౌరవ అతిథిగా పరిషత్తు ప్రచురించిన 'బాల కథా కదంబం'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డా.భూపాల్, సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత కన్నెగంటి అనసూయ అతి థులుగా పాల్గొన్నారు. తొలుత పరిషత్తు కార్యదర్శి డా.జె. చెన్నయ్య స్వాగతం పలికి సదస్సు నేపథ్యాన్ని వివరించగా, కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత, పరిషత్తు సభ్యులు డా.పత్తిపాక మోహన్ సభకు సమన్వయకర్తగా వ్యవహరించారు.

రెండు రోజుల సదస్సులో వివిధ అంశాలపై నిష్ణాతులు ప్రసంగించారు. మొదటి సదస్సు 'బాల సాహిత్యం మౌలిక అంశాలు' గురించి జరిగింది. దీనికి సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డా. దాసరి వెంకట రమణ అధ్యక్షత వహించారు. మొలక సంపాదకులు తిరునగరి వేదాంతసూరి ఆత్మీయ అతిథిగా పాల్గొని, చెప్పడం కంటే ఆచరణలో చూపాలని అన్నారు. తొలుత బాల్యం గురించి, బాల సాహిత్యం గురించి ముంజులూరి కృష్ణకుమారి మాట్లా డుతూ భాష వస్తువు శైలి ఏ విధంగా ఉండాలి? పదబంధాలు తీసుకునే వస్తువు ఎలా ఉండాలి? భాష ఎలా ఉపయోగిస్తే పిల్లవాడికి నచ్చుతుంది? పిల్లలకి ఇష్టపడే భాష, కష్టపడే భాష సైన్స్ కథా వస్తువుకి భాష ఎలా ఉండాలి, వారి మనసుకి ఆకట్టుకునేలా కథలు ఎలా రాయాలి? నేపథ్యం వర్ణన ఎలా సులభ తరం చేయాలి? కొత్త కథావస్తువు పిల్లలకి ఇవ్వగలమా, లేదా వంటి అంశాలతో పాటు సైన్స్ కథలు ఎందుకు రావడం లేదనే అనేక ప్రశ్నలను చర్చకు తెచ్చారు. డా.ఎం.హరికిషన్ నైతిక విలువలు మానవ సంబంధాలు కథా వస్తువులు ఉండేలా చూడాలని, చక్కని కథా వస్తువుని, చిక్కని కథని అందిం చాలని, బాల సాహిత్యంలో సమాజాన్ని సంస్కరించే ఏ విషయమైనా సరే నీతి కథలు అవుతుందని అన్నారు. బాల సాహిత్యం వైజ్ఞానికత, హేతువు గురించి అందులో విశేషంగా పని చేసిన శాంతారావు మాట్లాడుతూ పిల్లల ప్రేమికులుగా మనం చెప్తున్న విజ్ఞానం విద్యార్థులకు ఎంతవరకు చేరుతుంది అనేది మనం తెలుసుకోవాలని, రాముడు కావ్య పురుషుడు, కృష్ణుడు పురాణ పురుషుడు బుద్ధుడు, చరిత్ర పురుషుడు అని చెప్తూ వివేచన కలిగిన ఉపాధ్యాయులు ఇందులో అంతరార్థం గ్రహించి చరిత్రలో ఉన్న కార్య కారణ సంబంధాలు తెలుసు కుంటూ విద్యార్థులకు తెలియ జేయాలన్నారు. సదస్సుకు సమన్వయకర్తగా కూకట్ల తిరు పతి వ్యవహరించారు.

మధ్యాహ్నం జరిగిన 'బాల సాహిత్యం నాడు-నేడు' చర్చా గోష్టి మూడు తరాల బాల సాహితీవేత్తల ఆలోచన పూలను కురిపించింది. డా. అమరవాది నీరజ అధ్యక్షతన జరిగిన ఈ చర్చా కార్యక్రమానికి డా.అమ్మిన శ్రీనివాస రావు సమన్వయకర్తగా ఉన్నారు. సీనియర్ రచయితలు పాల్గొని అనేక అంశాలను చర్చకు పెట్టడమే కాక ఆలోచనాత్మక దిశగా సాగింది. 'బాలల కోసం వివిధ నైపుణ్యాలు' అంశంపై వి.శాంతి ప్రబోధ అధ్యక్షతన వక్తలు జి.వి.ఎస్.రాజు ఉపన్యాస కళ గురించి మాట్లాడుతూ ఉపన్యాసం ఉప్పెన లాంటిదని ప్రసంగం ప్రవాహం లాంటిదని చెబుతూ పాఠశాలల్లో విద్యార్థులను ఉపన్యాస కళలో నిష్ణాతులను చేయడానికి అనేక మెళకువలను సూచించారు. చొక్కాపు వెంకటరమణ కథలు చెప్పే కళ గురించి చక్కగా వివరించారు. ఈ సదస్సుకు పులి జమున సమన్వయ వ్యవహరించారు. 'బాలల కథా రచన మెళకు వలు' సదస్సుకు డా.వి.ఆర్ శర్మ అధ్యక్షత వహించారు. కథా రచన విషయంలో కుండ బద్దలు కొట్టినట్టు అనుక విషయాల నిగ్గు తేలుస్తూనే, చక్కని మెలకువలతో కథా రచన చేయడం గురించి మాట్లాడారు. కథా రచనకు భాష శైలి ప్రధాన మని కథలు కొత్తదనం తీసుకువచ్చేలా ఆవశ్యకత గుర్తించాలని తెలియజేశారు. బాల వికాసకారులు సి.ఎ. ప్రసాద్ బాలసాహిత్యంలోని వస్తువు, శిల్పాల గురించి విశేషంగా ప్రసంగించడమే కాక, అనేకాంశాలను చర్చకు పెట్టారు. ఈ సదస్సుకు బాల సాహితీవేత్త పైడిమర్రి రామకృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించారు.



బాల సాహిత్య సదస్సుల్లో ఇటువంటి అంశంపై బాలలు, ఉపాధ్యాయుల గురించి జరగడం ఇదే మొదటిసారి కావచ్చు. సదస్సుకు సినీకవి డా.వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షత వహించి, లలిత సంగీతం గురించి, సంప్రదాయ జానపద శృంగార గీతిక జావళిల గురించి మాట్లాడారు. సంగీత దర్శకులు, ఆకాశవాణి విశ్రాంత కార్యనిర్వహణ అధికారి కలగ కృష్ణ మోహన్ సంగీత మూలాలను పరిచయం చేస్తూ, శాస్త్రీయ కర్ణాటక హిందుస్థాని సంగీతాలు అత్యంత ప్రాచుర్యం పొందాయని, ఏ భాషలో అయినా ప్రాంతంలో వారికైనా శ్రుతిలయ అవసరమన్నారు.

రెండవ రోజు 'లలిత కళా పరిచయం' పై జరిగింది. బాల సాహిత్య సదస్సుల్లో ఇటువంటి అంశంపై బాలలు, ఉపాధ్యాయుల గురించి జరగడం ఇదే మొదటిసారి కావచ్చు. సదస్సుకు సినీకవి డా.వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షత వహించి, లలిత సంగీతం గురించి, సంప్రదాయ జానపద శృంగార గీతిక జావళిల గురించి మాట్లాడారు. సంగీత దర్శకులు, ఆకాశవాణి విశ్రాంత కార్యనిర్వహణ అధికారి కలగ కృష్ణ మోహన్ సంగీత మూలాలను పరిచయం చేస్తూ, శాస్త్రీయ కర్ణాటక హిందుస్థాని సంగీతాలు అత్యంత ప్రాచుర్యం పొందాయని, ఏ భాషలో అయినా ప్రాంతంలో వారికైనా శ్రుతిలయ అవసరమన్నారు. ఆరవ సదస్సులో పాఠశాలలు వికాస కేంద్రాలు ఉపాధ్యాయుల చర్చా గోష్టి జరిగింది. కార్యక్రమానికి స్తంభంకాడి గంగాధర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్యంగా బాలల కోసం మాస, వార పత్రికలు రావాలని, బాల సాహిత్యం పాఠశాలలో ప్రతిరోజు పీరియడ్ ఉండాలని తెలుగు గ్రంథాలయాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చూడాలని కోరారు. తదుపరి ఏడవ సదస్సులో బాల రచయితల ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. మంచి పుస్తకం సురేష్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు బాలవికాసోద్యమ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ముగింపులో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించగా విశిష్ట అతిథిగా బాల చెలిమి, దక్కన్‌ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా పరిషత్తు ట్రస్టు సభ్యులు డా.సి. వసుంధర, పరిషత్తు కార్యవర్గ సభ్యులు డా.సురవరం కృష్ణ వర్ధన్‌రెడ్డి, తురగా ఫౌండేషన్ నుండి తురగా ఉషా రమణి, పరిషత్తు కార్యదర్శి డా.జె.చెన్నయ్యలు పాల్గొన్నారు. గరిపెల్లి అశోక్ సదస్సు లక్ష్యం నెరవేరిన విధాన్ని తన నివేదిక ద్వారా తెలిపారు. ఈ సదస్సులో బాల చెలిమి ప్రచురించిన 'విద్యార్థుల పర్యావరణ కథలు' పుస్తకాన్ని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఆవిష్కరించారు.

ఈ సదస్సు నాలుగు ప్రత్యేక తీర్మానాలను ఆమోదించింది. వాటిలో పాఠశాలల్లో విద్యార్థులకు తెలుగు భాష, కళా సంస్కృతులపట్ల అవగాహన కొరకు చర్యలు తీసుకోవాలని, ఆయా ప్రాంతాల కవి రచయితలను ఆహ్వానించి పాఠశాల విద్యార్థులకు వారితో పరిచయాలు ఏర్పాటు చేయించాలని, పిల్లకు సంగీతం, నృత్యం నేర్పిస్తున్నట్లే కవి పండితుల ద్వారా భాషా సాహిత్యాల అవగాహన కలిగించాలని, పాఠశాలలను కళా సాంస్కృతిక నిల యాలుగా మలిచే విషయంలో భాషోపాధ్యా యుల అంకి తభావం, కృషిదిశగా పనులు జరగాలని ఈ సదస్సు తీర్మానాలు చేసింది.

చల్లబడని కల



రక్తం తాగీ తాగీ ఈ రాతిరి
మృత్యుశిలగా మారింది
కట్టేసిన కాళ్ళూ చేతులూ
విముక్తి గీతాలు పాడుకుంటూ ఉంటే
కళ్ల రేపటి కోసం వేసిన తాళం కప్పకి
ఏ కలలను అనుమతించాలో
ఉత్తరం రాస్తున్నాయి

రెండు ముక్కలుగా తెగిన నాలుక జోలికి
ఏ గోడా చేయి చాపటం లేదు.
గోడలకు మొలిచిన చెవులకు
పవిత్ర శ్లోకాలు తప్ప
ఆర్తనాదాలు ఎందుకు వినిపిస్తాయి?

దేహం చల్లబడిందని గడియారం వంక
శ్వాస పాకుతూ పోతోంది
ఒక్కో బొట్టు కన్నీటిమేకులై
దేహాన్నే నలగగొడుతుంటే
యే చిరకా నాలుకకి దాహం తీర్చలేదు

ఇక్కడ కపాలం పగలలేదు
చివరి నీటి చుక్క
దేహం నుంచి ఆవిరవగానే
పక్కలో బల్లెం దిగి
నన్ను మనిషిని కూడా కానివ్వలేదు
చీకటి గర్భంలో పిండంలా తిరుగాడుతూ
యే అమ్మ పాటని విన్నానో
ఆమె పక్కగా వచ్చి కూచోలేదు

అనంత అక్షరాల కింద
నన్ను కప్పిపెట్టిన ఈ దినం సాక్షిగా
ఒక్క కవితా నా కడుపున కాయలేదు
నా నోటిని మన్నుతో నింపిన
చేతులకు అమృతం అప్పగించిన
మథనం గురించి
వార్త గడపదాటలేదు
కనురెప్పల కింద కాలిన శవాల వాసన
కలల్ని యెత్తుకెళ్ళిన వాడు
ఏ రాజదండం నీడన గద్దెనెక్కాడో
చరిత్ర మాయ ముంత దాచేయలేదు

ఈ రాతిరి
రక్తం గడ్డకట్టి పారటం లేదు
ఓ వెలుగురవ్వ పిడికిలైలేస్తుందనీ
దేహం తన వెచ్చదనాన్ని వదులుకునే
సాహసం చేయటం లేదు
తన అణువణువునీ
తానే దహించటం మానలేదు.

- మెర్సీ మార్గరెట్, 9052809952

పండ్ల మొక్కలు పెంచండిలా...



ఆరోగ్యకరమైన ఆహారంలో పండ్లు చాలా ముఖ్యమైనవి. ఆ పండ్లను పక్వానికి తెచ్చేందుకు ఈ రోజుల్లో లెక్కలేనన్ని రసాయనాలు కలుపుతున్నారని, అవి తీవ్ర అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయని వింటూనే ఉన్నాం. ఆ భయంతోనే సగం మంది పండ్లు తినడం మానేశారు. అలాంటి సమస్యను అధిగమించాలటే ఇంట్లోనే పండ్లను పండించుకుంటే.. వాటిని తినడానికి ఇష్టపడకుండా ఉండరు కదా. అయితే వాటిని ఎలా పెంచగలమనేది ప్రశ్న.. ఇందుకు సంబంధించి కొన్ని చిట్కాలు తెలుసుకుందాం...

కుండీ పరిమాణం : సాధారణంగా మొక్కల పెంపకానికి కుండల ఎంపిక చాలా ముఖ్యం. పెంచే మొక్కలు ఎంత ఎత్తు వరకు పెరుగుతాయి.. మొక్క బరువు ఎంత వరకు ఉంటుందనేది కూడా చాలా ముఖ్యం. మొక్కలను సాధారణంగా 8 అంగుళాల కుండీలలో పెంచుతారు. కాస్త పొడవైన మొక్కలు 36-37 అంగుళాల వరకు ఉండే కుండీలను ఉపయోగిస్తారు.

నీటి పారుదల : కుండీలలో పండించే పండ్లు అధిక నీటిని ఉపయోగించాల్సి ఉంటుంది. కుండలలోని రంధ్రాల ద్వారా నీరు వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. నీరు కుండీల నుంచి బయటకు వస్తుంటే మొక్కలకు సరైన నీరు అందకపోవచ్చు. మొక్క పెరిగే కొద్దీ వేర్లు పెరుగుతుంటాయి.



వేర్ల సంరక్షణ : రంధ్రాలున్న కుండీల వల్ల వేర్లు బయటకు వస్తాయి. ఇలా రాకుండా జాగ్రత్త వహించాలి. వేర్లు బయటకు రాకపోతే లోపలే ఉండి బలంగా, గట్టిగా తయారవుతాయి. ఇలా ఉంటే పండ్ల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. కొన్ని మొక్కలకు వేర్లు కత్తిరించాల్సి ఉంటుంది. వేర్లు కత్తిరించేపుడు మొక్క బరువును పరిగణలోకి తీసుకోవాలి. వేర్ల కత్తిరింపు మొక్కల పెరుగుదల సమయంలోనే చేసుకోవాలి. మొక్కను జాగ్రత్తగా బయటకు తీసి వేర్లు కత్తిరించి తిరిగి కుండీలో సర్దుబాటు చేయాలి. ఇలా చేస్తేనే ఇంటి లోపల మొక్కలను పెంచగలం.

ఎరువుల వాడకం : పండించే పండ్ల రకాల మీద వాడే ఎరువులు ఆధారపడి ఉంటాయి. ఎరువులు సిద్ధం చేసేప్పుడు, అవి సరైన నిష్పత్తిలో ఉండాలి. అలాగే మంచి వెంటిలేషన్, డ్రైనేజీ వ్యవస్థను కలిగి ఉండాలి. సాధారణంగా ఉపయోగించే పాటింగ్ మట్టిలో నిజమైన మట్టి ఉండదు, కానీ కంపోస్ట్ చేసిన నేలలా కనిపిస్తుంది. అందువల్ల స్వంత కంపోస్ట్ తయారు చేసుకోవడం ఉత్తమం.

ఎప్పుడు, ఎక్కడ : పండ్ల మొక్కలను సూర్యరశ్మి అందుబాటులో ఉన్నపుడు ఆరుబయట, చలికాలంలో ఇంటి లోపల ఉంచాలి. చలికాలంలో పండ్ల మొక్కలను బయట ఉంచాల్సి వస్తే వాటికి అవసరమైన సూర్యరశ్మి అందేలా చూసుకోవాలి. మొక్కలను లోపలకు బయటకు మార్చే సమయంలో ఓర్పుగా జాగ్రత్తగా మార్పు చేయాలి. మొక్కలను ఇంట్లోకి తీసుకురావడానికి ముందు ఆకులపై ఉండే దుమ్ము, ధూళి, ఇతరత్రాలేవీ లేకుండా చూసుకోవాలి. అవసరాన్ని బట్టి పురుగుమందుతో పిచికారీ చేసుకోవాలి. పండ్ల మొక్కలు లేదా పండ్ల చెట్లకు ఇంటి లోపల ఉన్నపుడు ఎక్కువ నీరు అవసరం లేదు. అయితే పొడిగానూ ఉంచొద్దు.

ఇలాంటి చిన్న పాటి జాగ్రత్తలు పాటించి ఇంట్లోనే మొక్కలు పెంచుకోవచ్చు.



ఇట్లా చేద్దాం

దంచిన పసుపు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే డబ్బాలో కొద్దిగా ఎండు మిరపకాయలు, కొంచెం రాళ్ళ ఉప్పు వేసి ఉంచాలి.

మయాంక గోయెల్... అల్ఫ్రెడ్ పి. స్లోన్ ఫౌండేషన్ రైటింగ్ అవార్డు విజేత. ఆమె రాసిన "ఎట్ ది హార్ట్ ఆఫ్ ఎవ్రీథింగ్" అనే స్క్రీన్‌ప్లేకు రైటింగ్ అవార్డును గెలుచుకుంది. బాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమతో అనుబంధం ఉన్న కుటుంబంలో పెరిగిన ఆమెకు ఈ అవార్డు ఒక సరైన దిశను చూపించింది. అంతే కాదు స్లోన్ అవార్డు పరిశ్రమలో కొనసాగేందుకు ఓ భరోసా ఇచ్చింది. నష్టాల కంటే ఎక్కువ తిరస్కరణలు ఉండే రంగంలో సాధించిన ఈ విజయం తన కష్టానికి ప్రతిఫలంగా భావిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

ప్రతిభకు దక్కిన గౌరవం



ముంబైలో జన్మించిన మయాంక బాల్యమంతా తన తల్లిదండ్రులు రాసిన కథలు చదువుతూ గడిపింది. పుస్తకాలు, ప్రదర్శనలు, చలనచిత్రాలు ఆమె జీవితంలో భాగమయ్యాయి. 18 ఏండ్ల వయసులో తల్లి, అన్నయ్యను కోల్పోయింది. ఇది ఆమె జీవితంలో అత్యంత విషాద సంఘటన. ఆ దుఃఖం నుండి బయటకు వచ్చేందుకు రచనలను చేయడం మొదలు పెట్టింది. 'ఎట్ ది హార్ట్ ఆఫ్ ఎవ్రీథింగ్' అనే ఓ నాటకాన్ని రాసింది. ఇది తన జీవిత ఆధారంగా రాసిన నాటకం. ఎన్ని రచనలు చేసినా మనం ఎంతో ప్రేమించే వ్యక్తులను వదులుకోవడం అంత సులభం కాదు అనే విషయాన్ని ఆమె అర్థం చేసుకుంది.



లోతైన అధ్యయనం ఉంటేనే

అవార్డు గురించి అడిగినప్పుడు మయాంక "సైన్స్ అనేది మనం సినిమా, టీవీలో తరచుగా చూసే విషయం కాదు. మనం రాసేది ఏదైనా రీసెర్చ్ ఆధారిత కథగా ఉండాలి. అది లోతైన అధ్యయనం చేసినప్పుడు సాధ్యం. ఈ కథను రాయడం కోసం సైన్స్ నిపుణులతో ఎన్నో సమావేశాలు జరిపాను. అనేక చిత్తుప్రతులు ఎంతో శ్రమించాను. నా కష్టానికి ఇలా గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది" అన్నది.

ప్రతిష్టాత్మక పోటీలలో...

మయాంకా టిస్చ్ ఫ్యూచర్ స్క్రీన్ రైటర్స్ ఫెలోషిప్ కూడా అందుకుంది. వారి గ్రాడ్యుయేట్ డ్రమాటిక్ రైటింగ్ ప్రోగ్రాం కోసం NYU టిస్చ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ స్కాలర్‌షిప్‌ను అందజేసింది. ఆమె 1497 ఫీచర్స్ ల్యాబ్, స్క్రీన్‌క్రాఫ్ట్ స్క్రీన్ రైటింగ్ ఫెలోషింంప్, ఫిల్మ్‌మాటిక్ స్క్రీన్‌ప్లే అవార్డ్స్ వంటి అనేక ప్రతిష్టాత్మక పోటీలలో స్థానం సంపాదించింది. ఆమె రికా x సౌత్ ఏషియన్ రైటర్స్ కమిటీ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లో కూడా పాల్గొంటుంది. దానితో పాటు రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా నుండి స్క్రీన్ రైటర్స్ మార్గదర్శకత్వంలో తన పనిని మెరుగు పరుచుకుంటుంది. ప్రస్తుతం ఆమె భారతీయ టెలివిజన్‌లో చాలా అరుదుగా కనిపించే టీనేజ్ సిట్‌కామ్ కోసం పైలట్‌గా చేస్తుంది.

సీనియర్ క్రియేటివ్ లీడ్‌గా...

టెలివిజన్‌లోకి రాకముందు ఆమె డిజిటల్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీ Schbang డిజిటల్ సొల్యూషన్స్‌లో సీనియర్ క్రియేటివ్ లీడ్‌గా మూడేండ్లు పనిచేసింది. అక్కడ ఉన్నప్పుడు మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఒక చలన చిత్రానికి స్క్రిప్ట్ రాసింది. ఇందులో తన్మయ్ భట్ (భారతదేశపు అత్యుత్తమ స్టాండప్ కామిక్స్‌లో ఒకటి), తనయ్ ఛేడా (ఆస్కార్ విజేత చిత్రం స్లమ్‌డాగ్ మిలియనీర్) నటించారు. ఆమె ఫెవికాల్ కోసం ప్రకటనలు కూడా చేశారు. ఇది భారతదేశంలోని అతిపెద్ద పురాతన బ్రాండ్‌లలో ఒకటి. ఈ ప్రకటనలకు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు కూడా అందుకుంది. డిజిటల్ పోస్టలు, యాడ్ ఫిల్మ్‌లతో సహా ఫెవికాల్ కోసం 60 ఏండ్ల ప్రచారానికి 80,000 డాలర్లు అందుకుంది.



గొప్ప అనుభవం ఉంది

30 లక్షలకు పైగా ఆన్‌లైన్ ఫాలోవర్లతో ఫొటోబ్లాగ్ హ్యూమన్స్ ఆఫ్ బాంబే కోసం మొట్టమొదటి షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించడానికి కూడా ఆమె రైటింగ్ స్కిల్స్ ఉపయోగించారు. పిల్లలు వీటిని జంబుల్స్ అని పిలుస్తారు. ఆమె దాని కోసం ఒక యానిమేటెడ్ జింగిల్ రాసింది. దీని కంటెంట్ నుండి పోస్ట్-ప్రొడక్షన్ వరకు ప్రతిదీ పర్యవేక్షించింది. మయాంకకు వినోద రచనా రంగంలో గొప్ప అనుభవం ఉంది. ఆమె ఒక అద్భుతమైన రచయిత్రి. కష్టపడి పనిచేస్తోంది. ఆమె ఏది రాయాలనుకుంటే అదే రాస్తుంది. దాన్ని గడువులోగా పూర్తి చేస్తుంది. మయాంక విజయానికి అసలు కారణం ఇదే.

ఫీచర్లు రాసింది

మయాంక ముంబైలోని సెయింట్ జేవియర్స్ కాలేజ్ నుండి ఇంగ్లీష్ డిగ్రీ పూర్తి చేసింది. సోఫియా పాలిటెక్నిక్ నుండి జర్నలిజం, అడ్వర్టైజింగ్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేస్తున్నప్పుడు ది హిందూ పత్రికలో 'లైవ్స్ ఆఫ్ ది ఉమెన్ వాల్యూం 3' కోసం అప్పుడప్పుడు ఫీచర్లు రాసింది. తర్వాత ఎరిన్, ఆరోన్ షోకు మొదటి సీజన్‌లో నికెలోడియన్‌లో షోరన్నర్ అసిస్టెంట్‌గా పనిచేసింది. స్లోన్ ఫౌండేషన్ 'ది ఇమిటేషన్ గేమ్', 'ది మ్యాన్ హూ నో ఇన్ఫినిటీ' వంటి పెద్ద ఉపన్యాసాలు, పరిశోధనలు, చిత్రాలకు మద్దతునిచ్చే ఒక అమెరికన్ ఎన్‌జీఓ.

శాంతి భద్రతల రక్షణలో తెలంగాణ టాప్

నవతెలంగాణ-అడిక్‌మెట్

దేశంలోనే తెలంగాణ పోలీస్ వ్యవస్థ శాంతి భద్రతల పరిరక్షణలో మొదటి స్థానంలో ఉందని హోం మంత్రి మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ నుంచి లిబర్టీ, అబిడ్స్, చార్మినార్, ఎంజే మార్కెట్, రవీంద్ర భారతి, తెలుగు తల్లి విగ్రహం మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని రాష్ట్ర హోం మంత్రి ప్రారంభించారు. ఈ ర్యాలీలో బ్లూ కోట్స్, పెట్రో కార్స్, ఇంటర్ సెక్టర్ వెహికల్స్, కెమెరా, క్లూస్ టీం వాహనాలు, వజ్రవాహనాలు, వాటర్ క్యానెల్ వాహనాలు పాల్గొన్నాయి. అలాగే ర్యాలీలో అగ్నిమాపక శకటాలను కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీస్ శాఖ ఎంతో పురోగతి సాధించిందన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ వ్యవస్థ మొదటి స్థానంలో ఉందని, శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ నెంబర్ వన్ అని తెలిపారు. సీఎం కేసీఆర్ పోలీస్ శాఖకు మొదటి ప్రాధాన్యత కల్పించి అనేక మార్పులు తెచ్చారని చెప్పారు. సీసీ కెమెరాలు, నూతన పోలీస్ భవనాలు, నూతన టెక్నాలజీ, పోలీస్ వాహనాలు ఇలాంటి అనేక మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, తెలంగాణ పోలీసులకు దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, డీజీపీ అంజనీ కుమార్, మూడు కమిషనరేట్ల సీపీలు సీవీ ఆనంద్ స్టీఫెన్, రవీంద్ర, డీఎస్ చౌహాన్, సినీ హీరో నిఖిల్ పాల్గొన్నారు.

పోలీస్ విభాగాల స్టాళ్ల ప్రదర్శన

సురక్ష దినోత్సవాన్ని పురస్కరించుని ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీస్ విభాగాలు, జైళ్లు, అగ్నిమాపక శాఖలకు చెందిన స్టాళ్ల ప్రదర్శనను మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పౌరుల భద్రతపై పోలీస్ శాఖ చేపట్టిన పలు అంశాలను తెలియజేసే ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అలాగే సైబర్ సెక్యూరిటీ, రోడ్ సేఫ్టీలపై పోలీస్ శాఖ టాస్క్‌ల మధ్య ఎం.ఓ.యూ కుదిరింది. ఈ మేరకు టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా , ఐజీ రమేష్ రెడ్డి, విశ్వజిత్ ఎం.ఓ.యూపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో డీజీపీ అంజనీ కుమార్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఫైర్ శాఖ డీజీ నాగిరెడ్డి, అడిషనల్ డీజీలు మహేష్ భగవత్, విజయ్ కుమార్, షికా గోయల్, అభిలాష బిస్త్, స్వాతి లక్రా, సంజీవ్ కుమార్ జైన్, సందీప్ శాండిల్య, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ సీపీ డీ.ఎస్.చౌహాన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ సిబ్బంది సమ్మె నోటీసు

- గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మల్టీపర్పస్ రద్దు, కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్, జీవో నెంబర్ 60 అమలు, తదితదిర అంశాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు సోమవారం సమ్మె నోటీసు ఇవ్వనున్నట్టు గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎస్.యజ్ఞనారాయణ తెలిపారు. ప్రధానంగా 19 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇవ్వనున్నామని చెప్పారు. దానికి సంబంధించిన వివరాలను వారు మీడియాకు వెల్లడించారు. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్సీలో కనీస వేతనంగా నిర్ణయించిన రూ.19 వేలను వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేషన్ కల్పించాలనీ, అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌కే.డే ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలనీ, అవసరమున్న చోట సిబ్బందిని కొత్త నియమించాలనీ కోరారు. పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా, యూనిఫామ్స్, అలవెన్స్‌లు, తదితర సౌకర్యాలను వర్తింపజేయాలని విన్నవించారు. ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలను ఆదుకోవాలనీ, దహనసంస్కారాలకు ప్రత్యేకంగా డబ్బులు ఇవ్వాలని కోరారు. జేఏసీ సమావేశంలో కన్వీనర్లు పి.అరుణ్‌కుమార్, పి.శివబాబు, చాగంటి వెంకటయ్య, జయచంద్ర, కోకన్వీనర్లు వెంకటరాజ్యం, ఆర్.మధుసూదన్‌రెడ్డి, పాలడుగు సుధాకర్, ఆర్‌కే.నాయుడు, కోశాధికారి సీహెచ్ సదానందం, జేఏసీ సభ్యులు సామల శ్రీకాంత్, వెంకట్రాములు, డి.యాదయ్య, రాందాసు, తదితరులు పాల్గొన్నారు.

రాజద్రోహ చట్టం సమర్థనీయం కాదు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాజద్రోహం చట్టం రూపంలోకి తీసుకురావాలని, దానికి మరిన్ని కోరలు పెట్టి దండనీయ నేరంగా కఠిన శిక్షలు అమలు చేయాలని లా కమిషన్ చేసిన సిఫారసులను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం, ప్రభుత్వ ఆలోచనలతో విభేదించడాన్ని రాజద్రోహంగా పరిగణించడమనే సంప్రదాయం మధ్యయుగాల నాటి క్రూరమైన అణచివేతకు నిదర్శనమన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22వ లా కమిషన్ సిఫారసు చేసిన సెడిషన్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐపీసీ 124 ఏ సెక్షన్ రద్దు చేస్తూ గతేడాది ఇచ్చిన ఉత్తర్వులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. లా కమిషన్ చేసిన ఈ సిఫారసుల సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు పూర్తి భిన్నమైనదన్నారు. బ్రిటీష్ వలస పాలకులు భారతీయులను అణచివేయడం కోసం, వారి ప్రజాస్వామ్య ఆకాంక్షలను అణగదొక్కడం కోసం తెచ్చిన రాజద్రోహం చట్టాన్ని లా కమిషన్ ఏ విధంగా సమర్థిస్తుందని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలోని 19వ అధికరణ ప్రకారం దేశ ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కులను ఈ విధమైన సిఫారుసులు హరించి వేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదానికి ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించాలని, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుదర్శన్ మాట్లాడుతూ.. రైలు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇటీవల భారత రైల్వేలో కవచ్ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాలను అరికట్టనున్నామని ఘనంగా ప్రకటించిన మోడీ, ఇప్పుడు ఈ ప్రమాదానికి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కవచ్ పరిజ్ఞానాన్ని రైల్వే స్టేషన్లు, రైల్వేల్లో ఎందుకు అమలు చేయలేదన్నారు. ప్రయివేటీకరణ పెరిగితే ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, ప్రయివేటు వ్యక్తులు ఆర్థిక విషయాలతో ముడిపెట్టి ఉద్యోగుల సంఖ్యను క్రమేపీ తగ్గించడంతో పని ఒత్తిడి పెరిగి విశ్రాంతి తగ్గుతుందన్నారు. దాంతోపాటు నిరంతరం పర్యవేక్షణ కరువవుతుందని తెలిపారు.

దశాబ్ద కాలంలో ఇంతటి ఘోర ప్రమాదం జరగలేదని అన్నారు. రైల్వే శాఖ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం.. వందలాది మంది ప్రాణాలను బలిగొందన్నారు. దీన్ని ఒక హెచ్చరికలా భావించి ఇప్పటికైనా రైల్వే ప్రయివేటీకరణను కేంద్రం నిలుపుదల చేయాలని సూచించారు. మృతి చెందిన వారికి రూ.కోటి, గాయపడిన వారికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, బండి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలతో అనివార్యంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటికీ బీజేపీ అతన్ని వెనుకేసుకుని రావడం దుర్మార్గమన్నారు. లైంగిక దాడుల కేసుల్లో అరెస్టులు నివారించడానికి పోక్సో యాక్టును సవరించాలని బ్రిజ్‌భూషణ్ డిమాండ్ చేయడం దారుణమన్నారు. ఆర్‌ఎస్ఎస్‌కు మహిళలంటే చులకనభావమనీ, మహిళలు ఉన్నతస్థాయికి ఎదగడం బీజేపీ ఏమాత్రం ఇష్టముండదనీ విమర్శించారు. బీజేపీ భావజాలమే అదన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక దళితులపైనా, మహిళపైనా దాడులు తీవ్రమైపోయాయని చెబుతూ పలు ఉదహరణలు చెప్పారు. మూడు నల్ల చట్టాల కోసం ఢిల్లీలో చేసిన పోరాట స్ఫూర్తినే నేడు రెజ్లర్లు ప్రదర్శిస్తున్నారనీ, వారికి న్యాయం జరిగే వరకూ వారి పోరాటానికి సీఐటీయూ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు మాట్లాడుతూ..ఒలింపిక్స్‌లో దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేసిన రెజ్లర్లు చివరకు తమ పతకాలను గంగపాలు చేసే స్థితిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. నెలన్నర నుంచి ఢిల్లీలో రెజ్లర్లు అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. వారి పోరాటానికి రోజురోజుకీ ప్రజామద్దతు పెరుగుతున్నదన్నారు. క్రీడాకారులు కూడా ఒక్కతాటిపైకి వచ్చి మద్దతునిస్తుండటం మంచి పరిణామం అన్నారు. బ్రిజ్‌భూషణ్ అరెస్టు చేసేదాకా ఈ పోరాటం ఆగబోదన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..జంతర్ మంతర్ వద్ద రెజ్లర్ల



ధర్నా శిబిరాలను తొలగించడం దారుణమన్నారు. ఇండియా గేట్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు అనుమతినివ్వ కుండా కేంద్ర ప్రభుత్వం నిర్బంధ కాండను ప్రయోగిస్తున్నదని విమర్శించారు. అయినా రెజ్లర్లు తమ పోరాటాన్ని పట్టుదలతో కొనసాగిస్తున్నారన్నారు. బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఉపాధ్యక్షులు జయలక్ష్మి మాట్లాడుతూ..ఢిల్లీలో రెజ్లర్లు మహా పంచాయతీ నిర్వహించేందుకు యత్నించగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ప్రపంచ పోటీల్లో గాయపడ్డ క్రీడాకారిణిని పట్టుకుని తనతో సన్నిహితంగా ఉంటే వైద్య ఖర్చులన్నీ భరిస్తానని బ్రిజ్‌భూషణ్ సింగ్ మాట్లాడటం దుర్మార్గమని విమర్శించారు. బేటీ పడావో..బేటీ బచావో అంటూ మహిళలపట్ల ఇలా వ్యవహరించడం అన్యాయమన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి వంగూరు రాములు, కనీస వేతనాల బోర్డు సలహామండలి సభ్యులు జె.మల్లిఖార్జున్, సీఐటీయూ ఆఫీస్ బేరర్లు ఎస్.వీరయ్య, జె.వెంకటేశ్, భూపాల్, బి.మధు, జె.మల్లిఖార్జున్, కె.ఈశ్వర్‌రావు, జె.చంద్రశేఖర్, రాజారెడ్డి, ముత్యంరావు, కళ్యాణం వెంకటేశ్వర్లు, వీఎస్.రావు, ఏజే రమేశ్, బీరం మల్లేశ్, గోపాలస్వామి, కూరపాటి రమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.కోటంరాజు, యాటల సోమన్న, పి.సుధాకర్, మందా నర్సింహారావు, కుమారస్వామి, ఆర్.వాణి, ఎం.చంద్రమోహన్, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంలో మనమే నెం1

(మొదటి పేజీ తరువాయి)

అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) విడుదల చేసిన నివేదికలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. ప్రభుత్వం చేపట్టిన అడవుల పెంపకం, మున్సిపల్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ వంటి అనేక పర్యావరణహిత కార్యక్రమాలను పరిగణలోకి తీసుకున్న సంస్థ, రాష్ట్రానికి అగ్రస్థానాన్ని కట్టబెట్టింది. జాతీయస్థాయిలో పర్యావరణ రంగంలో ఈ గొప్ప గుర్తింపు లభించడం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. పచ్చదనంతో పరిఢవిల్లాలన్న బృహత్ సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రారంభించిన తన మానస పుత్రిక హరితహారం కార్యక్రమంతో పాటు అనేక పర్యావణహితమైన కార్యక్రమాలకు ఈ అరుదైన ఘనత దక్కడం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరితహారంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమయ్యేలా భాగస్వాములైన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం తనదైన విధానాలతో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని, పర్యావరణం విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాల ఫలితమే తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచేందుకు కారణమని అన్నారు. పర్యావరణ విధ్వంసం నుంచి తెలంగాణ ప్రాంతం కోలుకునేలా తొలినాళ్లలోనే కేసీఆర్ దీర్ఘదృష్టితో ఈ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి, దాని అమలుకి చూపిన చంచలమైన కృషి వల్లనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. భవిష్యత్తు తరాల కోసం హరించుకుపోయిన అడవులను పునరుద్ధరించి, రాష్ట్రంలో పచ్చదనాన్ని 22 శాతం నుంచి 33 శాతానికి పెంచడం లక్ష్యంగా హరితహారం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, ప్రజల సహకారంతో ఇది ఒక ఉద్యమ రూపంలో కొనసాగిందన్నారు. అనేక సానుకూల ఫలితాలు అందుతున్న విషయాన్ని అనేక సంస్థలు పలుమార్లు గుర్తించిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు.

హరితహారంతో పాటు ప్రభుత్వం పర్యావరణహితమైన అనేక కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పర్యావరణానికి అత్యంత సవాలుగా నిలిచే పారిశుద్ధ్య నిర్వహణ విషయంలోనూ అద్భుతమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు పలు పురపాలికల్లో పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. హైదరాబాద్ నగరంలో వేస్ట్ టు ఎనర్జీ రంగంలో 24 మెగావాట్ల విద్యుత్తుని ఉత్పత్తి చేస్తూ దేశంలోనే రెండోస్థానంలో నిలిచిందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ద్వారా విద్యుదుత్పత్తి చేయడంలోనూ తెలంగాణ అగ్రగామిగా నిలుస్తున్నదన్నారు.

ప్రభుత్వ ప్రయత్నాలకు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, అవార్డులు, ప్రశంసలు రావడం మరింత తమకు స్ఫూర్తిని ఇస్తుందని కేటీఆర్ అన్నారు. ఈ మధ్యనే తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బృహత్ ప్రకృతి వనాలు, దేశానికే ఆదర్శం అంటూ నీటి అయోగ్ ప్రత్యేక ప్రశంసలు ఇవ్వడాన్ని కూడా కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. భవిష్యత్తు తరాలకు పర్యావరణహిత రాష్ట్రాన్ని అందించాలన్న లక్ష్యం కోసం తమ తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు.

తెలంగాణలోనూ బీజేపీని తుడిచిపెట్టేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా పర్యటనలో ఉన్న ఆయన న్యూయార్క్, వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కోలో కార్యక్రమాలను ముగించుకొని మాన్‌హాటన్ చేరుకోనున్నారు.

కర్ణాటకలో బీజేపీ అన్ని శక్తులను ఒడ్డి పోరాడిందని రాహుల్ చెప్పారు. అయినప్పటికీ.. కాంగ్రెస్ ఆ పార్టీని తుడిచిపెట్టేసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ అదే జరగబోతోందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీని గుర్తించడం కష్టమని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. అలాగే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోనూ బీజేపీ కనిపించకుండా పోతుందని వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న విద్వేష రాజకీయాలతో ముందుకెళ్లలేమని దేశ ప్రజలు గుర్తించడమే అందుకు కారణమన్నారు.

2024 ఎన్నికల్లోనూ బీజేపీని ఓడిస్తామని రాహుల్ అన్నారు. ప్రతిపక్షాలు ఏకమయ్యాయని చెప్పారు. అన్ని పార్టీలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఓవైపు బీజేపీ విద్వేషపూరిత సిద్ధాంతం.. మరోవైపు కాంగ్రెస్ ప్రేమపూర్వక సిద్ధాంతం ప్రజల ముందున్నాయని వ్యాఖ్యానించారు.

నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణాలు

- రక్తసిక్తంగా వేములవాడ-రుద్రంగి రోడ్డు
- పదేండ్లలో రోడ్డు వేసిన ఒక్కసారి కూడా నిర్మించని సైడ్ బర్మ్‌లు
- కానరాని సూచిక, హెచ్చరిక బోర్డులు, డివైడర్ లైన్స్
- ఐదేండ్లలో పదుల సంఖ్యలో ప్రమాదాలు 8మంది మృతి


సైడ్ బర్మ్, రోడ్ సైన్స్ ఏర్పాటు చేయకుండా నిర్మించి వదిలేసిన రోడ్డు


అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు(ఫైల్)

నవతెలంగాణ - చందుర్తి

రోడ్డు నిర్మాణాలు కేవలం నిధులు దండుకోవడానికేనా అన్నట్టు కనిపిస్తోంది వేములవాడ-రుద్రంగి వరకు వేసిన 25కిలోమీటర్ల రహదారిని చూస్తుంటే. కాంట్రాక్టర్ రోడ్డు వేసి చేతులు దులుపుకోగా సైడ్ బర్మ్‌ల నిర్మాణం, రోడ్డు సైన్స్, సూచక బోర్డులు, డివైడింగ్ లైన్స్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గడిచిన ఐదేండ్లలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. దాదాపు 8మంది ప్రాణాలు కోల్పోయారు.

రోడ్డు మరమతుల్లో భాగంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి తారు రోడ్డు వేస్తారు. ఇలా వేములవాడ-రుద్రంగి వరకు కాంట్రాక్టర్ 25కిలో మీటర్ల రోడ్డు వేశాడు. గడిచిన పదేండ్లలో ఇప్పటికి ఐదారు సార్లు తారు రోడ్డు వేశారు. ప్రతి సారీ దాదాపు 2ఇంచుల మందంతో రోడ్డు పోశారు. అంటే పదేండ్లలో రోడ్డు దాదాపు పది ఇంచులకు పైగానే ఎత్తు పెరిగింది. ఒక వైపు రోడ్డు ఎత్తు పెరుగుతుంటే ఇరు పక్కలా మట్టితో బర్మ్ నింపాల్సి ఉండగా అధికారులుగానీ కాంట్రాక్టర్‌లు గాని పట్టించుకున్న పాపానపోలేదు. బర్మ్ లేకపోవడమే కాదు ఉన్న మట్టి కూడా వర్షాలకు గండి కొట్టుకుపోవడంతో ఎదురుగా వచ్చిన వాహనాలకు దారి ఇవ్వాలన్నా లేదా వాహనాలను దాటి ముందకు వెళ్లాల్సిన క్రమంలో రోడ్డు కిందికి దిగాల్సి వచ్చినప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరగముందే అధికారులు వెంటనే స్పందించి సైడ్ బర్మ్ వేయాల్సిన అవసరం ఉంది.

రోడ్డు నిబంధనలూ బేఖాతర్..

సాధరణంగా వాహనదాలులు లైన్ డ్రైవింగ్ చేయకపోవడం నేరం. ప్రమాదాలు జరిగే ఆస్కారం కూడా ఉంటుంది. కానీ అసలు రోడ్డు నిర్మాణంలోనే అవసరమైన రోడ్డు డివైడింగ్ లైన్, ఇతర సూచిక లైన్లు బోర్డులు లేకపోతే ఎంత పెద్ద నేరంగా చూడాలి. వేములవాడ-రుద్రంగి వరకు నిర్మించిన 25కిలో మీటర్ల రోడ్డులో ఎక్కడ కూడా రోడ్డు సైన్స్, డివైడర్ లైన్ కనిపించడంలేదు. దీంతో వాహనదారులు ఇష్టానుసారం డ్రైవింగ్ చేయడంతో ప్రమాదంలో జరిగే అవకాశం ఉంది. రానున్నది వర్షాకాలం కావడంతో రాత్రి వేళల్లో రోడ్డు కనిపించక ఇబ్బందులు తలెత్తనున్నాయి.

ఐదేండ్లలలో ఎనిమిది మంది మృతి

ఈ రోడ్డుపై గడిచిన ఐదేండ్ల కాలంలో ఏడు ప్రమాదాలు జరిగాయి. మాల్యాల మూల మలుపు వద్ద రోడ్డు ఇరుకుగా ఉండి ట్రాక్టర్ లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. కట్ట లింగంపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు తన బైక్‌పై నుంచి పడి ఇంటి గోడకు ఢీకొని మృతి చెందాడు. నాలుగేండ్ల కిందట మర్రిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మూడపల్లి క్రాసింగ్ వద్ద బైక్ అదుపుతప్పి మృతి చెందారు. రెండు నెలల కిందట రుద్రంగి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కారు ప్రమాదంలో మూడపల్లి బస్టాండ్ ప్రాంతంలో మృతి చెందారు. మర్రిగడ్డ పెట్రోల్ బంక్ వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రెండు నెలల కిందట లింగంపేట వద్ద కథలాపూర్ మండలం తాండ్రలకు చెందిన గడ్డం గంగారెడ్డి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇదంతా రోడ్ మధ్యలో లైన్స్ వేయక పోవడం. మరో వైపుగా క్రాసింగ్‌ల వద్ద రేడియం లైటింగ్ సూచిక బోర్డులు లేపోవడంమే కారణంగా తెలుస్తోంది. సమస్యకు పరిష్కారం కోసం ఆర్అండ్‌బీ ఏఈని ఫోన్ సంప్రదించగా స్పందించలేదు.

అధికారుల తప్పిదమే ప్రమాదాలకు కారణం..



సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం రోడ్ల క్రాసింగ్ వద్ద చెట్లు పెరిగి ఇరుకుగా మారుతున్నాయి. ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఎక్కడా లేకపోవడం కూడా కారణమే. రోడ్ వేసి సైడ్‌కు మట్టి పోయని అధికారుల తప్పిదమే ప్రమాదాలకు కారణం. అధికారులు రోడ్ ప్రమాదాలు జరుగా కుండా చూడాలి.

- నాగం కుమార్, చందుర్తి జెడ్పీటీసీ

వంతెన కింద పసికందు మృతదేహం లభ్యం

ఘటనపై అన్ని అనుమానాలే...?



నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన అయ్యోరుపల్లి సమీపంలో దారుణం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం సుమారు రెండు నెలలు ఉండే పసికందు శవం వంతెన కింద లభ్యమైంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు రెండు నెలలు ఉండే పసికందును ఎవరో చంపి వంతెన కింద పడేశారు అనే స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అక్కడి వంతెన కింద మగ శిశువు మతదేహం తల వేరు చేసి ఉందని, సదరు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే సదరు శిశువును వేరే దగ్గర చంపి ఇక్కడికి తీసుకువచ్చి పడేశారా...? ఇక్కడిక్కడే చంపి పడేశారా....? మరెక్కడైన చనిపోయిన శిశువును పాతి పేడితే కుక్కలు ఇక్కడికి లాక్కొని వచ్చాయా....? ఇంతకీ పసికందును చంపాల్సిన అవసరం ఎవరికి ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ



నవతెలంగాణ - గంభీరావుపేట: మండల పరిధిలోని మా వృద్ధాశ్రమంలో అనాధ వద్దులకు తమ సిబ్బందితో కలిసి ఎస్ఐ మహేష్ బియ్యం , బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ భరోసా కల్పించాలన్నారు. తల్లిదండ్రులను పిల్లలు వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలేయకుండా వారికి తోడుగా ఉండాలని, తల్లిదండ్రులను విస్మరించిన చట్టంలో పలు సెక్షన్ల ప్రకారం శిక్షార్హులు అవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వృద్ధాశ్రమం నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్, వృద్దులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని ఆవునూరు గ్రామంలో సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వంశీ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బిపి, షుగర్, కిడ్నీ, బ్రెయిన్, లివర్, హార్ట్ లాంటి వాటన్నిటికీ ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచిత మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి జనరల్ మెడిసిన్ నేరెళ్ల వంశీధర్ గౌడ్ సర్పంచ్ కళ్యాణి భాను ఎంపిటిసి లలిత సామాజిక కార్యకర్త విశ్వనాథం గ్రామస్తులు పాల్గొన్నారు.

మిడిల్ విద్యుత్ పోల్స్ ఏర్పాటు

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని మోహిని కుంట గ్రామంలో మిడిల్ విద్యుత్ పోల్స్ విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. మిడిల్ పోల్స్ లేకపోవడం వల్ల గ్రామ ప్రజలందరికీ విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని సర్పంచ్ కల్వకుంట్ల వనజగోపాల్ రావు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. అందులో భాగంగానే మిడిల్ పోల్స్ వేసినట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ - ముస్తాబాద్ : ముస్తాబాద్ నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996/97 సంవత్సరంలో పదవ తరగతిచదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకరికి ఒకరు కలు సుకుని ఆత్మీయ అనురాగాలు పంచుకున్నారు. గత 26 సంవత్సరాలకు కలిసి చదువుకొని ఇప్పటివరకు కూడా కల్వకపోవడంతో ఒకేసారి కలవడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి. అప్పటి ఉపాధ్యాయులందరినీ ఘనంగా సత్కరించారు.

నీటి దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - వేములవాడ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 7న నిర్వహించే సాగు నీటి దినోత్సవం, జూన్ 8న నిర్వహించే ఊరూరా చెరువుల పండగల కార్యక్రమాల వాల్ పోస్టర్లను ఆదివారం ఎమ్మెల్యే రమేష్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నీటి పారుదల రంగంలో సాధించిన ప్రగతిని రైతులకు, ప్రజలకు, ప్రతి ఊరుకు తెలియజేద్దామన్నారు. తెలంగాణా రాకముందు, వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధి, మిషన్ కాకతీయతో గ్రామాల్లోని 400చెరువులలో పెరిగిన భూగర్భ జల సంపద, పెరిగిన పంట విస్తీర్ణం, ఉత్పత్తి, మత్స్య సంపద వివరాలు, మూలవాగుపై 12చెక్ డ్యాంల నిర్మాణంతో జరిగిన నీటి లభ్యత, 365రోజులు నిండు కుండలా ఉన్న గుడి చెరువు ప్రాధాన్యతతోపాటు అన్ని రకాల చెరువుల అభివృద్ధిపై రైతులకు, ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, ఏఈ విష్ణు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పూర్తయేదెన్నడు?

డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



నవతెలంగాణ - వేములవాడ

ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో వేములవాడ పట్టణంలోని బస్ డిపో వద్ద నిర్మాణములో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఎప్పుడూ పూర్తవుతుందని, లబ్ధిదారులకు ఇండ్లు ఎప్పుడూ ఇస్తారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక నాయకులతో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో గతంలో ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించడం జరిగిందని, వేములవాడలో ఇప్పటికి అవే ఇండ్లు ఉన్నాయని, బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వేములవాడలో ఒక్కటంటే ఒక్క ఇళ్లు లబ్ధిదారులకు అందించలేదని మండిపడ్డారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ ప్రెస్ క్లబ్ టియూడబ్ల్యూజే(హెచ్-143) అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, కోశాధికారి మారుపాక శ్రీహరిలను వేములవాడ పట్టణ ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు-ప్రభుత్వాలకు మధ్య వారధిలుగా ఉండే పాత్రికేయులు తమ వంటి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, గంగాధర్, ఎండి చాంద్, నవీన్, శంషు, ప్రవీణ్, శ్రీనివాస్, జావీద్, రఫీ ,ఉడతల లింగయ్య, పోచయ్య పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతి

నవతెలంగాణ - గంభీరావుపేట: : వేర్వేరు ఘటనల్లో పురుగులమందు తాగి ఇద్దరు మృతి చెందిన ఘటన గంభీరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేటకు చెందిన చెరుకు సత్యనారాయణ(55) ఏమి పని చేయకపోవడంతో మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో శనివారం మందలించడంతో మధ్యాహ్నం సమయంలో ఫోన్ చేసి పెద్దమ్మ అటవీ ప్రాంతంలో పురుగులమందు తాగినట్టు తెలపడంతో బంధువుల సహాయంతో సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృత్యువాత పడటంతో సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో.. గంభీరావుపేటకు చెందిన నర్సవ్వ(60)స్థానికంగా రూమ్ వేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. ఐతే ఆదివారం ఇంట్లో ఉదయం పురుగులమందు సేవించి కొట్టుకుండటంతో బంధువుల సమాచారం మేరకు మెరుగైన చికిత్స కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల మందలింపుతో యువతి ఆత్మహత్య

నవతెలంగాణ - బోయినిపల్లి : సెల్ ఫోన్లు అతిగా వాడకూడదని తల్లిదండ్రులు మందలించడంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. బోయినపల్లి ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన పోలే శరణ్య అనే యువతి(16) అతిగా సెల్ ఫోన్ వాడడంతో శనివారం రాత్రి సెల్ ఫోన్ ఎక్కువ వాడకూడదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన యువతి శనివారం రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయి గ్రామ శివారులోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి తండ్రి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణలో అగ్రస్థానం

- బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ షీ టీమ్ సేవలతో మరింత పటిష్టంగా పోలీస్ వ్యవస్థ
- సురక్షా దినోత్సవంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్..

నవతెలంగాణ - సిరిసిల్ల

శాంతి భద్రతల పరిరక్షణలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానం ఉందని, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ షీ టీమ్,సేవలతో మరింత పటిష్టంగా పోలీస్ వ్యవస్థ నిర్మాణం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సురక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ,17వ బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో పెట్రో కార్,బ్లూ కోల్ట్ వివిధ విభాగాలకు చెందిన పోలీస్ వాహనాలు,పోలీస్ డాగ్స్,డిస్ట్రిక్ట్ గార్డ్ రోబోర్ట్ సిబ్బంది జిల్లాలోని పోలీస్ అధికారులు సిబ్బందితో పోలీస్ పని తీరుతెలిసేలా సిరిసిల్ల పట్టణంలోని వాసవి గార్డెన్స్ నుండి పాత బస్టాండ్, అంబేద్కర్, గాంధీ మీదుగా వెళ్లి కొత్త బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ భారీ ర్యాలీలో ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైరపర్సన్ జిందం కళ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు దూరదృష్టి ప్రత్యేక చొరవతో పోలీస్ వ్యవస్థ పటిష్టం అయిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం కంటే ముందు ఒక డీఎస్పీ స్థాయి అధికారి పరిధిలో ఉన్న సిరిసిల్ల, రాష్ట్రం సిద్ధించి జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లాకు ఒక ఎస్పీ స్థాయి,ఒక అడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీ స్థాయి అధికారులు జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించడంలో భాగస్వామ్యమై ప్రజలకు మరింత రక్షణగా ఉంటూ ఎన్నో రకాల సేవలు అందిస్తున్నామని తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం, జిల్లా ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా కేంద్రంలో సుమారు రూ.38కోట్ల 50లక్షలతో పోలీస్ కార్యాలయ సముదాయ భవనాన్ని నిర్మించినట్టు తెలిపారు. త్వరలోనే ఈ కార్యాలయాన్ని ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జిల్లా ఏర్పడిన తర్వాత కొత్తగా ఒక పోలీస్ సబ్ డివిజన్(వేములవాడ), రెండు సర్కిల్ (ఎల్లారెడ్డిపేట్, చందుర్తి) నాలుగు పోలీస్ స్టేషన్లు(తంగళ్లపల్లి, వీర్నపల్లి, రుద్రంగి, వేములవాడ రూరల్) ప్రజలకు అందుబాటులోకి రాగా కొత్తగా మరో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయని ఎస్పీ తెలిపారు.

మహిళల భద్రతకు షీ టీమ్స్..

జిల్లాలోని రెండు పోలీస్ డివిజన్లలో ఎస్సై స్థాయి అధికారి నేతృత్వంలో రెండు షీ టీమ్స్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణతో మహిళలపై వేధింపులను పూర్తిగా అరికట్టగలిగామని తెలిపారు. షీ టీమ్ మహిళలు పనిచేసే ప్రదేశాలలో, విద్యాలయాలలో, బస్ స్టేషన్ లలో, లైంగిక దాడులు అరికట్టడంలో సఫలీకృతం అయిందని, జిల్లాలో ప్రతిరోజూ ఒక గ్రామంలో, విద్యాలయాలలో ప్రజలకు, విద్యార్థులకు షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో మహిళల భద్రత, ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడానికి "అభయ" మై టాక్సీ సేఫ్ అనే యాప్ అందుబాటులోకి తీసుకువచ్చి జిల్లాలోని 3వేల ప్యాసింజర్ వాహనాలకు ఈ యాప్‌ను అనుసంధానం చేసినట్టు తెలిపారు.


ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ పోలీసు సిబ్బంది, అధికారులు

బ్లూ కోల్ట్స్, పెట్రో కార్, డయల్100

గతంలో పట్టణానికి మాత్రమే పరిమితమైన బ్లూ కోల్ట్స్, పెట్రో కారు సేవలను జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరింపజేస్తూ జిల్లాలో ప్రస్తుతం 13పెట్రో కార్లు, 15బ్లూ కోల్ట్ బృందాలు ప్రజారక్షణకై అహర్నిశలు పనిచేస్తున్నాయని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ వాహనాలు రోజుకు సుమారు 50 కిలోమీటర్ల దూరం ప్రజాసేవకై ప్రయాణిస్తున్నాయని తెలిపారు. డయల్ 100 ద్వారా జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా నేర సమాచారం అందించిన 5 నిమిషాల్లో పోలీస్ బృందాలు బ్లూ కోల్ట్స్, పెట్రో కారు ద్వారా చేరుకొని క్షేత్ర స్థాయిలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రజలకు రక్షణ కల్పిస్తున్నాయని తెలిపారు.

నేరాల నియంత్రణలో కీలకంగా సీసీ కెమెరాలు..

జిల్లాలో నేరాలు అరికట్టడములో సీసీ కెమెరాల పాత్ర ముఖ్యమని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 1 వేయి 130 సీసీ కెమెరాలను రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎంచుకొని టీ-ఫైబర్ ద్వారా జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసిందన్నారు. దీని ద్వారా గ్రామాలు, పట్టణాల్లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి శాంతి భద్రతలు పరిరక్షించడానికి వీలు కలుగుతుందని తెలిపారు.

పాస్ పోర్ట్ ఎంక్వయిరీ సులభతరం..

మన జిల్లాలో ప్రతి నెల సుమారు 800పాస్ పోర్ట్స్ గురించి ధరఖాస్తులు రాగా అన్ని విచారణలు పూర్తిచేసి వారం రోజుల్లోనే పాస్ పోర్ట్ అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా జిల్లాలో పాస్ పోర్ట్ కు సంబంధించి అన్ని రకాల వెరిఫికేషన్లు మూడు(3) రోజుల్లోనే పూర్తి చేస్తున్నామన్నారు.

నేరాల నియంత్రణకు ప్రథమ ప్రాధాన్యత...

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లాలో ఒక సీసీఎస్ పోలీస్ స్టేషన్, ఒక సైబర్ సెల్, ఒక యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అందుబాటులోకి వచ్చాయని, వీటి ద్వారా అనేక సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, దొంగతనాలు అసాంఘిక శక్తుల చట్టవ్యతిరేక కార్యకలాపాలను సమర్థవంతంగా అరికడుతున్నాయని ఎస్పీ వివరించారు. కోర్టులో జరుగుతున్న కేసులను విచారణ పర్యవేక్షణ నిమిత్తం కోర్ట్ మానిటరింగ్ సిస్టంలో భాగంగా ఎస్సై స్థాయి అధికారిని నియమించి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా ఆవిర్భావం నుండి 85కేసులలో నేరస్తులకు శిక్షలు విధించగా అందులో ముఖ్యంగా 4కేసులలో ముద్దాయిలకు జీవిత ఖైదు, 1కేసులో 10సంవత్సరాల శిక్ష, 2 కేసులలో 5 సంవత్సరాల జైల్ శిక్ష విధించబడిందని, అంతే కాకుండా రెండు కేసులల్లో ముగ్గురికి పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు..

జిల్లాలో ముఖ్యంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి దేశ నలుమూలల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారని, అలాగే ఇతర రవాణా మార్గాల్లో ప్రమాదకరంగా ఉన్న చోట రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసు వారు వివిధ శాఖల సమన్వయముతో రోడ్డు ప్రమాదాలు నియంత్రించడానికి పలు రకాల చర్యలు చేపడుతున్నామని వివరించారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి తీసుకువచ్చి ట్రాఫిక్ విభాగంతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

సాంకేతికత అభివృద్ధితో పారదర్శకమైన సేవలు..

రాష్ట్ర అవతరణ తరువాత సాంకేతికత అభివృద్ధితో ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తున్నామని ఎస్పీ అన్నారు. ప్రతిష్టాత్మకంగా సిసిటిఎన్ఎస్, టీఎస్ కాప్ ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ హెచ్ఆర్ఎంఎస్ మీసేవ సర్వీస్, సీ డాట్, షీ టీమ్స్ ఫంక్షనల్ వర్టికల్స్‌తోపాటు మొత్తం(28) అప్లికేషన్లను పోలీస్ విభాగాల్లో ప్రవేశపెట్టి ప్రజలకు అత్యున్నతమైన సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజలతో మమేకం..

ప్రజా సమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా, ప్రజలకు పోలీస్‌శాఖ ద్వారా పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా "ఠాణా దివస్", మొబైల్ ఠాణా, మెసేజ్ యువర్ ఎస్పీ అనే వినూత్న కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరువకావడంతో పాటుగా వారి సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత ఉద్యోగ శిక్షణ శిబిరాలు, జాబ్ మేళాలు, స్పోర్ట్స్ మీట్,స్పోర్ట్స్ కిట్స్ అందజేసినట్టు వివరించారు.

అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు..

పోలీస్ ఉద్యోగం అంటేనే 24/7 ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం అని, జిల్లాలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది, హోం గార్డ్స్ యొక్క ఆరోగ్య సంక్షేమం దృష్ట్యా వారికి యోగా క్లాస్‌లు, పరేడ్, హెల్త్ క్యాంప్‌లు, స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహిస్తూ వారిలో నూతనోత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపుతున్నామన్నారు. జిలాల్లోని 200హోం గార్డులకు రాయితీతో కూడిన హెల్త్ కార్డ్స్ అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,17వ బెటాలియన్ కమాండెంట్ కె.సుబ్రమణ్యం,డిఎస్పీ లు నాగేంద్రచరి, రవికుమార్, సి.ఐ లు,ఎస్.ఐ లు 17 వ బెటాలియన్ అధికారులు, పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు..

దేశానికి దిక్సూచిగా తెలంగాణ పోలీసు సేవలు

జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సీఎం కెసిఆర్ ప్రత్యేక చొరవతో దేశానికి దిక్సూచిగా తెలంగాణ పోలీసు సేవలు ఉన్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో పద్మ నాయక ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ సురక్ష దినోత్సవాన్ని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పటిష్టం చేసిందన్నారు. ఫ్రెడ్లీ పోలీసింగ్, షీటీమ్స్, సఖీ సెంటర్లు, సీసీ కెమెరాల నిఘా, పెట్రోలింగ్, అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు వంటి సంస్కరణలు పోలీసులకు ప్రజలకు మద్దతును పెంచాయన్నారు. నేరాలను నియంత్రించడలోనూ కీలక భూమిక పోషించియని తెలిపారు. సురక్షితమైన రాష్ట్రంగా నేడు తెలంగాణ అవతరింగా పెట్టుబడులు పెరిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని వివరించారు.



ప్రజల క్షేమం కోసమే పోలీస్‌శాఖ పనిచేస్తోంది

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



నవతెలంగాణ - వేములవాడ :

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ క్రమంలో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన "నో యువర్ పోలీస్ స్టేషన్ (మీ పోలీస్ స్టేషన్ గురించి తెలుసుకోండి) కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం చాలా అభివృద్ధి చెందిందని, ఈ అభివృద్ధిలో పోలీస్ శాఖ కృషి చాలా ఉందన్నారు.

ఉత్తమ మున్సిపాలిటీగా సిరిసిల్ల

నేడు అవార్డు అందుకోనున్న చైర్పర్సన్, కమిషనర్

నవతెలంగాణ - సిరిసిల్ల : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 50వేల జనాభా నుండి లక్ష జనాభా గల మున్సిపాలిటీలకు పోటీలు నిర్వహించింది. పోటీలలో సిరిసిల్ల మున్సిపాలిటీని ఉత్తమ అవార్డుకు ఎంపిక చెసినట్లు తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించింది. ఈ అవార్డును సోమవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ, కమిషనర్ సమ్మయ్యలు తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ హైదరాబాద్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో అందుకోనున్నారు..


అవార్డు వరావడానికి కారణాలు..

సిరిసిల్ల పురపాలక సంఘం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ మరియు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా నిర్వహిస్తున్నటువంటి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించుటకుగాను బర్ధన్ బ్యాంక్‌లు ఏర్పాటు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పొడి చెత్త నిర్వహణ (డీఆర్‌సీసీ) విజయవంతంగా అమలు పరుస్తున్నందున, తడి చెత్త నిర్వహణలో భాగంగా విండ్రో, వర్మి కంపోస్ట్ ద్వారా ఎరువును తయారు చేసి విజయవంతంగా తడి చెత్త నిర్వహణ చేస్తున్నందుకుగానూ, సిరిసిల్ల పట్టణ పరిధిలో 24(ఆర్ఆర్ఆర్) సెంటర్‌లలో ప్రజలకు అందుబాటులో ని కమ్యూనిటీ హాల్స్ వున్న వార్డులు మాత్రమే కాకుండా కమ్యూనిటీ హాల్స్ లేని వార్డుల్లో మొబైల్ అర్ఆర్ఆర్ కలెక్షన్ సెంటర్స్ ఏర్పాటు చేసి వాటిని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు గానూ, మేరీ లైఫ్ మేర స్వచ్ఛ షేహర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించుట, పట్టణ పరిధిలోని అంబెడ్కర్ జంక్షన్ నుండి బతుకమ్మ ఘాట్ వరకు పట్టణంలోని ప్రముఖులు, ఎన్జీవోలు మరియు ప్రజలతో ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. వీటికి గాను సిరిసిల్ల పురపాలక సంఘాన్ని గుర్తించి ఈ అవార్డ్‌కు ఎంపిక చేసినట్లు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకటించింది.


స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీతో పట్టణ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్, అధికారులు, కౌన్సిలర్లు

పవర్లూమ్ కార్మికుల యారన్ సబ్సిడీ విడుదల చేయాలి

- వర్కర్ టు ఓనర్ పథకం వెంటనే అమలు చేయాలి..
- జూన్ 7న పవర్లూమ్ బంద్, 24 గంటల నిరసన దీక్ష
- పవర్ లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్



నవతెలంగాణ - సిరిసిల్ల :పవర్లూమ్ కార్మికులకు 10శాతం యారన్ సబ్సిడీ, వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే కార్మికులకు అందించాలని డిమాండ్ చెస్తూ, చేనేత జౌళిశాఖ కార్యాలయం వద్ద జరిగే 24గంటల దీక్షా కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం సిరిసిల్లలోని స్థానిక సీఐటీయూ కార్యాలయలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, గుండు రమేష్, బెజగం సురేష్, కనుకుంట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ మాట్లాడుతూ పవర్లూమ్ కార్మికులకు రావలసిన 2020బతుకమ్మ చీరల 10శాతం యారన్ సబ్సిడీ అందించడంలో ప్రభుత్వ అధికారులు దాటవేసే ధోరణి కొనసాగిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నన్నారు. కార్మికుడిని యజమానిగా మారుస్తానని ప్రతి మీటింగ్‌లో మంత్రి కేటీఆర్ ఉపన్యాసంలో చెప్పడం మాటలకే పరిమితమైందని, ఇప్పటికీ వర్కర్ టు ఓనర్ పథకాన్ని ఏళ్ల గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్మికులను యజమానులుగా మారుస్తామని రెండుసార్లు అధికారంలో వచ్చినప్పటికీ పూర్తి చేయకపోవడం చూస్తుంటే పవర్లూమ్ కార్మికుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎంత ఉందో అర్థమవుతుందన్నారు. పవర్లూమ్ కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా జూన్ 7న 24 గంటలు పవర్లూమ్ బంద్, నిరసన దీక్ష చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

283 మందికి వెంటనే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

- సి-5 క్యాంపును అడ్డుకున్న లద్నాపూర్ సింగరేణి భూ నిర్వాసితులు



నవతెలంగాణ-రామగిరి:

సింగరేణి ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-2 ప్రాజెక్టులో నడిచే ప్రైవేటు ఓబీ కాంట్రాక్టు సి-5 క్యాంప్ పనులను లద్నాపూర్ సింగరేణి భూ నిర్వాసితులు ఆదివారం అడ్డుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటివరకు 283 మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అధికారుల చర్యలకు నిరసనగా సింగరేణి పనులను అడ్డుకున్నామని తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీని వెంటనే సింగరేణి యాజమాన్యం అందించాలని డిమాండ్ చేశారు. పనులు అడ్డుకున్న భూ నిర్వాసిత గ్రామాల ప్రజల వద్దకు ప్రాజెక్టు మేనేజర్ వచ్చి రెండు రోజుల్లో సింగరేణి అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడతామని సర్ది చెప్పడంతో నిరసన విరమించారు.

దేశ సౌభాగ్యానికి రైతే వెన్నెముక

- టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్
- కొండగట్టు పుణ్యక్షేత్రంలో మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్ర నిర్మాణం హర్షణీయం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

దేశ సౌభాగ్యానికి రైతులే కీలకమని టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. టీబీసీ జేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాగలి పండుగ సంబరాలు బ్రాహ్మణవాడలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సమావేశంలో హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వ్యవసాయ పనులను ఏరువాక పున్నమితో ప్రారంభించడం శ్రేష్టమన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, నిరంతర ఉచిత విద్యుత్ పథకాలు ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. కొండగట్టు పుణ్యక్షేత్రంలో రైతుబిడ్డలైన మున్నూరు కాపులు వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరే దశరథం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణం నిర్ణయం హర్షణీయమన్నారు. . ఈ కార్యక్రమంలో టీబీసీ జేఏసీ యువజన అధ్యక్షుడు కూసరి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి పంబాల రామ్ కుమార్,మహిళా జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి,టీ బీసీ జేఏసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష రుణమాఫీ హామీ ఉత్తదేనా?

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం

నవతెలంగాణ-కరీంనగర్

గత ఎన్నికల్లో కేసీఆర్ రైతులకు ఇచ్చిన లక్ష రూపాయల రుణమాఫీ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం విమర్శించారు. రుణమాఫీని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. 9 ఏళ్ల నుంచి ఆత్మహత్య చేసుకున్న రైతు మరణాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, రైతుల ఆత్మహత్యలకు సర్కారే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8000 మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలను ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఎందుకు ఇవ్వడం లేదని, యాసంగి వరి ధాన్యం కొనడంలో మిల్లర్లు రైతులను మోసం చేస్తే వాళ్ల మీద ఎందుకు పీడీ కేసులు పెట్టడం లేదని విమర్శించారు. తరుగు పేరిట మిల్లర్ల దోపిడీని అరికట్టలేకపోవడానికి మిల్లర్లతో ప్రభుత్వం మిలాఖత్ కావడమే కారణమని తెలిపారు. రెవిన్యూ రికార్డుల డిజిటలిజషన్ పేరుతో పహానిలో అనుభవదారు కాలం తీసి వేసి ఎవరికి లాభం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ వల్ల ఎవరు లబ్ధి పొందారో ధరణిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కల్వకుంట్ల కుటుంబం పేర్కొన్న భూమి ఎంత? ఇప్పుడున్న వారి భూమి వివరాలు విడుదల చేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు భూగర్భ జలాలు ఇంకిపోయేలా అక్రమ ఇసుక దందా జోరుగా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు.

నేడు ప్రజావాణి రద్దు

- కలెక్టర్ యాస్మిన్ భాష

నవతెలంగాణ-జగిత్యాల

నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజవాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జగిత్యాల జిల్లా కలెక్టర్‌షేక్ యాస్మిన్ భాష ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో జిల్లా అధికారులు, ఉద్యోగులు నిమగ్నమై ఉన్నందున సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆమె కోరారు.

సీనియర్ పాస్టర్ మాణిక్యం ఆకస్మిక మృతి

- ప్రత్యేక ప్రాథనలతో అత్యక్రియలు

నవతెలంగాణ-మంథని:

మంథని పట్టణంలోని సీయోను ప్రార్ధన మందిరం సీనియర్ పాస్టర్ పల్లె మాణిక్యం శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో మంథని నియోజకవర్గంలోని క్రైస్తవులు విషాదంలో మునిగారు. ఆదివారం క్రైస్తవ సంఘ పెద్దలు, సోదరులు ప్రత్యేక ప్రార్ధనలతో సీనియర్ పాస్టర్ మాణిక్యంకు అంతక్రియలు నిర్వహించారు. మంథని నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 20 ఏండ్లుగా కొనసాగుతున్న పాస్టర్ పల్లె మాణిక్యం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం రాత్రి మంథని పట్టణం పవర్ హౌస్ కాలనీలోని తన స్వగృహంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. పాస్టర్ మాణిక్య మృతి క్రైస్తవ లోకానికి బాధాకరమని పాస్టర్ వల్లూరి ప్రభాకర్, సంఘ పెద్దలు అంకరి కుమార్ మాణిక్యం చేసిన దైవ సేవలు గుర్తు చేసుకుంటూ విచారం వ్యక్తం చేశారు. మాణిక్యం కుటుంబాన్ని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మాణిక్యం పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొత్త శ్రీనివాస్, ఆరేపల్లి కుమార్, గుండా పాపారావు, కొట్టే రమేష్, అంకరి కుమార్, సంఘ సభ్యులు ఎంకే జోసఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, దాసరి సదానందం, చింతకుంట్ల ప్రేమ్ కుమార్‌తో పాటు పాస్టర్లు, సంఘ పెద్దలు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కోరుట్ల



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సీడీపీ నిధుల నుంచి పలు కుల అంబేద్కర్ సంఘానికి రూ. 4లక్షలు, ముస్లింలకు రూ.2 లక్షలు, మహిళ సంఘాల భవనాలకు రూ.2 లక్షల చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని కుల సంఘాలకు అండగా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆయా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, ఎంపీటీసీ ప్రియాంక, కుద్దుసు, సాదుల్ల, ఉస్మాన్, హకిం, అజిత్, లక్పటి,సుదీర్ కళ్యాణ్, నర్సయ్య, శంకర్, ప్రశాంత్, నరేష్, రాజేందర్, యశోద సన్మానించారు.

ప్రజలకు అడుగడుగునా భద్రత

మంథని సీఐ జి.సతీష్

నవతెలంగాణ-మంథని:



మాట్లాడుతున్న మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.సతీష్

శాంతి భద్రతలు పటిష్టం చేస్తూ మన తెలంగాణ స్వరాష్ట్రంలో పోలీసులు ప్రజలకు అడుగడుగునా భద్రత కల్పిస్తున్నారని మంథని సీఐ జి.సతీష్ అన్నారు. ఆదివారం మంథని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సురక్ష దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలు ఎక్కడైతే పటిష్టంగా ఉంటాయో, ఆ ప్రాంతాలు బాగుపడుతూ ప్రశాంతంగా కనిపిస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పోలీస్ వ్యవస్థలో అనేక సంస్కరణలు వచ్చాయన్నారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే ప్ర ప్రథమంగా ఉందన్నారు. సైబర్ క్రైమ్ పట్ల యువతీ, యువకులు, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని కోరారు. అనంతరం మంథని పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్, ఇతర స్టాళ్లను మంథని ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలతతో పాటు ప్రజలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు సందర్శించారు. ఈ సమావేశంలో కమాన్‌పూర్ ఎస్ఐ షేక్ మస్తాన్, ముత్తారం ఎస్ఐ రాములు, మంథని ఎస్ఐ వెంకటేశ్వర్, రామగిరి ఎస్ఐ దివ్యతో పాటు పోలీస్ సిబ్బంది, వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

ప్రయివేటు స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి

- గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్

నవతెలంగాణ-కరీంనగర్



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలలపై, విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకో వాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో జరిగిన గిరిజన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లా డుతూ..ప్రయివేటు, కార్పొరేట్ శక్తులు అధిక ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వ అధికార యంత్రాంగం పట్టించుకోకుండా కార్పొరేట్, ప్రయివేటు వ్యక్తులకు కొమ్ము కాస్తూ విద్యను నీరుగారుస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొందని, తక్షణం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకరావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వాధికారులు స్పందించి ఫీజులు కోసం నియంత్రించేలా చర్యలు తీసుకో వాలని కోరారు. లేకపోతే జిల్లాలో విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోడా మోహన్‌నాయక్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌నాయక్, రవీందర్ నాయక్, జిల్లా నాయకులు లక్‌పతి నాయక్, శ్రీనివాస్ నాయక్, తిరుపతి, రమేష్, సురేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం

నవతెలంగాణ-కరీంనగర్



పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న శ్రీనివాస్

కరీంనగర్‌లోని మాస్క్ యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 1వరకు నిర్వహించిన సమ్మర్ యాక్టింగ్ క్యాంపు-2023లో 30 రోజుల పాటు శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రెస్ భవనంలో సర్టిఫికెట్ ప్రదాన ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిటీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ చిట్టుమల్ల శ్రీనివాస్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్క్ ఇన్‌స్టి ట్యూట్ చైర్మెన్ అనసూయ భూనాతచారి, తెలుగు షార్ట్ ఫిలిం మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, జిల్లా అధ్యక్షులు చొప్పరి సుధాకర్, ద్రోణాచారి, ఎడ్ల మల్లేశం, కాయ్తోజు పవన్, షేకల్ల హరిహర, వంగల శ్రీధర్, తిప్పర్తి ప్రభు, గద్దె ఉదయ్ కుమార్, కళాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సురక్షా దినోత్సవం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



పాల్గొన్న మంత్రి కొప్పుల, ఎమ్మెల్యేలు, అధికారులు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సురక్షా దినోత్సవాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని కలెక్టర్ యాస్మిన్‌భాష, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ... తెలంగాణ ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ దేశానికే మార్గ నిర్దేశకంగా నిలిచిందన్నారు. పోలీస్‌శాఖకు ఊహించని విధంగా బడ్జెట్ కేటాయించి పటిష్టం చేశారని తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్స్ సెంటర్(సీసీసీ)తో నిఘా వ్యవస్థ మెరుగై ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, జిల్లా ఎస్పీ భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, మంద మకరంద్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటీ వెంకట్ రావు,మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్,జెడ్పీటీసీలు,కౌన్సిలర్లు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గూడెం గ్రామాన్ని సందర్శించిన పరికిపండ్ల నరహరి

నవతెలంగాణ-ఓదెల:



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఓదెల మండలం గూడెం గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని ఆదివారం పరికిపండ్ల నరహరి ఐఏఎస్ (మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ) దర్శించుకున్నారు. ఉదయం గ్రామానికి చేరుకున్న ఆయన గ్రామంలో ఇటీవల ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పొత్కపల్లి ఎస్ఐ రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించిన చలి వేంద్రాన్ని చూసి, గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అభయాంజనేయ ఆలయంలో ఆలయ పూజారి దొబ్బెట సత్యనారాయణ చార్యులు వేద మంత్రాల మధ్య పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గూడెం గ్రామానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలంటీర్లు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. కంటి చికిత్సలు అవసరమైన వారు బసంత్‌నగర్‌లో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన శంకర్ విజన్ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా కంటి పరీక్షలతో పాటు ఆపరేషన్లు చేయి స్తామని తెలిపారు. ఆలయ ఫౌండే షన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, జుంజిపల్లి ఉమేశ్వర్, ఓదెల జడ్పీటీసీ గంట రాములు యాదవ్, తహసీ ల్దార్ రమేష్, ఓదెల మండల ఆలయ ఫౌండేషన్ ఇం చార్జి ఉప్పుల శ్రీనివాస్, పలువురు వాలంటీర్లు పొత్క పల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు శ్రీరాముల కొము రయ్య, బాయమ్మపల్లి ఉప సర్పంచ్ సాంబమూర్తి, గుంపుల మాజీ సర్పంచ్ ఉప్పుల సంపత్ పాల్గొన్నారు.

కంటి దవాఖాన, శాంతి నివాసంకు ఐఓఎస్ సర్టిఫికెట్

నవతెలంగాణ-కరీంనగర్



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న శివయ్య

కరీంనగర్ లయన్స్ క్లబ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కరీంనగర్ లయన్స్ క్లబ్ డాక్టర్ భాస్కర్ మాదేకర్ కంటి దవాఖానకు శివయ్య ఐఎస్ఓ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆస్పత్రిలో సంవత్సర కాలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. నూతనంగా కొన్న పరికరాల వల్ల ప్రజలకు రోగ నిర్ధారణ, ట్రీట్‌మెంట్‌కు ఎంతగానో ఉపయోగ పడుతాయని అభినందించారు. అలాగే కరీంనగర్ లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న శాంతి నివాసం (హిందూ దహన సంస్కార వాటిక) ప్రాజెక్టులో ఉన్న పలు సౌకర్యాలు వైకుంఠ రథం, దహనం కోసం నిర్మించిన ప్లాట్ఫార్మ్, స్త్రీలకు, పురుషులకు స్నాన గదులు, ప్రజలకు కలిగిస్తున్న పలు సౌకర్యాలను చూసి అభినందించారు. ఈ రెండు ప్రాజెక్టులు పాటిస్తున్న పలు ప్రమాణాలను చూసి ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్లను చైర్మెన్ కొండ వేణు మూర్తి కంటి దవాఖానాకు, శాంతినివాసం చైర్మెన్ బొడ్ల కృష్ణకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొండ వేణుమూర్తి, చిదుర సురేష్, సింగం రాజు, బొడ్ల కృష్ణ, కోల అన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ హౌజ్‌ను సందర్శించిన జిల్లా పరిషత్ చైర్మన్

నవతెలంగాణ-పెద్దపల్లి:



ఆయుధాలు పరిశీలిస్తున్న జడ్పీ చైర్మెన్ పుట్టమధు

పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సందర్శించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సురక్షా దినోత్సవం సందర్భంగా పోలీస శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గ కేంద్రాల్లోని పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌజ్‌లను ఏర్పాటు చేసి పోలీస్‌శాఖ చేసే వివిధ కార్యక్రమాలను, అందించే వివిధ సేవలను ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్‌ను జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సందర్శించి, పని తీరు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన ఆయుధాలు, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, ఫింగర్ ప్రింట్, సైబర్ క్రైమ్, షీ టీం, కమ్యూనికేషన్, ట్రాఫిక్ పోలీస్, బ్లూ కాల్ట్ మొదలగు స్టాళ్లలో ఏర్పాటు చేసిన సామగ్రి, ఆయుధాల పనితీరు, అందించే సేవలను డీసీపీ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ వైభవ్ గైక్వాడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి, ఎస్ఐ మహేందర్ యాదవ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు

శిలాఫకంపై జడ్పీ చైర్‌పర్సన్ పేరు తొలగింపు

నవతెలంగాణ- జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం శంకుస్థాపన చేసిన క్రిటికల్ కేర్ హాస్పిటల్ భవనం,కేంద్ర ఔషధ గిడ్డంగి భవన నిర్మాణ శంకుస్థాపనపై జగిత్యాల జడ్పీ చైర్పన్ దావ వసంత పేరు తొలగించారు. ఈ విషయం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ దృష్టికి రాగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అధికారులను మందలించారు. శిలా పలకాన్ని తీసివేయాలని తిరిగి ప్రోటోకాల్ ప్రకారంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పేరును చేర్చి నూతన శిలాఫలకాన్ని అమర్చాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. అనంతరము శిలా పలఖాన్ని అధికారులు తొలగించారు.



ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండల కన్నాపూర్ గ్రామానికి చెందిన ఎన్నం వినయ్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా వారిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగిత్యాల రూరల్ మండల లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన యువకుడు కృపానంద్ తెల్లవారుజామున 3 గంటలకు కొత్త బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జగిత్యాల జిల్లా ఆసుపత్రిలో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు బాలే శంకర్, సత్తిరెడ్డి, లక్ష్మణ్, చంద్రారెడ్డి,తదితరులు ఉన్నారు.

మంథని జేఎన్టీయూలో జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతం



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-రామగిరి:

దేశంలోని ఐఐటీలో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్ష మంథని జేఎన్టీయూహెచ్ యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. 100 మంది విద్యార్థులకు గాను 95 మంది హాజరు కాగా, ఐదుగురు గైర్హాజరైనట్టు వైస్ ప్రిన్సిపల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకున్నారని, ఏ ఒక్కర్ని వెనక్కి పంపించలేదని తెలిపారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరును పర్యవేక్షించేందుకు ఇద్దరు ఐఐటీకి చెందిన ప్రొఫెసర్లు పరిశీలకులుగా, పరీక్షా కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరు, సౌకర్యాల పరిశీలనకు హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ వచ్చారు. రామగిరి పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి




చిత్రపటానికి పూలు వేస్తున్న భరత్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో ఆదివారం గానకోకిల స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను పడిపోయా నీమాయలో సినిమా నిర్మాత భరత్‌కుమార్ అంకతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి జయంతి వేడుకలు నిర్వహించారు. జయంతి వేడుకలు నిర్వహిం చిన వారిలో నటులు రాధరపు ప్రభాకర్, అరె రమేష్ చంద్రరెడ్డి, యామపుర్ సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షులు గుమ్మల రమేష్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు అరె నరేందర్, రాధరపు నిథిన్, అన్నరపు శ్రీకాంత్, సున్నం రాకీ తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ విజయోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న లైన్మెన్

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవాల వేడుకలకు హాజరు కావాలని మండల విద్యుత్ అధికారులు ఆయా గ్రామంలోని ప్రజా ప్రతి నిధులు, నాయకులు, రైతులకు ఆహ్వానం పత్రికలు అదివారం అందించారు.ఈ సందర్భంగా లైన్‌మైన్ కోలిపాక రాజ్ మాట్లాడుతూ.. మెట్‌పల్లి పట్టణంలోని కేఎన్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహిస్తున్న విద్యుత్ విజయోత్సవసభకు హాజరై రాష్ట్రంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన పురోగతిపై ఉన్నతాధికారుల సందేశాలను విని ఆతిధ్యాన్ని స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేసిన ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు



మిషిన్లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామానికి చెందిన ఆరెపెల్లి రాజకళ భర్త అనిల్ రెండు నెలల క్రితం మృతి చెందాడు. రాజకళ ముగ్గురు పిల్లలతో ఇబ్బందులు పడుతుంది. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న నందిపేట్ ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు రాజకళకు టైలర్ మెషిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు వినయ్, రమేష్, మురళి,అజేయ్ పాల్గొన్నారు

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం

నవతెలంగాణ-రామగిరి:

పెద్దపల్లి జిల్లా మంథని పోలీసుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సురక్షా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పీవీ రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సందవేన కుమార్, మండల శంకర్, వార్డు సభ్యులు తన్నీరు ప్రదీప్, కోండు వేణు తదితరులు పాల్గొన్నారు.



పోరండ్లలో ఎమ్మెల్యే రసమయి విస్తృత పర్యటన


రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని పోరండ్ల గ్రామంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. గ్రామానికి మంజూరైన రెండో రేషన్ షాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల ఇండ్లకు స్వయంగా వెళ్లి కళ్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయిని, ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు తిమ్మాపూర్, పోరండ్ల గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, మండల అధ్యక్షుడు రావుల రమేష్, సర్పంచ్ రెడ్డి త్రివేణితిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ కిన్నెర సతీష్, అసోద శ్రీనివాస్, తహసీల్దార్ కనుకయ్య ఆర్ఐ అక్బర్, విఆర్ఏ కొంరయ్య పాల్గొన్నారు.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- అన్ని సౌకర్యాలతో భవనాలు
- ఉచిత పాఠ్యపుస్తకాలు.. మధ్యాహ్న భోజన సదుపాయం
- సుశిక్షితులైన అనుభవం గల ఉపాధ్యాయులతో బోధన
- ఈ విద్యా సంవత్సరం నుండి డిజిటల్ విద్య
- ముమ్మరంగా 'బడిబాట'



నవతెలంగాణ - జమ్మికుంట

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు ఈ నెల మూడు నుండి 12 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఏటా జూన్ మాసంలో బడిబాట కార్యక్రమం చేపట్టి విద్యార్థుల సంఖ్యను పెంచడమే ధ్యేయంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలను వివరిస్తున్నారు.

గుణాత్మక విద్య:

గుణాత్మక విద్యను అందించడమే ధ్యేయంగా డ్రాపౌట్స్ లేకుండా, బడి మధ్యలో మానేసిన విద్యార్థులను, బడి బయట ఉన్నటువంటి విద్యార్థులను గుర్తించి, వారి ఏజ్‌కి అనుగుణంగా ఆయా తరగతులలో చేర్పించి, ఎలాంటి సర్టిఫికెట్ లేకుండా పాఠశాలలో చేర్పించుకోవాలి. అంగన్వాడి పాఠశాలల్లో ఐదు సంవత్సరాలు నుండి విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించే విధంగా, ప్రాథమిక పాఠశాలలో చదివిన ఐదవ తరగతి విద్యార్థుల స్టైంత్ పర్టికులర్సును తీసుకొని ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించే విధంగా, ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడవ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల వివరాలను తీసుకొని దగ్గరలో ఉన్న హైస్కూల్లో చేర్పించే విధంగా చూడడమే బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. అంతేకాకుండా ప్రియివేటు పాఠశాలలో చదివే విద్యార్థులను తల్లిదండ్రులను మోటివేషన్ చేసి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి.

ట్రిబుల్ ఐటీ

బాసరలో ఉన్న ట్రిబుల్ ఐటీలో పదోతరగతిలో మెరిట్ విద్యార్థులకు అడ్మిషన్ దొరుకుతుంది. అయితే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని విషయము తక్కువ మంది తల్లిదండ్రులకు తెలుసు కాబట్టి ఈ విషయాన్ని కూడా బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉదయం పూట అల్పాహారం, ఉచిత మధ్యాహ్న భోజనము, రెండు జతలు డ్రెస్సులు రాష్ట్ర ప్రభుత్వము అందిస్తుంది.

డిజిటల్ విద్య

2023- 24 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వము సంకల్పించింది. దీంతో విషయపరంగా ఎక్కువ విషయాలు తెలువడంతోపాటు ఈజీగా విద్యార్థులకు అర్థమవుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆట స్థలము

ప్రభుత్వ పాఠశాలల్లో ఆట స్థలము ఉంటుందని తప్పకుండా ఆటల పీరియడ్ ఉంటుందని, ఆటలు ఆడిపించడానికి ప్రత్యేకమైన పిఈటి ఉంటారని, చదువుతోపాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి.

సుశిక్షితులైన ఉపాధ్యాయులు

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన, అనుభవం గల ఉపాధ్యాయులచే విద్య బోధన ఉంటుంది. ప్రయివేటు కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉంటుందని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.

ఎక్కువమంది విద్యార్థులను చేర్పించిన మూడు పాఠశాలల్ని గుర్తించి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రివార్డులను ఇస్తారు.

స్కాలర్‌షిప్‌లు

ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించి అందులో ప్రతిభగల విద్యార్థులకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయల చొప్పున ప్రభుత్వము అందిస్తుంది.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ విద్య


విడుపు శ్రీనివాస్, మండల విద్యాధికారి



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేస్తున్నాం. ప్రయివేటు కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన నాణ్యమైన విద్య అందుతుంది. ఉచిత మధ్యాహ్నం భోజనంతో పాటు రెండు జతల డ్రస్సులు, పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తుంది.

ప్రయోజనాలు వివరించాలి

ఎండి.ఇమ్రాన్, ఎస్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి



జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సంఖ్యలు ఇంకా పెంచాలి. ప్రభుత్వ పాఠశాలలో చదివితే కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించాలి.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

సుజాత, జెడ్పీహెచ్ఎస్ బాలుర విద్యా కమిటీ చైర్‌పర్సన్

ప్రయివేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్య అందుతుంది. వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రయివేటు పాఠశాలలో పంపే కంటే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి. బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

పోలీసుల సేవలకు సెల్యూట్

-సమాజ శాంతిస్థాపనకు పోలీసులు కృషి

-మంత్రి గంగుల కమలాకర్




నవతెలంగాణ-కరీంనగర్ క్రైం

సమాజంలో శాంతిస్థాపనకు ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పోలీసులు అందిస్తున్న సేవల వల్లనే సమాజం ప్రశాంతంగా వర్ధిల్లుతోందని.. వారి సేవలకు సెల్యూట్ అని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు ఆదివారం 'సురక్ష దినోత్సవం' పేరిట పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. సమర్థవంతమైన సేవలకు కమిషనరేట్ పరిధిలో 250మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మెన్ జీవి రామకృష్ణారావు, కలెక్టర్ ఆర్వీ కర్ణణ్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, కొత్తపల్లి మున్సిపల్ చైర్మెన్ రాజు, అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్ (శాంతిభద్రతలు), భీంరావ్ (సీఏఆర్), ట్రైనీ ఐపీఎస్ అధికారి మహేష్ బాబాసాహెబ్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, వెంకట రెడ్డి, విజయసారధి. సత్యనారాయణ, విజయ్ కుమార్, కాశయ్య, గంగాధర్, ప్రతాప్, ఎస్బీఐ వెంకటేశ్వర్లు, కరీంనగర్ డెయిరీ చైర్మెన్ చల్మెడ రాజేశ్వరరావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన పోలీసులు, ఆ విభాగాల పనితీరును తెలియజేస్తూ కరీంనగర్‌లో నిర్వహించిన భారీ వాహనాల ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ ర్యాలీని మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వివిధ వాహనాల్లో ఉన్న వివిధ విభాగాలకు చెందిన పోలీసులకు జాతీయజెండా చేతబూని స్కేటింగ్ చేస్తూ చిన్నారులు ఇందిరాచౌక్ వద్ద స్వాగతం పలికారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్



నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బావుపేట ప్రీమియర్ లీగ్ టోర్నీ ఆదివారం ముగిసింది. బావుపేటకు చెందిన శశాంక్ టీం విజేతగా, రన్నర్ కప్ గెల్చుకున్న గణేష్ యూత్ జట్టుకు స్థానిక ఎంపీపీ శ్రీలతమహేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌తో కలిసి ట్రోఫీ, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మెంబర్ సాబీర్ బాష, గ్రామ సర్పంచ్ కడారి శాంతశ్రీనివాస్, ఎంపీటీసీ దావ మణి, పెంచాలా ఆంజనేయులు, పెంచాలా తిరుపతి, బుస కరుణాకర్, కటకం కరుణాకర్, సుధాకర్, కనకయ్య, తిరుపతి పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం : కలెక్టర్ ఆర్వీ కర్ణన్



నవతెలంగాణ - కరీంనగర్ : మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు సైక్లింగ్ చేయాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. ఆదివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ సైకిల్ క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో సైకిల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పేద విద్యార్థులకు సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సైకిల్ తొక్కడం వల్ల పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా శరీరానికి మంచి వ్యాయామం చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సైకిల్ క్లబ్ సభ్యులు ఘన్ శ్యామ్ ఓజా, మేకల జయరాం తదితరులు పాల్గొన్నారు.

చలో కరీంనగర్ కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ - మానకొండూర్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్ట బద్ధత సాధనకై కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో ఈ నెల 5న నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా మహా సభను విజయవంతం కరపత్రాలను మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ తుంగ ఆంజనేయులు ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. రామగిరి ఆంజనేయులు, మొదుంపల్లి వైకుంఠం, కొండ్ర వెంకటస్వామి, శివ, ముకుందం, అశోక్, రాంచందర్, శంకర్, లక్ష్మయ్య, ఎల్లయ్య, రాజయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లికి బోనాలు

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామ ఎల్లమ్మతల్లి ఆలయంలో గౌడ కులస్తులందరూ ఆదివారం బోనాలు, పట్నాలు నిర్వహించారు. ఏడు గ్రామాల ప్రజలందరూ కలిసి ఈ పట్నాలు, బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పూదరి శ్రీనివాస్‌గౌడ్, గట్టు శ్రీనివాస్‌గౌడ్, పెరుమాళ్ళ సుదర్శన్‌గౌడ్, బండి చందుగౌడ్, మండ రాజయ్యగౌడ్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ మానకొండూర్ నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వోపా నియోజకవర్గం అధ్యక్షుడు చిలుముల వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని మహాత్మానగర్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల మార్కులతో కూడిన జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాగితాలను ఈ నెల 20లోపు మండలం మహాత్మానగర్‌లోని రావుల సత్యనారాయణ ఇంటి నంబర్ 8-81-10/3కు పంపించాలని కోరారు. వోపా గౌరవ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, ప్రధాన కార్యదర్శి కొండపర్తి మురళి, కోశాధికారి రావుల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు వంగళ ప్రభాకర్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించాలి

నవతెలంగాణ - గన్నేరువరం : గుండ్లపల్లి నుండి గునుకుల కొండాపూర్ వరకు రోడ్డు మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని టీడీపీ మండల అధ్యక్షుడు గుండ పరుశు రాంగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని గుండ్లపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉన్న రోడ్డును తీసివేసి రోడ్డును అలాగే ఉంచడం సరికాదన్నారు.

పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటా

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



నవతెలంగాణ - వీణవంక : సొంత గ్రామమైన వీణవంక రుణం తీర్చుకుంటానని, మండల కేంద్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నాలుగు లైన్ల రోడ్డుకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేసి ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. మండల కేంద్రంలో 25కోట్ల రూపాయలతో 75 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం, గ్రామంలో సుమారుగా మరో ఐదు కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. అంతకుముందు మండలంలోని రెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, కొండపాక, మామిడాలపల్లి గంగారంతో పాటు తదితర గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీపీ ముసుపట్ల రేణుకతిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతాశ్రీనివాస్, జెడ్పీటీసీ మాడ వనమాలసాధవరెడ్డి, సర్పంచులు నీల కుమారస్వామి, పోతుల నరసయ్య, పంజల అనూషసతీష్, నాయకులు అడిగొప్పుల సత్యనారాయణ, గంగాడి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'చెరువు శిఖం భూమి కబ్జా చేస్తే ఊరుకోం'



నవతెలంగాణ - మానకొండూర్ : మానకొండూర్ పెద్ద చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవి.రామకృష్ణారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సుడా క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కరీంనగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు మర్రి సతీష్ కుటుంబసభ్యులు మానకొండూర్ పెద్ద చెరువు శిఖం భూమి తమదేనని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు పత్రాలను సృష్టించి కోర్టును తప్పు దోవ పట్టించారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అనుచరులు ఇలాంటి అవినీతి భూ దందాలు చేయడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ పృథ్వీరాజ్, ఉపసర్పంచ్ నెల్లి మురళి, గ్రామ అధ్యక్షుడు పిట్టల మధు, నాయకులు ఉండింటి శ్యామ్ సన్, పిండి సందీప్, కొండ్ర వెంకటస్వామి, రామగిరి ఆంజనేయులు, యాదగిరి, అనిల్ పాల్గొన్నారు.


హోంగార్డులను పర్మినెంట్ చేయాలి

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బండారు సదానందం

నవతెలంగాణ - జమ్మికుంట : సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా హోంగార్డులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని జూన్ 4 సురక్ష దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా నిలబెట్టుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బండారు సదానందం డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత లేదని, ఆరోగ్య బీమా లాంటి సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. పోలీసులకు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, డీఏలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పి రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, నాయకులు మొగిలయ్య, దొడ్డి శ్రీనివాస్, రామ్‌చందర్, రామ్‌శ్రీనివాస్, గిన్నారపు మహేందర్, ములుగురి రమేష్, దాసరపు మహేందర్ పాల్గొన్నారు.

రైతుకు ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య



నవతెలంగాణ - జమ్మికుంట : సిగ్గు, శరం లేదా అని ఒక రైతును తిట్టినందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వెంటనే రైతుకు క్షమాపణ చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 3న రైతు దినోత్సవ సందర్భంగా ఆబాది జమ్మికుంటలో రైతు వేదిక వద్ద రైతులతో సమావేశం జరుగుతుండగా, బుర్ర కుమార్ గౌడ్ అనే రైతు రుణమాఫీ, అకాల వర్షం నష్టపరిహారం ఎందుకు ఇస్తలేరు అని అడిగినందుకు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి రైతును సిగ్గుందా, నీకు సిగ్గుశరం ఉందా అని బూతు మాటలు అనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మాటలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని అన్నారు. రైతుకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం పాషా, నాయకులు కసుబోసుల వెంకన్న, సతీష్‌రెడ్డి, రాజేశ్వరరావు, పొనగంటి రవీందర్, నాగేందర్, శ్రీనివాస్, మైస సురేష్, పుల్ల రవి, మడిపెల్లి అశోక్, ఆక్కినపెల్లి మహేందర్, చిలువేరు రాజమౌళి, అమ్మ సంపత్ ఉన్నారు.

ఎమ్మెల్యే కు ఆహ్వాన పత్రిక అందజేత


నవతెలంగాణ - గన్నేరువరం : మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9న మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ భవన ప్రారంభోత్సవ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకన్న, గొల్లపల్లి రవి, బూర శ్రీనివాస్, కాంతాల కొండాల్‌రెడ్డి, బూర రామకృష్ణ పాల్గొన్నారు.

శరవేగంగా నగర అభివృద్ధి : కరీంనగర్ మేయర్ సునీల్‌రావు



నవతెలంగాణ - కరీంనగర్ : మా పాలకవర్గంలో కరీంనగర్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధిలో భాగంగా ఆదివారం 4వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. ఖాన్‌పురాలో స్థానిక కార్పొరేటర్ నుజహత్ ఫర్హీన్ అలీతో కలిసి నగరపాలక సంస్థకు చెందిన రూ.38లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 4వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ కోరిన ప్రకారం మిగతా సమస్యలన్నీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, డివిజన్ నాయకులు హాజార్, అలీ బాబా, అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




నవతెలంగాణ - హుజూరాబాద్ : పట్టణంలోని మధువని గార్డెన్‌లో అరుణోదయ గురుకుల విద్యాలయం (1992- 1993) పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 30 సంవత్సరాల తర్వాత జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో అప్పటి విద్యార్థులు తమ అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గండ్ర సమ్మిరెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ఉపాధ్యాయులు పరంకుశం, ఆంజనేయులు, తులసిదాస్, భాస్కర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, విజయ కుమారిని ఘనంగా సన్మానించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు అందజేత



నవతెలంగాణ - తిమ్మాపూర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్ లో మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ కర్ణన్, పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు ఉత్తమ సేవలందించిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి, ఏఎస్ఐ నజీముద్దీన్, హోంగార్డులు లింగారెడ్డి, శంకర్ ఆంజనేయులు, పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రాజ్ కుమార్ లక్ష్మీనారాయణకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈదుల్ల రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ - గన్నేరువరం : మైలారం దేవుని మల్లన్న గుట్ట పరిసర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఈదుల్ల రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, జాతరలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యేతోపాటు ప్రజాప్రతినిధులను ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం వాసుగౌడ్ శాలువా కప్పి సన్మానం చేశారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా కో ఆర్డినేటర్ గుడెల్లి తిరుపతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ తోట రాములు, తోట కోటేశ్వర్, గంప వెంకన్న, వరాల పర్శరాములు పాల్గొన్నారు.

ముత్యాల జగన్‌రెడ్డికి పరామర్శ

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి తండ్రి నరసింహారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులను ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు దరువు ఎల్లన్న ఆదివారం పరామర్శించారు. ఆయనవెంట పార్టీ బెజ్జంకి మండల అధ్యక్షుడు దోనె అశోక్, శ్రీనివాస్, రవి ఉన్నారు.

ప్రాంగణ నియామకాల్లో అగ్రగామిగా 'వాగేశ్వరి'

- యాజమాన్యానికి రుణపడి ఉంటాం : ఎంపికైన విద్యార్థులు
- 264 మంది విద్యార్థుల ఎంపిక..
- ప్రతి విద్యార్థికి ప్లేస్‌మెంట్ కల్పించడమే లక్ష్యం..
- వాగేశ్వరి కళాశాలల కరస్పాండెంట్ బివిఆర్.గోపాల్‌రెడ్డి




నవతెలంగాణ - కరీంనగర్

ఉత్తర తెలంగాణలోనే వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల, వాగేశ్వరి ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు పోటీ పడి ఈ కళాశాలలో చదువుకోవడానికి పోటీ పడుతున్నారు. ఉత్తర తెలంగాణలోనే ప్రయివేట్ డిగ్రీ కళాశాలలో అత్యధిక అడ్మిషన్లు కల్గిన విద్యాసంస్థగా నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, దోస్త్ ద్వారా అడ్మిషన్లలో నెంబర్ వన్‌గా నిలవడమే గాక ప్రాంగణ నియామకాలకు అవసరమైన నైపుణ్యాలు సామర్థ్యాల గురించి ప్రత్యేకంగా శిక్షణ తరగతులు ఇస్తూ ఏటా వందాల మందికి ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలు ఉద్యోగాలు కల్పిస్తూ వారికి బంగారు భవిష్యత్‌కు బాటులు వేస్తుంది వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులు ఏకంగా రూ.లక్షల్లో వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారు. వారిలో చాలామంది పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే ఉండడం గమనార్హం. మా కళాశాలలో చదివిన విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగల కల్పనే లక్ష్యం అని వాగేశ్వరి డిగ్రీ, పీజీ విద్యాసంస్థల కరస్పాండెంట్ బీవీఆర్.గోపాల్‌రెడ్డి తెలిపారు.

264 మంది విద్యార్థులు ఎంపిక ...

కరీంనగర్ పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల, వాగేశ్వరి ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్లు అత్యంత ప్రతిభ కనబర్చారు. మల్టీ నేషనల్ కంపెనీలు విప్రో, టీంలీస్ అపోలో, హెచ్డీఎఫ్సి, ఐడిబిఐ, టీఎస్వి ఇంజనీరింగ్ టెక్నాలజీస్, ఎన్ఎస్‌వి టెక్నాలజీస్, యానిక్ టెక్నాలజీస్, హెచ్ఆర్ఎచ్, యాక్సిస్, యుఎస్ ఎస్ఫిన్‌సో, ప్రయివేట్ లిమిటెడ్ లాంటి పలు రకాల కంపెనీలు ఇంటర్వ్యు నిర్వహించగా విద్యార్థులు 264 మంది ఎంపికయ్యారు.

ప్రతి విద్యార్థికి ప్లేస్‌మెంట్ కల్పించడమే లక్ష్యం..




మా కళాశాలలో ప్రతి ఏటా రెండు పర్యాయాలు ప్లేస్మెంట్స్ నిర్వహిస్తున్నాం. దాంతోపాటు వేలాదిమంది విద్యార్థులు మల్టీ నేషనల్ కంపెనీలలో సెలెక్ట్ అవ్వడం చాలా సంతోషం. ప్రతి విద్యార్థికి ఉద్యోగమే ధ్యేయంగా శిక్షణ ఇవ్వడం మా బాధ్యత. ప్రతి విద్యార్థి కచ్చితంగా ప్రతి కంపెనీలో ప్లేస్‌మెంట్ సాధించే విధంగా మా కృషి ఎల్లవేళలా ఉంటుంది. ఎంపికైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నాను. విద్యార్థులు అదనపు నైపుణ్యాలు నేర్చుకుంటే తొందరగా ఉద్యోగాలు సాధిస్తారు. కమ్యూనికేషన్ స్కిల్స్ లోతైన విషయ పరిజ్ఞానం కలిగి ఉంటే విజయతీరాలకు చేరవచ్చు.

బివిఆర్.గోపాల్‌రెడ్డి, వాగేశ్వరి కళాశాలల కరస్పాండెంట్


యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు :

- ఇందూరి మల్లిక



వాగేశ్వరి డిగ్రీ పీజీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాను. మంచి శిక్షణ తరగతుల ద్వారానే నేను విప్రో కంపెనీకి ఎంపికయ్యాను. నాకు సహకరించిన వాగేశ్వరి కళాశాల యాజమాన్యానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు.

నైపుణ్య శిక్షణ మేలు చేసింది : కార్తికేయ




వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో బీబీఏ చదువుతున్నాను. కళాశాల నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో నేను టీం లీస్ కంపెనీలో సెలెక్ట్ అయ్యాను. ఇంతటి విజయాన్ని సాధించడంలో కళాశాలలో ఇచ్చిన నైపుణ్య శిక్షణ ఉపయోగపడింది. యాజమాన్యం పాత్ర మరువలేనిది వారికి నా ధన్యవాదములు.

ఫ్యాకల్టీ వారి సహకారం మరవలేను : స్వర్ణమాల్య



శిక్షణ ఇచ్చిన డిపార్ట్మెంట్కు ఫ్యాకల్టీ ద్వారనే నేను యానిక్ టెక్ సిస్టమ్ కంపెనీలో ఎంపికయ్యాను. నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

శిక్షణ తరగతులు ఉపయోగపడ్డాయి : బి.కేదారేశ్వరి



కళాశాలలో బిఎస్సి చదువుతున్నాను. ప్రాంగణ నియమకాలలో నాకు ఐడిబిఐ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నేను ఎంపికైనందుకు కళాశాల యాజమాన్యం అధ్యాపకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కళాశాల యాజమాన్యం వారిచే నిర్మించబడిన ప్రత్యేక శిక్షణ తరగతులు నాకు చాలా ఉపయోగపడ్డాయి.

కళాశాల శిక్షణతో జాబ్ వచ్చింది : శివకుమారి



కంప్యూటర్స్ స్కిల్స్‌తో పాటుగా విషయపరిజ్ఞానం శిక్షణ వచ్చారు. నేను యాక్సిస్ బ్యాంకు లో ఎంపికైనందుకు నాకు సహకరించిన యజమానియానికి ధన్యవాదాలు.

స్కిల్స్ నేర్పుతారు : ఓరుగంటి ఆకాంక్ష



నేడు బికాం చదువుతున్నాను. మాకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, గైడ్‌లైన్స్‌తో పాటు చాలా స్కిల్స్ నేర్పుతారు. నేను టీం లీస్ కంపెనీలో ఎంపికైనందుకు గర్విస్తున్నాను. కళాశాల యాజమాన్యానికి ఎల్లవేళలా రుణపడి ఉంటాను.

అపోలో ప్లేస్‌మెంట్ వచ్చింది : గడ్డం సుష్మశ్రీ



నేను వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో న్యూట్రిషన్ కోర్స్ చదువుతున్నాను. మంచి శిక్షణ తరగతులు తీసుకోవడం ద్వారా నాకు అపోలో లో ప్లేస్మెంట్ రావడం చాలా సంతోషంగా ఉంది.

నైపుణ్య శిక్షణతోనే ఉద్యోగం సాధించా : మేరుగు నిఖిత



వాగేశ్వరి కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాను. మా కళాశాలలో విద్యా సంవత్సరం మొదటి ప్రాంగణ నియామకాలకు అవసరమైన నైపుణ్యాలు సామర్థ్యాల గురించి ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నాకు హెచ్డిఎఫ్సి కంపెనీలో ఉద్యోగ రావడానికి ఎంతో దోహదపడ్డాయి. కళాశాల యాజమాన్యానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు.

'దశాబ్ధి'కి ఘన ఏర్పాట్లు

నేడు సింగరేణి

ఆర్జీ 1లో వేడుకలు

నవతెలంగాణ – గోదావరిఖని:



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో వేడుకలను నేడు నిర్వహించనున్నారు. ఆర్జీ 1 ఏరియాలో ఇందుకు సంబంధించి ఘన ఏర్పాట్లు చేపట్టారు. గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ వేడుకలు జరుగనున్నాయి. వేడుకలను ఇక్కడి అధికారులు ప్రతిష్టాత్మ కంగా తీసుకొని ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కన్నుల పండుగగా జరుపాలని, ఆహ్లాదకరమైన వాతవరణా న్ని తలపించే విధంగా ఏర్పాట్లు ఉండాలని, కార్యక్రమానికి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలుగకుండా ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్ నిత్యం అధికారులతో ఏర్పాట్లపై సమీక్షిస్తూ, ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. వేడుకల్లో భాగంగా జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఉదయం ఫుడ్‌కోర్ట్ స్టాల్స్, ప్రముఖ కళాకారులచే ధూం ధాం, కనుల విందు చేసే తెలంగాణ కల్చరల్ షో కార్యక్రమాల ను నిర్వహిస్తున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఉత్తమ ఉద్యోగులు, అధికారులు వీరే...

ఈ వేడుకల్లో భాగంగా ఇప్పటికే ఆర్జీ 1 ఏరియాలో ఉత్తమ కార్మికులు, అధికారులను ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆర్జీ 1 యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్తమ ఉద్యోగులుగా జీడీకే 2, 2 గనికి చెందిన ఫోర్‌మెన్ జి.వెంకటేశ్వర్లు, జీడీకే 11వ గనికి చెందిన రామ్‌కార్ షటిల్ ఆపరేటర్ బైరీనాని మహేష్‌ను, జీడీకే 1 సీఎస్‌పీకి చెందిన కన్వేయర్ ఆపరేటర్ నూతలకంటి ఉపేందర్‌ను ఎంపిక చేశారు. ఉత్తమ అధికారులుగా అడిషనల్ జీఎం ఎఫ్అండ్‌ఏ సంగెం రామక్రిష్ణను, జీడీకే 2, 2ఏ అండ్ 5 కంటిన్యూస్ మైనర్ కాలరీ మెనేజర్ అనిల్ గబాలేను ఎంపిక చేశారు. వీరిని వేడుకల సందర్భంగా ఘనంగా సన్మానించనున్నారు.

దశాబ్ధి ఉత్సవాలను జయప్రదం చేయండి...

చింతల శ్రీనివాస్- ఆర్జీ 1 జీఎం



నేడు సింగరేణి ఆర్జీ 1 ఆధ్వర్యంలో స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగనున్న వేడుకలను జయప్రదం చేయాలని ఆర్జీ 1 జీఎం చింతల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కార్మికులు, వారి కుటుంబాలు, సింగరేణి పరిసర, ప్రభావిత గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిది

సింగరేణి ఉనికిని ప్రశ్నార్థకంగా చేసేలా కేంద్రం నిర్ణయాలు

ఓసీపీ 3 సభలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:

తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికుల పాత్ర మరవలేనిదని, సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకుంటున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు, రామగుండం దశాబ్ది ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఓసీపీ 3 కృషి భవన్ వద్ద గని కార్మికులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్‌తోనే కార్మికుల వారసులకు ఉద్యోగాలు సాధ్యమయ్యాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్టంలో ప్రజాహిత పాలన సాగిస్తున్నారని అన్నారు. సింగరేణి అస్థిత్వాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను కేంద్రం చేస్తోందని కార్మికులు ఆ కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు. పోతనకాలనీ ప్రధాన రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే రోడ్డుపై డివైడర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ఆర్జీ 2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, కార్పోరేటర్లు శంకర్ నాయక్, పాముకుంట్ల భాస్కర్, నాయకులు దశరథం, దేవ వెంకటేష్, మేడి సదయ్య మాదాసు రామ్మూర్తి, ఇనుముల సత్యం, చల్ల రవీందర్ రెడ్డి,ఎర్రవెల్లి గోపాల్ రావు,పర్లపెల్లి రవి, నారాయణదాసు మారుతి, జేవి రాజు, సారయ్య నాయక్, పులి రాకేష్, కుమార్ నాయక్, సంధ్యారెడ్డి, వంగ వీరస్వామి, గుడెల్లి రాంచెందర్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల వద్ద వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట నాయకులు గుజ్జుల సత్యనారాయణ, తోకల రమేష్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్‌లో ఉద్యోగాల అమ్మకం పేరుతో కాంట్రాక్టర్లు ఇష్టం వచ్చిన రీతిలో డబ్బులు దండుకుంటున్నారని ఐఎఫ్‌టీయూ రాష్ట నాయకులు గుజ్జుల సత్యనారాయణ, తోకల రమేష్ ఆరోపించారు. ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఎన్టీపీసీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్ ఉద్యోగాల కుంభ కోణం మరో ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగాల కుంభకోణంలా మారనుందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్లాంట్లో కొంతమంది రాజకీయ నేతలు, కాంట్రాక్టర్లు కలిసి రెండు లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు ఒక్కో బాధితుడి వద్ద వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లోకేషన్ లో ఉద్యోగాలు ఇస్తామంటూ టెండర్లు వచ్చిన కాంట్రాక్టర్లు నిరుద్యోగుల వద్ద డబ్బులు దండుకుంటున్నారని, ఈ వసూళ్లను వెంటనే ఆపాలని ఎన్టీపీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. వసూళ్ల దందాను కాంట్రాక్టర్లు ఆపకపోతే కాంట్రాక్టర్ల ఇండ్ల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే నిరుద్యోగుల వద్ద వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలని కాంట్రాక్టర్లను డిమాండ్ చేశారు. లేనట్లయితే డబ్బులు వసూలు చేసిన కాంట్రాక్టర్ల పేర్లతో సహా మీడియా ముందు ప్రవేశపెట్టి బహిరంగంగా వెల్లడిస్తామని, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఉద్యోగ దందాను తక్షణమే అరికట్టి ఎన్టీపీసీ యాజమాన్యమే నిజమైన నిరుద్యోగులకు, స్థానిక యువతకు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా, కాంట్రాక్టు ఉద్యోగాల నియామకం జరగాలని, నిజమైన నిరుద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, కలువల రాయమల్లు, రాజయ్య కొయ్యడ శంకర్, మాట్ల సమ్మయ్య తదితరులున్నారు.

3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర 3వ మహాసభలు జూన్ 6,7 తేదీల్లో మేడ్చల్ లో జరుగుతున్న సందర్భంగా ఆదివారం గోదావరిఖనిలో ఈ మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందని విమర్శించారు. మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు రూ.26 వేల వేతనం చెల్లించాల్సి ఉండగా రూ.15,500 చెల్లిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచకుండా మొండి వైఖరిని అవలంబిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటూ, కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించడం కోసం, భవిష్యత్తులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు రూపొందించడం కోసం మేడ్చల్ లో రాష్ట్ర 3వ మహాసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మహా సభలను పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్, కార్పొరేషన్లలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రజా సంఘాల నాయకులు ఎజ్జ రాజయ్య, జూల మోహన్, టి.రమేష్ కుమార్, మాటూరి రాంచందర్, జాలిగం రాజు, గాజుల రాజు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి ఒకరు మృతి

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండల కేంద్రానికి చెందిన పేయ్యల చంద్రయ్య (62) తన ఇంటి వద్ద ఉన్న చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. చెట్టు కొమ్మలు నరికేందుకు చెట్టుపైకి ఆదివారం చంద్రయ్య ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. ప్రమాదంలో చంద్రయ్యకు తీవ్ర గాయాలు కాగా, కుటుంబ సభ్యులు హుటాహుటిన అతడిని కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బేతి రాములు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణలో

అద్భుత ఫలితాలు సాధించిన తెలంగాణ పోలీస్

జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్

సురక్షా దినోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, డీసీపీ





నవతెలంగాణ-పెద్దపల్లి:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో అనుమానాలను పటాపంచలు చేస్తూ అద్భుత ఫలితాలను తెలంగాణ పోలీసులు సాధించారని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. ఆదివారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం నిర్వహించి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి పోలీస్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, డీసీపీ వైభవ్ గైక్వాడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.... పోలీసు శాఖ పరిధిలో గతంలో ఉన్న పరిస్థితులకి, నేడు ఉన్న పరిస్థితులకి పొంతన లేదన్నారు. పోలీసింగ్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విజయవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, నేరాలు అధికమవుతున్న నేపథ్యంలో దాని నియంత్రణకు సైతం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలను రక్షించే పోలీసు శాఖ, ట్రాఫిక్ పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సేవలు ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేందుకు పకడ్బందీ చర్యలను ప్రభుత్వం తీసుకుంద న్నారు. డీసీపీ వైభవ్ గైక్వాడ్ మాట్లాడుతూ, సురక్షా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మూడు నియోజక వర్గ కేంద్రాల్లోని పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, ప్రజలకు అందించిన వివిధ సేవలను వివరిస్తూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, ఏసీపీ మహేష్, సీఐ ప్రదీప్, ఎస్ఐ మహేందర్ యాదవ్, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే నెంబర్ వన్‌గా తెలంగాణ పోలీస్ వ్యవస్థ

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేశంలోనే తెలంగాణ పోలీస్ వ్యవస్థ నెంబర్ వన్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం గోదావరిఖని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన సురాక్ష దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత సీఎం కేసీఆర్ పోలీసుశాఖకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. గతంలో పోలీసులకు ప్రభుత్వ ఉద్యోగుల కంటే వేతనాలు తక్కువగా ఉండేవని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో వారికి వేతనాలు భారీగా పెంచినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీ-టీం లను ఏర్పాటు చేశామన్నారు. మానవీయ కోణంలో దేశంలోనే మొదటి సారిగా ట్రాఫిక్ పోలీసులకు రిస్క్ అలవెన్స్ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో అందించారని, పోలీసింగ్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విజయవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పోలీసులకు అవసరమైన మౌళిక వసతులు, భవనాలు వాహనాలు కల్పించారని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలు జరిగితే త్వరితగతిన నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ అమలు చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ అద్భుతమైన సేవలు అందిస్తున్నారని, నిరంతరం వచ్చే సవాళ్లను ఎదుర్కొంటూ 24 గంటలు అప్రమత్తతతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ప్రమోద్ రావు, ప్రసాద్ రావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో అభివృద్ధి జరగని ప్రాంతం.. సంక్షేమం అందని గడప లేదు:

సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో అభివృద్ధి జరగని ప్రాంతం.. సంక్షేమం అందని గడప లేదని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. తెలంగాణ ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామగుండం దశాబ్ది ప్రగతి యాత్రను ఆదివారం 13వ డివిజన్‌లో నిర్వహించారు. డివిజన్ మహిళలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 13వ డివిజన్లో 2 కోట్ల 50 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. 320 మందికి ఆసరా ఫింఛన్లు, 33 మందికి కళ్యాణ లక్ష్మి పథకం, సీఎం సహాయనిధి ద్వారా 23 మందికి రూ.11 లక్షల విలువ గల చెక్కులను అందించినట్లు తెలిపారు. ఎల్‌ఓసీ ద్వారా 8 లక్షలు, బీఆర్ఎస్ కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే పార్టీ ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందించామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ...

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు ఎలిగెటి శంకర్ కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే చందర్ పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. 13వ డివిజన్‌కు చెందిన మహర్షి ల్యాబ్‌లో పని చేస్తున్న సురేష్ ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బషీర్, కలవెని మల్లేశ్‌ను పరామర్శించి ఇద్దరికి రూ.5 వేల చొప్పున సహాయం అందజేయడంతో పాటు పలువురి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమాల్లో రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు రాకం లతా-దామోదర్, పాముకుంట్ల భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు తోడేటి శంకర్ గౌడ్, కాల్వ శ్రీనివాస్, అచ్చే వేణు, చెలకలపల్లి శ్రీనివాస్, బొడ్డు రవీందర్ తదితరులున్నారు.

జన్మదినం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-గోదావరిఖని: నక్షత వెంచర్స్ చైర్మన్ చిర్ర రాజు తన జన్మదినం సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. మూడు నిరుపేద కుటుంబాలకు రైస్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. జీఎం కాలనీలోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ ఆశ్రమంలో 25 కేజీల బియ్యాన్ని, రామగుండం తబితా ఆశ్రమంలో 25 కేజీల బియ్యాన్ని, రూ.2 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. రాగుల కిరణ్ అధ్యక్షతన జరిగిన జన్మదిన వేడుకలకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ హాజరై నక్షత్ర వెంచర్స్ చైర్మన్ చిర్ర రాజుచే కేక్ కట్ చేయించారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు అయిత శివ కుమార్, బొడ్డు రవీందర్, రాకం వేణు, జెవి రాజు మౌనిక, కన్నూరి సతీష్, సలీం బేగ్, నక్షత్ర మరో చైర్మన్ అనిల్, నక్షత్ర సభ్యులు సారంగపాణి, ఇ.రాజు, బుర్ర శ్రీనివాస్, రవి వర్మ, అశోక్ తదితరులున్నారు.



ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని పోస్టాఫీస్‌లో ఆధార్ నమోదు కేంద్రం సేవలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. కొత్తగా నమోదు చేసుకోవడానికి, ఫోటో, మొబైల్ నంబర్, పుట్టిన తేదీ, అడ్రసు మార్చుకోడానికి, బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోడానికి ఎలాంటి అదనపు రుసుము లేకుండా ప్రతి రోజూ ఉదయం 9 నుండి సాయంత్రం 6 వరకు ప్రత్యేక కౌంటర్ ద్వారా సేవలు అందించనున్నట్లు పెద్దపల్లి డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ పసునూరి ప్రభాకర్ తెలిపారు. ఈ అవకాశాన్ని గోదావరిఖని, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని కూరగాయల మార్కెట్లో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారుల వద్ద హమాలీ కార్మికులుగా పని చేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంఎ.గౌస్, కండె లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కూరగాయల మార్కెట్‌లో జరిగిన హమాలీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నిత్యం గోదావరిఖని కూరగాయల మార్కెట్లో హమాలీ కార్మికులు జీవన పోరాటం సాగిస్తున్నారని అన్నారు. హమాలీ కార్మికులకు హోల్ సేల్ కూరగాయల వ్యాపారులు కూలీ రేట్లు ఇంత వరకు పెంచలేదని ఆరోపించారు. జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పక్షాన డిమాండ్ నోటీసును హోల్ సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులకు నెల రోజుల ముందే ఇచ్చినా.. హోల్‌సేల్ వ్యాపారులు పట్టించుకోవడం లేదన్నారు. మార్కెట్‌లో ఉన్న రైతులు, ఆసాముల జీవితాలు కూలీలపైన ఆధారపడి ఉన్నందున పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రెట్లు పెంచాల్సిందిగా హోల్ సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులను కోరుతున్నామని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు బండారి రవిందర్, గాలిపెల్లి సతీష్, ఎండీబ జానీమియా, కౌటం రవిందర్, గొర్రె రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు పాకెట్ మనీ


పాకెట్ మనీ అందజేస్తున్న కార్పొరేటర్

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దేల్లి తెజశ్విని ప్రకాష్ కుతూరు పెద్దెల్లి దేదీవ్య 8వ జన్మదిన వేడుకలను సంజయ్ గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిచే కేక్ కట్ చేయించి పంచారు. కేంద్రంలోని నిరుపేద చిన్నారులకు జ్యోతి గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాకెట్ మనీని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి మనాలీ రాజ్‌ఠాకూర్ కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో జ్యోతి గాంధీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దయానంద్ గాంధీ, అంగన్వాడీ టీచర్స్ పోతన విజయ, వకుల తిరుమల, షమీమా, ఆయా భూలక్ష్మి, బస్తీ పెద్దలు అట్లా జగ్గయ్య, గడ్డం రాజేష్, పెద్దల్లి ప్రవీణ్, యసాల శేఖర్ తదితరులున్నారు.

ఎంఎస్‌పీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సదస్సును జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గోదావరిఖని గంగానగర్‌లో పార్టీ ఉపాధ్యక్షులు మడిపల్లి దశరథం మాదిగ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇంచార్జి మంద రవికుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ, నేడు కరీంనగర్‌లో జరిగే ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, ఎస్సీల వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని, లేనియెడల తెలంగాణలో బీజేపీని మట్టి కరిపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కాజీపేట రాజయ్య, గద్దల అనిల్ కుమార్, ఏలూరు రాంబాబు, ఆరేపల్లి శ్రీనివాస్, ఇప్ప మహేష్, సుద్దాల రమేష్, చిలుక ప్రమోద్, వడ్లూరు లింగస్వామి, ఇప్ప శీను, ముల్కల శ్రావణ్ కుమార్, తిరుపతి తదితరులున్నారు.

మెస్సి దారెటు?!

- పిఎస్‌జితో ముగిసిన బంధం
- ఆఖరు మ్యాచ్‌లో ఫ్యాన్స్ హేళన



లియోనల్ మెస్సి. ప్రపంచ ఫుట్‌బాల్ సూపర్ స్టార్. మైదానంలో మెస్సి మ్యాజిక్ చూసేందుకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఎదురుచూస్తారు. పారిస్ సెయింట్ జర్మైన్ (పిఎస్‌జి) క్లబ్‌తో రెండేండ్ల బంధానికి తెరదించిన లియోనల్ మెస్సి పట్ల ఆ క్లబ్ అభిమానులు అనుచితంగా ప్రవర్తించారు. శనివారం పిఎస్‌జి తరపున ఆఖరు మ్యాచ్ ఆడిన మెస్సి దురభిమానుల ఎగతాళి చవిచూసినా.. చిరునవ్వుతో మైదానాన్ని, పిఎస్‌జినీ వీడాడు.

పారిస్ (ఫ్రాన్స్)

లియోనల్ మెస్సి (35) పారిస్ సెయింట్ జర్మైన్ (పిఎస్‌జి)తో ఒప్పందానికి తెరదించాడు. రెండేండ్లు ఫ్రెంచ్ ఫుట్‌బాల్ క్లబ్‌తో కొనసాగుతున్న లియోనల్ మెస్సి.. కాంట్రాక్టును మరో ఏడాది కొనసాగిస్తాడనే అంచనాలు కనిపించాయి. కానీ, గత రెండు నెలల్లో జరిగిన అనూహ్య సంఘటనలతో పిఎస్‌జితో లియోనల్ మెస్సి బంధానికి తెరపడింది. 35 ఏండ్ల లియోనల్ మెస్సి శనివారం ఫ్రెంచ్ లీగ్‌లో పిఎస్‌జి తరపున ఆఖరు ఆట ఆడాడు. సొంత మైదానంలో శనివారం జరిగిన చివరి మ్యాచ్‌లో క్లర్‌మోంట్ చేతిలో 2-3తో పిఎస్‌జి పరాయం పాలైంది. చివరి మ్యాచ్‌లో గోల్ కోసం ప్రయత్నించినా.. లియోనల్ మెస్సి గోల్ కొట్టలేకపోయాడు.

చిరునవ్వుతోనే..! :

శనివారం నాటి మ్యాచ్ ముందు అనౌన్సర్ లియోనల్ మెస్సి పేరు ప్రకటించగానే పిఎస్‌జి దురభిమానులు పెద్ద ఎత్తున హేళన చేశారు. కాసేపటికి తన ముగ్గురు కుమారులతో కలిసి మైదానంలోకి అడుగుపెట్టిన లియోనల్ మెస్సి చిరునవ్వుతోనే అభిమానులను పలకరించాడు. మ్యాచ్ చివర్లో కిలియన్ ఎంబపె అందించిన పాస్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపించటంలో లియోనల్ మెస్సి తడబాటుకు గురయ్యాడు. దీంతో దురభిమానుల ఎగతాళి తారాస్థాయికి చేరుకుంది. 'పిఎస్‌జి క్లబ్, అభిమానులు, పారిస్ నగరానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పిఎస్‌జికి ఆల్ ది బెస్ట్' అని లియోనల్ మెస్సి వీడ్కోలు వ్యాఖ్యలు చేశాడు. పిఎస్‌జి తరఫున రెండు సీజన్లలో 75 మ్యాచులు ఆడిన లియోనల్ మెస్సి.. 32 గోల్స్ కొట్టాడు. 35 గోల్స్‌కు అవకాశాలు సృష్టించాడు. పిఎస్‌జి తరపున రెండేండ్లలో రెండు ఫ్రెంచ్ లీగ్ టైటిళ్లు, ఓ ఫ్రెంచ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను మెస్సి ముద్దాడాడు. నిజానికి, ఈ ఏడాది మార్చి వరకు పిఎస్‌జి, మెస్సి బంధం బాగానే కనిపించింది. 'పిఎస్‌జిలో చాలా కంఫర్ట్‌గా ఉన్నాను. తొలి సీజన్‌లో పరిస్థితులకు అలవాటు పడేందుకు కాస్త సమయం పట్టింది. కానీ ఈ సీజన్ భిన్నంగా మొదలైంది. క్లబ్, సిటీతో ఎంతో మెరుగైన బంధం ఏర్పడింది. ఈ సీజన్‌ను చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నాను' అని మెస్సి ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. కానీ చాంపియన్స్ లీగ్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో పరాజయం.. సమీకరణాలను మార్చివేసింది. లియోనల్ మెస్సి రాకతో చాంపియన్స్ లీగ్ టైటిల్ లోటు తీర్చుకోవాలని ఎదురుచూసిన పిఎస్‌జి.. నిష్క్రమణతో నిరాశచెందింది. అర్జెంటీనా తరహాలో రైట్, లెఫ్ట్ వింగ్స్‌లో మెస్సి సరైన సహకారం పిఎస్‌జిలో లభించలేదు. ఇక ఫిఫా ప్రపంచకప్ విజయం అనంతరం లియోనల్ మెస్సి మైదానంలో రిస్క్ తీసుకోవటం లేదని అభిమానులు ఎగతాళి చేయటం మొదలెట్టారు. దీనికి తోడు గత నెలలో రెండు రోజుల పర్యటన నిమిత్తం లియోనల్ మెస్సి కుటుంబంతో కలిసి సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లగా.. పిఎస్‌జి యాజమాన్యం అత్యంత కఠినంగా వ్యవహరించింది. మెస్సిని సస్పెండ్ చేసి, ప్రాక్టీస్ సెషన్‌కు సైతం రావొద్దని ఆదేశించింది. ఈ సంఘటనతో పిఎస్‌జితో మెస్సి బంధం పూర్తిగా చెడింది. అయినా, ఆఖరు మ్యాచ్ అనంతరం చిరునవ్వుతోనే మెస్సి మైదానాన్ని, క్లబ్‌ను వీడాడు.



నెక్స్ట్ ఏంటీ?! :

లియోనల్ మెస్సి పిఎస్‌జితో ఆఖరు మ్యాచ్ ఆడేశాడు. సౌదీ అరేబియా క్లబ్ నుంచి మెస్సి నిరాకరించలేని ఆఫర్ వచ్చినట్టు సమాచారం. క్రిస్టియానో రొనాల్డోకు మించిన కాంట్రాక్టును సౌదీ క్లబ్ మెస్సి ముందుంచినట్టు వార్తలు వస్తున్నాయి. ఇక ప్రీమియర్ లీగ్‌లో చెల్సియా, న్యూక్యాసిల్ యునైటెడ్‌లు మెస్సి కోసం ఆఫర్ సిద్ధం చేసినట్టు తెలుస్తుంది. సౌదీ క్లబ్ అల్ హిలాల్, ఇంటర్ మియామితో పాటు మెస్సి పాత క్లబ్ బార్సిలోనా ఎఫ్‌సీ సైతం అర్జెంటీనా సూపర్‌స్టార్ కోసం పరితపిస్తున్నట్టు కనిపిస్తుంది. లియోనల్ మెస్సి నుంచి తదుపరి గమ్యంపై ఎటువంటి ప్రకటన రాలేదు. సౌదీ క్లబ్ అల్ హిలాల్‌కు మెస్సి ఆడే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. లేదంటే, మళ్లీ బార్సిలోనా ఎఫ్‌సీతోనే కెరీర్‌ను ముగించేందుకు మెస్సి మొగ్గుచూపిస్తాడేమో చూడాలి.



వరుణుడు కరుణిస్తేనే..!

- లండన్‌లో అనిశ్చితి వాతావరణం
- ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్

నవతెలంగాణ-లండన్

2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ పోరు కోసం ఇటు భారత జట్టు అభిమానులు, ఇటు ఆస్ట్రేలియా క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జూన్ 7-11న ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు లండన్‌లోని ది ఓవల్ మైదానం వేదికగా నిలువనుంది. అగ్రజట్ల సమరంలో తుది ఫలితంతో పాటు రానున్న అరుదైన రికార్డు కోసం ఇరు జట్ల అభిమానులు ఉత్సుకత చూపిస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియాలు ఐసీసీ మూడు ప్రధాన టోర్నీల్లో చాంపియన్లుగా నిలిచాయి. వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్ సహా చాంపియన్స్ ట్రోఫీలను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు ఈ రెండు జట్లను ఊరిస్తున్న ఏకైక ఐసీసీ ట్రోఫీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గద. ది ఓవల్‌లో ఐసీసీ టెస్టు గద నెగ్గిన జట్టు.. ఐసీసీ నాలుగు టైటిళ్లు నెగ్గిన జట్టుగా చరిత్ర సృష్టించనుంది. అయితే.. ఈ ఉత్సాహంపై వరుణుడు నీళ్లు చల్లే ప్రమాదం లేకపోలేదు. లండన్‌లో అనిశ్చితి వాతావరణం ఇప్పుడు ఇరు జట్ల అభిమానులకు ఫీవర్ తెప్పిస్తోంది!.

సూచనలు క్లియర్! :

సాధారణంగా ఇంగ్లాండ్‌లో వేసవి జూన్ నెలతో ఆరంభం అవుతుంది. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు 18-21 మధ్య నమోదవుతాయి. ఈ వాతావరణంలో స్పిన్నర్లకు మాయ చేసేందుకు మెరుగైన అవకాశం చిక్కుతుంది. జూన్ 7-11న వాతావరణ సూచన ప్రకారం.. నాలుగు రోజులు ఎటువంటి వర్షం సూచనలు లేవు. బుధ, గురు, శుక్ర వారాలు సాధారణ వాతావరణం ఉండనుంది. శనివారం మాత్రం వర్షం కురిసేందుకు అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ చెబుతుంది. ఇక ఆదివారం సైతం ఎటువంటి వర్షం సూచనలు లేవు. ఒకవేళ ఐదు రోజుల ఆటలో వర్షం కారణంగా ఏ రోజు ఆట సాధ్యపడకపోయినా.. జూన్ 12 రిజర్వ్ డేను వాడుకునేందుకు అవకాశం ఉంది. వాతావరణ సూచనల ప్రకారం ఐదు రోజుల ఆటలో ఒక్క రోజు వరుణుడు ఆటంకం కలిగిస్తే పెద్ద ప్రమాదం లేదు. 90 ఓవర్ల ఆట నష్టపోయినా.. రిజర్వ్ డేను ఉపయోగించుకోవచ్చు. కానీ లండన్‌ది అనిశ్చితి వాతావరణం. ముంబయి తరహాలో ఎప్పుడు వర్షం కురుస్తుంది, ఎప్పుడు ఎండ కాస్తుందో చెప్పటం కష్టం! ఇదే అభిమానులను టెన్షన్‌కు గురిచేస్తుంది.

ఓవల్‌లో ప్రాక్టీస్ :

అరుండెల్ క్యాసిల్ క్రికెట్ క్లబ్ నుంచి శనివారం లండన్‌కు చేరుకున్న భారత క్రికెటర్లు.. ఆదివారం ది ఓవల్ మైదానంలో సాధన చేశారు. మేఘావృతమైన ఆహ్లాదకర వాతావరణంలో బ్యాటర్లు, బౌలర్లు ప్రాక్టీస్ చేయటం కనిపించింది.

టేబుల్ టెన్నిస్ టోర్నీ షురూ



హైదరాబాద్ : జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. మోయినాబాద్‌లోని ఫైర్‌ఫాక్స్ స్పోర్ట్స్ అండ్ రిసార్ట్స్ వేదికగా ఈ టోర్నీ మొదలైంది. తెలంగాణ అమ్మాయి అపర్ణ వెల్లూరి ముందంజ వేసింది. 11-7, 11-6, 9-11, 11-9తో బెంగాల్ అమ్మాయిపై అపర్ణ గెలుపొందింది. ఏపీ అమ్మాయి మానస్వి సీలం సైతం రెండో రౌండ్లో అడుగుపెట్టింది. ఉత్తరప్రదేశ్ అమ్మాయిపై 3-2తో ఐదు సెట్ల మ్యాచ్‌లో గెలుపొంది టోర్నీలో ముందంజ వేసింది. ఆరు రోజుల జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో దేశవ్యాప్తంగా 1900 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు.

హాజిల్‌వుడ్ ఔట్

- మైకల్ నెసర్ ఇన్



లండన్ : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ముందు ఆసీస్‌కు ఎదురుదెబ్బ. ఐపీఎల్‌లో గాయపడిన జోశ్ హాజిల్‌వుడ్ ఫైనల్ పోరు సమయానికి పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశం కనిపించటం లేదు. దీంతో హాజిల్‌వుడ్ స్థానంలో ఆస్ట్రేలియా మైకల్ నెసర్‌ను ఎంపిక చేసింది. తుది జట్టులో చోటు కోసం స్కాట్ బొలాండ్‌తో నెసర్ పోటీపడాల్సి ఉంటుంది. కౌంటీ క్రికెట్‌లో జోరుగా వికెట్ల వేట సాగించిన మైకల్ నెసర్.. విదేశీ గడ్డపై టెస్టు అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్‌కు జోశ్ హాజిల్‌వుడ్ అందుబాటులో ఉంటాడని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. జూన్ 16న బర్మింగ్‌హామ్ టెస్టుతో యాషెస్ సమరం ఆరంభం కానుంది.


జకో..17వ సారి

- ప్రీ క్వార్టర్స్‌లో సెర్బియా స్టార్
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



పారిస్ (ఫ్రాన్స్) : సెర్బియా యోధుడు, మూడో సీడ్ నొవాక్ జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 17వ సారి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ నాల్గో రౌండ్లో నొవాక్ జకోవిచ్ 6-3, 6-2, 6-2తో వరుస సెట్లలో జువాన్ పాబ్లో వారిలాస్ (పెరు)పై అలవోక విజయం సాధించాడు. ఏడు ఏస్‌లతో మెరిసిన జకోవిచ్.. మూడు డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడినా ప్రత్యర్థికి ఒక్క సెట్ కోల్పోలేదు. ఆరు బ్రేక్ పాయింట్లతో రెచ్చిపోయిన జకోవిచ్ పాయింట్ల పరంగా 88-54తో తిరుగులేని ఆధిపత్యం చెలాయించాడు. జకోవిచ్ 18 గేములు గెల్చుకోగా.. పెరు ఆటగాడు కేవలం ఏడు గేములకే పరిమితం అయ్యాడు. జకోవిచ్ సర్వ్‌ను ఓ సారి బ్రేక్ చేసిన జువాన్ పాబ్లో.. అదే జోరు నిలకడగా చూపించటంలో విఫలమయ్యాడు. రష్యా ఆటగాడు కారెన్ కచనోవ్ నాలుగు సెట్ల మ్యాచ్‌లో గెలుపొందాడు. ఇటలీ ఆటగాడు లారెంజో సోనెగొపై 1-6, 6-4, 7-6(9-7), 6-1తో కచనోవ్ అదరగొట్టాడు. మెన్స్ సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు.

మహిళల సింగిల్స్ విభాగంలో కరోలినా ముచోవ (చెక్ రిపబ్లిక్) ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. నాల్గో రౌండ్ మ్యాచ్‌లో రష్యా క్రీడాకారిణి ఎలినా అవనేశ్యన్‌పై ముచోవ విజయం సాధించింది. 6-4, 6-3తో వరుస సెట్లలోనే గెలుపొందింది. ఏడు బ్రేక్ పాయింట్లు సాధించిన కరోలిన ముచోవ.. పాయింట్ల పరంగా 71-59తో పైచేయి సాధించింది. ఇక బెల్జియం భామ ఎలిసి మార్టెన్స్ గెలుపొందిన రష్యా అమ్మాయి అనస్థాసియ ప్రీ క్వార్టర్స్ బెర్త్ దక్కించుకుంది. 3-6, 7-6(7-3), 6-3తో అనస్థాసియ మూడు సెట్ల సమరంలో విజయం సాధించింది.



మాస్ బీట్‌తో భోళా మానియా

చిరంజీవి, మెహర్ రమేష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'భోళా శంకర్'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ మ్యూజికల్ జర్నీని బ్లాక్ బస్టర్ నోట్‌తో ప్రారంభించారు. లేటెస్ట్‌గా విడుదలైన మొదటి పాట 'భోళా మానియా' మాస్‌ని ఆకట్టుకునే బీట్‌లతో హైలీ ఎనర్జిటిక్ నెంబర్. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను మహతి స్వర సాగర్ ఆకట్టుకునేలా స్వరపరిచారు. రేవంత్ ఎల్వీ పాటని ఎనర్జిటిక్‌గా ఆలపించారు. చిరంజీవి గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ కన్నుల పండుగలా ఉన్నాయి. ఈ పాటలో చిరంజీవి స్టైలిష్‌గా, యంగ్‌గా కనిపించారు. చిరంజీవి తనయ సుస్మిత కొణిదెల ఈ చిత్రానికి స్టైలింగ్, కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. అనిల్ సుంకర (ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్) నిర్మిస్తున్న ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో భావోద్వేగాలు, ఇతర అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నాయి. తమన్నా కథానాయికగా నటిస్తుండగా, చిరంజీవి సిస్టర్‌గా కీర్తిసురేష్ కనిపించనుంది. సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ పాత్రను పోషించారు. ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్.

పిల్లలకూ 'విమానం' చూపించండి


'చిన్నప్పుడు పిల్లల్లో ఓ మంచి ఎమోషన్‌ను నింపితే వాళ్లు పెద్దై ఏదైనా సాధించగలరు అని చెప్పటానికి 'విమానం' సినిమా ఒక ఉదాహరణ' అని అన్నారు దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు. శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను వీక్షించిన దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగా వచ్చింది. దర్శకుడు శివ ప్రసాద్ తండ్రీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్ గురించి చెబుతుంటే బాగా టచింగ్‌గా అనిపించింది. కళ్లలో నీళ్లు వచ్చాయి. తల్లిదండ్రులు 'విమానం' సినిమాను చూడటమే కాకుండా.. వాళ్ల పిల్లలకు కూడా సినిమాను చూపించాలి. అప్పుడే ఇందులో పిల్లల కోసం తల్లిదండ్రులు పడే తపన ఎలా ఉంటుందనేది తెలుస్తుంది. అలాగే సినిమాలో మిగిలిన క్యారెక్టర్స్ ఎంతో అద్భుతంగా పండాయి' అని తెలిపారు. ఈ చిత్రంలో వీరయ్య అనే అంగ వైకల్యం ఉన్న తండ్రి పాత్రలో సముద్ర ఖని, కొడుకు పాత్రలో మాస్టర్ ధ్రువన్ నటిస్తుండగా, సుమతి పాత్రలో అనసూయ భరద్వాజ్, రాజేంద్రన్ పాత్రలో రాజేంద్రన్, డేనియల్ పాత్రలో ధన్‌రాజ్, కోటి పాత్రలో రాహుల్ రామకృష్ణ ఇతర కీలక పాత్రల్లో మెప్పించబోతున్నారు. నటి మీరా జాస్మిన్ అతిథి పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని ఈనెల 9న తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు.



రాఘవేంద్రరావుతో 'విమానం' చిత్ర బృందం

రాజుగారి కోడిపులావ్

ఏఎమ్ఎఫ్, కోన సినిమా బ్యానర్లపై అనిల్ మోదుగ, శివ కోన సంయుక్తంగా నిర్మిస్తూ, శివా కోన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'రాజు గారి కోడిపులావ్' కుటుంబ కథా 'వి'చిత్రం అనేది శీర్షిక. ఈ సినిమాలోని క్యారెక్టర్లను పరిచయం చేస్తూ, అలాగే సినిమా అవుట్ లైన్ కూడా తెలిపే ఒక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. నిర్మాతగా, దర్శకుడిగా బాధ్యతలు వహిస్తూనే శివ కోన ఈ చిత్రంలో డ్యాని పాత్రలో నటించారు. అలాగే అందరికి సుపరిచితుడు అయిన బుల్లితెర నటుడు ఈటీవీ ప్రభాకర్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అలాగే ఈ చిత్రంలో మిగిలిన క్యారెక్టర్లను కూడా ఈ వీడియోలో పరిచయం చేసారు. నేహా దేశ్ పాండే ఈ చిత్రంలో ఆకాంక్షగా నటించగా, బద్రిగా కునాల్ కౌశల్, క్యాండీగా ప్రాచీ కెథర్, ఈషాగా రమ్య దేష్, ఫరూక్‌గా అభిలాష్ బండారి తదితరులు నటించారు. రీయూనిస్‌తో కలిసిన ఆరుగురు స్నేహితులు రిఫ్రెష్ నెస్ కోసం సరదాగా గడపడానికి ఒక డెస్టినేషన్ (అడవిలో ఒక ప్రాంతానికి) ఎంచుకొని అక్కడికి వెళ్తారు. అక్కడ ఊహించని సంఘటనలు ఎదురౌవుతాయి.

ఆ సంఘటనల నుంచి తమ ప్రాణాలు కాపాడుకోవడానికి వాళ్ళు చేసే పోరాటమే ఈ సినిమా. ఇదొక క్రైమ్ థ్రిల్లర్‌గానే కాకుండా అందమైన లవ్ స్టోరీని కూడా ప్రేక్షకులకు మేకర్స్ చూపించబోతున్నారు.


ప్రభాకర్



మూడు ముళ్ళతో ఒక్కటయ్యారు..

హీరో శర్వానంద్, రక్షితల వివాహ మహోత్సవం జైపూర్‌లోని లీలా ప్యాలెస్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. రామ్ చరణ్, సిద్ధార్థ్, అదితి రావు హైదరీ, యువి క్రియేషన్స్ వంశీ, విక్రమ్, ఆశిష్, హర్షిత్, హన్షిత తదితరులతోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ మహోత్సవానికి రెండు రోజుల ముందు మెహందీ, సంగీత్, హల్దీ ఈవెంట్స్‌తో పాటు 'పెళ్లికొడుకు' వేడుక వైభవంగా జరిగింది. ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లో శర్వానంద్, రక్షిత మ్యారేజ్ రిసెప్షన్‌ను గ్రాండ్‌గా నిర్వహించనున్నారు.

ఆ.. మ్యాజిక్ జరిగింది


తిరువీర్

తిరువీర్ ప్రధాన పాత్రలో రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వం వహించిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'పరేషాన్. సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ చిత్రాన్ని నిర్మించారు. హీరో రానా సమర్పణలో ఈనెల 2న ఈ చిత్రం విడుదలై, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించి మంచి విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ,"కేరాఫ్ కంచరపాలెం, సినిమా బండి, బలగం' చిత్రాలు చూసినప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో అలాంటి ఫీలింగే ఈ సినిమా చూసినప్పుడు కలిగింది. సినిమా చూసినప్పుడు మనల్ని మనం మర్చిపోతే అదే మ్యాజిక్. అలాంటి మ్యాజిక్ ఈ సినిమాకీ జరిగింది' అని తెలిపారు. "లగాన్' లాంటి టీం కలిసి చేసిన సినిమా ఇది. నేర్చుకుంటూనే సినిమా చేశాం. గెలవాలంటే లాస్ట్ బాల్‌కి సిక్స్ కొట్టాలి. మా అదృష్టం.. రానా వచ్చి సిక్స్ కొట్టించారు. ప్రేక్షకులు కోసం తీసిన సినిమా ఇది. సినిమా చూసిన అందరూ హ్యాపీగా ఫీలవుతున్నారు' అని హీరో తిరువీర్ చెప్పారు.

నవచిత్రం

ఈ వేసవిలోనే విడుదలకు సిద్ధం

బిగ్ బెన్ సినిమాస్ బ్యానర్ పతాకం పై త్వరలో విడుదల కాబోతున్న చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'- ఇచ్చట అందమైన ఫోటోస్ తీయబడును అనేది క్యాప్షన్. చెందు ముద్దు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో చైతన్య రావు హీరోగా నటించగా, లావణ్య హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ సినిమా నుంచి నాలుగవ పాటను యువ హీరో విశ్వక్ సేన్ విడుదల చేశారు.

'ఓ ముద్దుగుమ్మ' అంటూ సాగే ఈ పాట చాలా బాగుంది. ఇదొక రొమాంటిక్ పాట. శ్రేష్ఠ అందించిన లిరిక్స్ చాలా అర్థవంతంగా ఉన్నాయి. ప్రిన్స్ హెన్రీ అందించిన మ్యూజిక్ కూడా వినసొంపుగా ఉంది. మ్యూజిక్‌తో పాటు తన వాయిస్‌తో కూడా హెన్రీ బాగా మెప్పించారు. ముఖ్యంగా లిప్సిక గొంతు పాటకి బాగా సూట్ అయ్యింది. సినిమా పీరియడ్ బ్యాక్ డ్రాప్‌లో సాగనుంది. సాంగ్ వీడియోలో చూపించిన విజువల్స్ కూడా చాలా బాగున్నాయి. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ,'చైతన్య సినిమా పాటని లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. సాంగ్ అదిరిపోయింది. పాట చాలా బాగుంది. వింటున్నప్పుడే నేను కూడా హమ్ చేస్తున్నాను. ఈ సినిమాతో చైతన్య మరొక సర్ప్రైజ్ ఇస్తాడు' అని తెలిపారు. ఈ వేసవిలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.


చైతన్య రావు, లావణ్య

ఇప్పుడే పరిచయమే..

శివ కందుకూరి హీరోగా తెరకెక్కిన యూనిక్ ఇంటెన్స్ లవ్ స్టోరీ 'మను చరిత్ర'. మేఘా ఆకాష్, ప్రగతి శ్రీవాస్తవ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంతో భరత్ పెదగాని దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ప్రొద్దుటూరు టాకీస్ పతాకంపై ఎన్ శ్రీనివాస రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి 'ఇప్పుడే పరిచయమే..' పాటని హీరోయిన్ సంయుక్త మీనన్ లాంచ్ చేశారు. గోపిసుందర్ ఈ పాటని లష్ అండ్ మెస్మరైజింగ్ మెలోడీగా కంపోజ్ చేశారు. ఈ పాటకు ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ అందించిన సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అర్మాన్ మాలిక్ పాడిన ఈ పాట మళ్ళీ మళ్ళీ వినాలపించేలా ఉంది. ఈ పాటలో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. ఈనెల 23న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.


శివ కందుకూరి, మేఘా ఆకాష్

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.